www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



విశాఖలో ఎయిర్ ఇండియా విమానానికి
తప్పిన ముప్పు
బయలుదేరిన కొద్దిసేపటికే ఢీకొన్న పక్షి
దీంతో వెనక్కి మళ్లింపు.. విమానంలో 103 మంది
3

శుక్రవారం | 19-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 155 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి రా.11.37 తదుపరి చతుర్దశి, నక్షత్రం: ఆశ్లేష ఉ.7.06 తదుపరి మఖ, వర్జ్యం: రా.7.36-9.16, దుర్ముహూర్తం: ఉ.8.31-9.20, మ.12.32-1.21, అమృతఘడియలు: శేషం ఉ.7.16, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.07, సూర్యాస్తమయం: 6.10 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతోంది! కానీ... రాష్ట్ర ప్రజల్లో మాత్రం పేదరికం పెరుగుతోంది! 'తెల్లకార్డు' ఉండటమే పేదరికానికి ప్రామాణికమైతే.... ఇదే నిజం! రేషన్ బియ్యం తిన్నా, తినకపోయినా... కార్డు మాత్రం ఉండాల్సిందే! అధికారిక రికార్డుల్లో 'పేద' ముద్ర పడాల్సిందే! ఇదో వింత పరిస్థితి.

అంతా పేదలేనా?
ప్రగతి పరుగులో 'బీద' అరుపులేనా?

- 85 శాతం కుటుంబాలకు బియ్యం కార్డులు
- రాష్ట్రంలో పేదరికం తగ్గిందన్న నీతీ ఆయోగ్
- అయినా రేషన్ కార్డులు మాత్రం తగ్గేదే లేదు
- రాష్ట్రంలో 10.50 లక్షలకు పైగా కార్లు
- 1.22 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు
- రేషన్ కార్డుదారులు తినని బియ్యమంతా రీసేల్, ఇతర అవసరాలకే
- సంక్షేమ పథకాలతో ముడిపెట్టడమే సమస్య



1.71 కోట్ల కుటుంబాల్లో **1.45** కోట్ల కుటుంబాలు 'పేదవే'

రేషన్ బియ్యం వండుకుని తినే నిజమైన పేదలు 10 శాతమే

ఉచిత బియ్యంపై ఏటా రూ. **15** వేల కోట్ల వ్యయం



వీరంతా పేదలా?

రాష్ట్రంలో మొబైల్ యూజర్లు : **8.2** కోట్లు
(రెండేసి సిమ్‌లు వాడుతున్న వారు కోట్లలోనే)
ద్విచక్రవాహనాలు : **1,22,56,669**
కార్లు: **10,56,891**.. జీపులు : **10,615**
(2022 సామాజిక సర్వే ప్రకారం)

2024-25లో ఐటీ రిటర్న్స్ వేసిన వారు: **30.76** లక్షలు
(ఏ ఆదాయమూ లేకుండా రిటర్న్స్ వేసే వాళ్లు చాలా చాలా తక్కువ)

2024-25లో తలసరి ఆదాయం : **2.66** లక్షలు
(జాతీయ సగటు కంటే ఎక్కువ)

ఆంధ్రజ్యోతి పరిశీలన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
వివిధ రకాల గణాంకాలు, అధ్యయనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రగతిపథంలో దూసుకుపోతోంది. 'డబుల్ డిజిట్ గ్రోత్' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. రాష్ట్రంలో 2015-16లో పేదరికం 11.77 శాతం ఉండగా, 2023 నాటికి అది 4.2 శాతానికి తగ్గిందని నీతీ ఆయోగ్-2023 నివేదికలో వెల్లడించింది. ఈ రెండేళ్లలో ఇంకా తగ్గే ఉంటుంది. పేదలు, పేదరికం తగ్గినప్పుడు... బియ్యం కార్డులూ తగ్గాలి కదా!? అది మాత్రం జరగదు. పైగా రేషన్ కార్డులు ఏటేటా పెరుగుతున్నాయి. ఈ లెక్కన రాష్ట్రంలో పేదల సంఖ్య పెరుగుతున్నట్లే కదా? మరి... నీతీ ఆయోగ్ నివేదికను నమ్మేదెలా? నీతీ ఆయోగ్ నివేదికే నిజమైతే... రేషన్ కార్డులు ఎందుకు తగ్గడంలేదు? ఒకప్పుడు మన రాష్ట్రంలో

మిగతా 14వ పేజీలో...

రంగంలోకి ఈడీ!



ఒకేరోజు ఐదు రాష్ట్రాల్లో 20చోట్ల సోదాలు
మద్యం స్కామ్‌లో మనీ లాండరింగ్‌పై నజర్

నగల షాపులు, పండ్ల ఎగుమతి గోడౌన్లు, ప్యాకేజింగ్ యూనిట్లు, వైద్య సేవలందించే సంస్థలు... ఒకదానితో మరొక దానికి సంబంధంలేని వ్యాపార సంస్థలివి. కానీ... ఇవన్నీ 'మద్యం ముడుపుల'తో ముడిపడ్డాయి. గురువారం తెల్లవారుజాము నుంచి దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఈడీ జరిపిన సోదాల్లో వీటి మధ్య లింకులు బయటపడ్డాయి.

- రాజ్ కసిరెడ్డి భార్యకు చెందిన 'అరేట్'లో తనిఖీలు
- నగల దుకాణాలు, పండ్ల వ్యాపారాలు, రవాణా కంపెనీలతో ముడిపడిన స్కామ్
- నకిలీ ఇన్వాయిస్‌లు, డొల్ల కంపెనీలపై ఆరా
- మే నెలలో రాజ్ కసిరెడ్డిని ప్రశ్నించిన ఈడీ
- నాలుగు నెలలు పూర్తిస్థాయిలో కసరత్తు
- సేకరించిన ఆధారాల మేరకు సోదాలు
- అనూహ్య పరిణామంతో జగన్ అప్రమత్తం!
- సీనియర్ న్యాయవాదులతో చర్చలు




హైదరాబాద్ వెస్ట్ మారేడుపల్లిలోని వెలింగ్టన్ ఎన్‌క్లేవ్ ఇది. బంగారం వ్యాపారులు బూరుగు రమేష్, ఆయన కుమారుడు విక్రాంత్‌కు చెందిన ఈ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది.

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేల కోట్ల మద్యం స్కామ్‌లో ఎట్టకేలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఇప్పటిదాకా రాష్ట్ర ప్రభుత్వ 'సిట్' నుంచి సమాచార సేకరణకే పరిమితమైన ఈడీ... ఇప్పుడు క్షేత్రస్థాయిలో సోదాలు మొదలుపెట్టింది. గురువారం ఒకే రోజు, ఒకే సమయంలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ రాష్ట్రాల్లో దాదాపు 20 ప్రాంతాల్లో సోదాలు జరిపింది. జగన్ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల మద్యం స్కామ్‌పై 'సిట్' ఇప్పటికే మూడు చార్జిషీట్లు దాఖలు చేసింది. జగన్ సన్నిహితులైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మిథున్ రెడ్డి సహా కీలక నిందితులను అరెస్టు చేసింది. ఈ స్కామ్‌లో భాగంగా భారీగా షెల్ కంపెనీలను సృష్టించి, మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు 'సిట్' గుర్తించింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని

మిగతా 12వ పేజీలో...

పోలీసు కస్టడీకి మిథున్‌రెడ్డి
2 రోజులు అనుమతించిన ఏసీబీ కోర్టు
14



అసెంబ్లీలో జీఎస్టీపై మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు

జీఎస్టీ 2.0 గేమ్ చేంజర్
ఈ సంస్కరణలతో 140 కోట్ల మందికి లబ్ధి: సీఎం

- ఆర్థిక వ్యవస్థలోకి 2 లక్షల కోట్ల నగదు ప్రవాహం
- సంస్కరణలకు మద్దతిచ్చిన మొదటి రాష్ట్రం మనదే
- రాష్ట్ర ఖజానాకు రూ.8 వేల కోట్ల నష్టం.. అయినా ఆ మేరకు ఏపీ ప్రజలకు లబ్ధి
- మోదీ దేశానికి సంపద.. పన్నుల తగ్గింపుతో డిమాండ్, ఉత్పాదకత పెరుగుతాయి
- తద్వారా కొత్త ఉద్యోగాలు వస్తాయి
- పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతుంది
- అప్పులు చేసి సంక్షేమం ఇస్తే మనుగడ ఉండదు
- జీఎస్టీపై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రజలకు, ఆర్థిక వ్యవస్థలకూ లాభదాయకం
- ఆర్థిక ఆటుపోట్లున్నా దేశ ప్రగతి కోసం మద్దతు
- జీఎస్టీ 2.0 ప్రయోజనాలు అందరికీ తెలియాలి
- అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలను దేశ ప్రగతికి గేమ్ చేంజర్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. వీటివల్ల దేశ ఆర్థిక వ్యవస్థలోకి రూ.2 లక్షల కోట్ల నగదు ప్రవాహం వస్తుందని తెలిపారు. 140 కోట్ల మంది దేశ ప్రజలు లబ్ధి పొందుతారని అన్నారు. రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.8 వేల కోట్ల నష్టం వాటిల్లుతున్నా.. ఆ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. నాలుగు శ్లాబుల జీఎస్టీ పన్ను విధానాన్ని 2 శ్లాబులకు కుదించి మరింత సరళీకృతం చేశారని.. అలాగే 12 శాతం పన్ను పరిధిలో ఉన్న 99 శాతం వస్తువులు జీరో శాతానికి రావడం ప్రజలకు నిజమైన పండుగేనని చెప్పారు. వారికి దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలన్నీ ఒకేసారి వచ్చినట్లేనని అన్నారు. గురువారం శాసనసభలో.. జీఎస్టీ సంస్కరణలతో

మిగతా 13వ పేజీలో...

27 వరకు సమావేశాలు
- 8 పని దినాలకు కుదిస్తూ బీఏసీలో నిర్ణయం
- జీరో అవర్‌లోనూ మంత్రులు ఉండాలి: సీఎం

ఉల్లి కిలో 50 పైసలు!
కర్నూలు వేలంలో వ్యాపారులు మరీ దారుణం



కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి నిల్వలు

కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): "కొనేటప్పుడు చింతపండు రేటు.. అమ్మేటప్పుడు బంగారం రేటు.." అనే సామెత రాష్ట్రంలో ఉల్లి వ్యాపారులకు అతికినట్టు సరిపోతుందేమో..! రాయలసీమ జిల్లాల్లో ఉల్లి ధరలు పతనం కావడంతో రైతులను ఆదుకునేందుకు క్వింటాకు రూ.1200 చెల్లించి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించిన కూటమి ప్రభుత్వం వాటికి కర్నూలు మార్కెట్‌లో గురువారం వేలంపాట నిర్వహించగా... క్వింటా ఉల్లిని కనిష్ఠంగా రూ.50కి కొనుగోలు చేశారు. అంటే.. కిలో 50 పైసలన్న మాట..! గరిష్ఠంగా

మిగతా 12వ పేజీలో...



రియాద్‌లో సౌదీ యువరాజు సల్మాన్‌తో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

మాలో ఒకరిపై దాడి చేస్తే.. మా ఇద్దరిపై చేసినట్టే!
పాక్-సౌదీ మధ్య 'నాటో' తరహా రక్షణ ఒప్పందం

- ఖతార్‌లో ఇటీవల జరిగిన ముస్లిం దేశాల భేటీలో 'ఇస్లామిక్ నాటో' ఏర్పాటుకు పలు దేశాల ఒత్తిడి
- ఆ భేటీ జరిగిన 2 రోజులకే పాక్-సౌదీ ఒప్పందం
- మన దేశంపై పడే ప్రభావాలను పరిశీలిస్తున్నాం: భారత్
- ఇది మోదీ మరో దౌత్య వైఫల్యమే.. కాంగ్రెస్ విమర్శలు

2


ఓట్ల దొంగలకు సీఈసీ రక్ష!



- ప్రజాస్వామ్య వినాశకులను జ్ఞానేశ్ కాపాడుతున్నారు
- కర్ణాటకలోని ఆళంద అసెంబ్లీ నియోజకవర్గంలో ఆన్‌లైన్ ద్వారా కాంగ్రెస్ ఓట్ల తొలగింపు
- దానిపై దర్యాప్తును సీఈసీ అడ్డుకుంటున్నారు
- వివరాల కోసం కర్ణాటక సీఐడీ 18 నెలల్లో 18 లేఖలు రాసినా ఈసీ సమాచారం ఇవ్వలేదు
- త్వరలోనే 'హైడ్రోజన్ బాంబు'.. మాస్టర్‌మైండ్ ఎవరో ప్రజల ముందుంచుతా: రాహుల్ గాంధీ

2

ఆయన ఆరోపణలు అబద్ధం: ఎన్నికల కమిషన్
ఆన్‌లైన్లో ఎవరూ ఓట్లు తొలగించలేరు




హాయ్‌ల్యాండ్‌లో 65 రోజులు ఏం చేశారు?

- ఏపీపీఎస్సీ వాస్తవాలు దాస్తోంది.. అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటోంది
- 20లక్షలు ఖర్చు చేశారు.. పోలీసులను పెట్టారు.. సింగిల్ జడ్జి తీర్పుపై అప్పుడే ఫిర్యాదు చేయలేదేం?.. ఏపీపీఎస్సీకి హైకోర్టు సూటి ప్రశ్నలు
- పీఎస్ఆర్‌పై సిట్ దర్యాప్తు నివేదిక వచ్చేదాకా వేచి ఉండాలి: ఏజీ విజ్ఞప్తి

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ప్రశ్నపత్రాల మూల్యాంకనం విషయంలో హాయ్‌ల్యాండ్‌లో ఏం జరిగిందనేది బయటపెట్టకుండా ఏపీపీఎస్సీ వాస్తవాలు దాస్తోందని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. హాయ్‌ల్యాండ్ వేదికగా జవాబుపత్రాల మూల్యాంకనం జరిగిందా...లేదా అనేది ప్రస్తుత కేసులో కీలకాంశమని గుర్తుచేసింది. జవాబుపత్రాలను మూల్యాంకనం చేయకుంటే 65 రోజులు అక్కడ ఏమి చేశారని ఏపీపీఎస్సీని ప్రశ్నించింది. హాయ్‌ల్యాండ్‌లో పోలీస్ సిబ్బందిని సెక్యూరిటీగా

మిగతా 14వ పేజీలో...

మెగా డీఎస్సీ సభ వాయిదా
భారీ వర్షాల నేపథ్యంలో నిర్ణయం
14

భారత్.. సంపన్నుల ఫ్యాక్టరీ


దేశంలో పెరుగుతున్న మిలియనీర్లు
- 8.5 కోట్లకుపైగా ఆస్తి కలిగిన 8.71 లక్షల కుటుంబాలు
- 2021తో పోలిస్తే 90 శాతం పెరుగుదల
- ముంబై, ఢిల్లీ, బెంగళూరుల్లోనే అధికం
- బంగారం, షేర్లు, భూములపై పెట్టుబడులు
- బెంజ్ హురూన్ ఇండియా వెల్త్ నివేదిక


2

డ్రగ్స్ అడ్డా భారత్
2

అక్రమ తయారీ, రవాణాకు స్థావరం



- మరోసారి విషం చిమ్మిన డొనాల్డ్ ట్రంప్
- చైనా, పాక్ సహా 23 దేశాలతో జాబితా
- ప్రాణాంతక 'ఫెంటానిల్' పాపం చైనాదే
- కాంగ్రెస్‌కు నివేదిక ఇచ్చిన అధ్యక్షుడు


3

కుప్పకూలాడు
కుర్రాడు.. పరిగెడుతూ కుప్పకూలాడు
ఎన్‌సీసీ ఎంపిక పోటీల్లో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

బంగ్లాదేశీ చొరబాటుదారులను కాపాడేందుకే రాహుల్ యాత్ర

» ఓట్ చోరీ యాత్రపై కేంద్ర మంత్రి అమిత్ షా

పట్నా, సెప్టెంబరు 18: కర్ణాటకలోని ఆళంద నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు అంశంలో ఎన్నికల సంఘాన్ని తప్పుబడుతూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. తప్పుడు కథనాలను ప్రచారం చేయడం కాంగ్రెస్‌కు అలవాటైపోయిందని మండిపడ్డారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను కాపాడేందుకే ఓట్ చోరీ పేరిట రాహుల్ గాంధీ బిహార్‌లో యాత్ర చేపట్టారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చొరబాటుదారులకు ఓటుహక్కు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలా? అంటూ ఆయన ప్రశ్నించారు.

సుంకాలపై 10 వారాల్లో పరిష్కారం: సీఈఏ

కోల్‌కతా, సెప్టెంబరు 18: భారత్‌పై అమెరికా విధించిన సుంకాలకు సంబంధించి వచ్చే 8-10 వారాల్లో పరిష్కారం లభించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్టు కేంద్రప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి అనంత నాగేశ్వరన్ అన్నారు. నవంబరు 30 నాటికి భారత్‌పై విధించిన 25% అదనపు సుంకాన్ని తొలగించవచ్చని ఆశిస్తున్నట్టు చెప్పారు.

శశికళ కేసు.. హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

హైదరాబాద్, చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకును రూ.200 కోట్ల మేర మోసగించిన కేసుకు సంబంధించి తమిళనాడు మాజీ సీఎం జయలలితకు సహచరి అయిన వీకే శశికళ బినామీలపై ఈడీ దృష్టి సారించింది. 2022లో సీబీఐ నమోదు చేసిన ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన ఈడీ.. చెన్నై, హైదరాబాద్‌ల్లో గురువారం సోదాలు నిర్వహించింది. శశికళకు బినామీ అని ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్గ్ గ్రూపు అధినేత జి.రామకృష్ణారెడ్డి(జీఆర్‌కే రెడ్డి) లక్ష్యంగా ఈడీ బృందాలు గురువారం దాడులు చేశాయి. హైదరాబాద్‌లోని శామీర్‌పేట, పంజాగుట్ట ప్రాంతాల్లో జీఆర్‌కే రెడ్డికి చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ బృందాలు సోదాలు చేశాయి. చెన్నైలోని సైదాపేట శ్రీనగర్ ప్రాంతంలోని రామకృష్ణారెడ్డి ఇంట్లో, తిరువాన్మియూరు, కోడంబాక్కం, వెస్ట్ మాంబళం సహా ఆరు ప్రాంతాల్లో కూడా ఈడీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి.

అన్ని మతాలనూ గౌరవిస్తా!: సీజేఐ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: అన్ని మతాలనూ తాను గౌరవిస్తానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో ఆలయాల సముదాయంలో ఉన్న విష్ణుమూర్తి విగ్రహం పునరుద్ధరణపై దాఖలైన ఓ పిటిషన్ మీద తాను చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో కొందరు తప్పుడుగా ప్రచారం చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే, మతాలన్నింటి పట్లా తనకు గౌరవభావం ఉందని ఆయన గురువారం ఉద్ఘాటించారు. సీజేఐ వ్యాఖ్యలు హిందూ మత విశ్వాసాల్ని అవమానించే విధంగా ఉన్నాయని, ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా ఉంటే మంచిదని వీహెచ్‌పీ జాతీయాధ్యక్షుడు అలోక్ కుమార్ పేర్కొన్నారు.

1 నుంచి ఆన్‌లైన్ గేమింగ్ చట్టం అమలు: కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: నూతనంగా రూపొందించిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రోత్సాహ, నియంత్రణ చట్టం అక్టోబరు 1నుంచి అమల్లోకి వస్తుందని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. గత నెలలో పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ చట్టం ప్రకారం అన్ని రకాల ఆన్‌లైన్ మనీ గేమ్స్‌ను నిషేధిస్తున్నట్టు తెలిపారు. ఈ-స్పోర్ట్స్ ఇతర ఆన్‌లైన్ గేమ్స్‌కు ప్రోత్సాహం ఉంటుందని చెప్పారు.

బాలల లఘు నాటిక పోటీలకు ఆహ్వానం

గుంటూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహాల్లో భాగంగా జాతీయస్థాయి బాలల లఘు తెలుగు నాటికల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు పాఠశాలలు, సాంస్కృతిక సంస్థల నుంచి ఎంట్రీలు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 'నాటిక నిడివి 15 నిమిషాలు మాత్రమే ఉండాలి. ఎంపికైన నాటికలను నవంబరు 5న గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రదర్శిస్తాం. నాటిక స్క్రిప్టును అక్టోబరు 15వ తేదీలోపు 83310 20896 అనే వాట్సాప్ నంబరుకు పంపాలి' అని గజల్ శ్రీనివాస్ సూచించారు.

కాటేసిన పామునే కొరికి చంపాడు!

» ఆపై పక్కలో పెట్టుకుని రాత్రంతా నిద్ర

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతర జోరులో ఫూటుగా మద్యం తాగాడు.. రాత్రి తూలుతూ ఇంటి దారి పట్టాడు.. దారిలో పాము కాటేసింది.. అంతే స్పీడుగా దాన్ని పట్టుకున్నాడు.. 'నన్నే కాటేస్తావా..' అని బూతులు తిడుతూ కసక్కున దాని తలను నోటితో కొరికేశాడు. తల లేని పామును తీసుకుని ఇంటికి చేరాడు. తెల్లవారాక అతడి పక్కలో నల్లత్రాచు పామును చూసిన కుటుంబ సభ్యులు భయంతో కొయ్యబారిపోయారు. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలో ఈ సంఘటన బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగింది. నల్లత్రాచు కాటుకు గురైన వెంకటేశ్ (48)ను వెంటనే శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు తరలించారు.

వారం రోజులు ఫాలో అయ్యి.. జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడికి యత్నం

» అనంతపురం జీజీహెచ్‌లో ఘటన

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని సర్వజన వైద్యశాలలో ఓ జూనియర్ డాక్టర్‌పై అత్యాచార యత్నం జరిగింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఓ అపరిచితుడు వారం రోజులపాటు డాక్టర్ కదలికలపై నిఘా వేశాడు. మూడు రోజుల క్రితం రాత్రి సమయంలో ఆస్పత్రిలోకి ప్రవేశించి ఆమెను ఓ గదిలోకి లాక్కువెళ్లే ప్రయత్నం చేశాడు. ఆ డాక్టర్ భయంతో కేకలు వేయడంతో మేల్కొన్న రోగుల బంధువులు, మరికొందరు ఆ వ్యక్తికి దేహశుద్ధి చేశారు. తర్వాత అతన్ని వదిలేయడంతో తప్పించుకుని వెళ్లిపోయాడు. ఈ సంఘటన గురించి తెలిసినా ఆస్పత్రి ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచారు. ఘటన జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడానికి బాధితురాలు ఔట్ పోస్టు పోలీసులను కలిశారు. వారు నిర్లక్ష్యంగా వ్యవహరించి టూ టౌన్ పోలీసులను కలవాలంటూ ఉచిత సలహా ఇచ్చారు. తన విభాగానికి చెందిన సీనియర్ డాక్టర్ దృష్టికి తీసుకువెళితే.. ఆర్ఎంఓకు చెప్పండి అంటూ ఆయన వెళ్లిపోయారు. ఈ వ్యవహారంలో ఇంత వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఆ అపరిచిత వ్యక్తి కదలికలన్నీ సీసీ కెమెరాల ఫుటేజీలో రికార్డు అయినట్లు తెలిసింది. వారం రోజులు వెంబడించినట్లు కూడా వాటిని చూసి తెలుసుకున్నట్లు సమాచారం. గతేడాది కోల్‌కతాలోని ఓ వైద్య కళాశాలలో జూడాపై లైంగిక దాడి ఘటన దేశాన్ని కుదిపేసింది. అయినా ఇక్కడి అధికారుల్లో చలనం లేకపోవడం, పోలీసులు తేలిగ్గా తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది. ఆస్పత్రి అధికారుల సహకారం లేకపోవడం, పోలీసులు పట్టించుకోకపోవడంతో బాధితురాలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆమె సన్నిహితులు చెప్పారు.

అనిల్ అంబానీ, రాణా కపూర్‌లపై సీబీఐ చార్జిషీటు

» రూ.2,796 కోట్ల బ్యాంకు నిధుల దుర్వినియోగ ఆరోపణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: అనిల్ ధీరూబాయ్ అంబానీ(ఏడీఏ) గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీ, యస్ బ్యాంకు మాజీ సీఈఓ, రాణా కపూర్‌లపై సీబీఐ గురువారం ముంబయి ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఇద్దరూ కుమ్మక్కయి రూ.2,796 కోట్ల బ్యాంకు నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించింది. రాణా కపూర్ భార్య బిందు కపూర్, కుమార్తెలు రాధా కపూర్, రోషిణీ కపూర్‌లపై కూడా అభియోగ పత్రాలను సమర్పించింది. అనిల్ అంబానీ గ్రూపు పరిశ్రమలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలిసినప్పటికీ, వాటిపై ఆర్థిక సంస్థలు కన్నేసి ఉంచినప్పటికీ యస్ బ్యాంకు తరఫున భారీగా పెట్టుబడులు పెట్టినట్టు ఆరోపించింది. ఈ విషయంలో సీఈఓగా రాణా కపూర్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొంది. ప్రతిఫలంగా రాణా కపూర్ కుటుంబ సభ్యుల కంపెనీల్లో అనిల్ అంబానీ గ్రూపు కంపెనీలు పెట్టుబడులు పెట్టాయని తెలిపింది. ఇదంతా నీకిది-నాకిది తరహాలో సాగిందని ఆరోపించింది.

ఇక ఏటా అతి భారీ వర్షాలే!

తరచుగా కుండపోత వానలకు అవకాశం.. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులే కారణం

దేశంలో ఈసారి ఎన్నడూ లేనట్టుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అదీ ఉన్నట్టుండి కుండపోత (క్లౌడ్ బరస్ట్) వానలు పడుతున్నాయి. ఒకట్రెండు గంటల్లోనే పది, పదిహేను సెంటీమీటర్ల వర్షపాతంతో వరదలు వస్తున్నాయి. హిమాలయాలు, కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, బురద వరదలు వంటివి అతలాకుతలం చేస్తున్నాయి. ఈ రుతుపవనాల సీజన్‌లో ఆగస్టు చివరి నుంచి ఇప్పటి వరకు చాలా ప్రాంతాల్లో పది నుంచి ఇరవై సెంటీమీటర్ల వర్షాలు నమోదవుతూనే ఉన్నాయి. ఈ సీజన్‌లో మాత్రమేకాదు.. ఇకముందు ఏటా ఇలాగే అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం వల్ల ఏర్పడుతున్న వాతావరణ మార్పుల (క్లైమేట్ చేంజ్) ప్రభావమే ఇది అని స్పష్టం చేస్తున్నారు.

ఎడారుల్లోనూ వరదలు.. పచ్చని ప్రాంతాల్లో బీభత్సం

వాతావరణ మార్పుల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటోంది. పొడి ప్రాంతాలు పచ్చబడుతూ, పచ్చని ప్రాంతాలు మరింత చిత్తడిగా మారుతూ ఉంటే.. మరోవైపు మంచు కురిసే చోట ఎండలు మంటరేపుతున్నాయి. వందల ఏళ్లుగా ఎడారులుగా ఉన్న ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో భారీ వర్షాలు, వరదలు వస్తున్నాయి. గడ్డి, మొక్కలు పెరుగుతూ పచ్చబడుతున్నాయి. గత వందేళ్లలో ఎన్నడూ లేనట్టుగా గతేడాది సెప్టెంబరులో సహారా ఎడారిలో అతిభారీ వర్షాలు కురిసి, వరదలు వచ్చాయి. ఎడారి దేశం సౌదీ అరేబియాలో కొన్నేళ్లుగా భారీ వర్షాలు పడుతూ, ఎడారి ప్రాంతం పచ్చగా మారుతోంది. ఇక ఈ ఏడాది జనవరి తొలి వారంలో, గత నెల 29న ఆ దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలతో వరదలు రావడం గమనార్హం. ఇక సాధారణంగా వర్షాలు పడే ప్రాంతాల్లో.. కొన్నేళ్లుగా అతి భారీ, కుండపోత వానలు కురుస్తున్నాయి. తీవ్రమైన వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ సహా ఇతర దక్షిణాసియా దేశాల్లో వర్షపాతం, కుండపోత వానల తీవ్రత పెరిగిపోయింది. గ్లోబల్ వార్మింగ్‌తో సముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆ వేడితో ఆవిరయ్యే నీటి శాతం పెరుగుతోంది. మరోవైపు గాలి కూడా వేడెక్కి నీటి ఆవిరిని నిలుపుకొనే సామర్థ్యం మరింత ఎక్కువవుతోంది. అలా ఎక్కువ తేమతో కూడిన గాలులు అతి భారీ వర్షాలకు కారణమవుతున్నాయి. ప్రధానంగా పర్వత ప్రాంతాల్లో, అల్పపీడనాలు నెలకొనే ప్రాంతాల్లో.. దట్టమైన క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి కుండపోత వానలు పడుతున్నాయి. ప్రస్తుతం హిందూ మహా సముద్రం, అరేబియా సముద్రం మీదుగా వీస్తున్న రుతుపవనాల్లో అధిక తేమ కారణంగానే దక్షిణాసియా ప్రాంతంలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ నిపుణులు తేల్చారు.



నైరుతి రుతుపవనాల్లో మార్పులు

వందల ఏళ్లుగా పరిశీలిస్తున్నా కూడా ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకు నైరుతి రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా ఒక క్రమానుగతంగా వానలు కురిసేవి. కానీ కొన్నేళ్లుగా పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడం లేదా మరింత ముందుగానే రావడం, కొన్ని రోజుల పాటు వరుసగా భారీ వర్షాలు కురవడం తర్వాత 20-25 రోజుల పాటు వానల జాడే లేకుండా పోవడం (డ్రైస్పెల్), పైగా ఈ సమయంలో సాధారణంగా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవడం పరిపాటిగా మారింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

మధ్యప్రాచ్యం నుంచి వీస్తున్న గాలులతోనూ..

మధ్యప్రాచ్య ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా తరచూ అల్పపీడన పరిస్థితులు ఏర్పడుతున్నాయని.. అక్కడి నుంచి తూర్పు వైపు వీస్తున్న గాలులు.. ఇక్కడ నైరుతి రుతుపవనాలతో కలుస్తున్నాయని బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త అక్షయ్ దేవరాస్ వెల్లడించారు. దీనితో భిన్నమైన వాతావరణ పరిస్థితి ఏర్పడి ఉత్తరాది రాష్ట్రాల్లో అతిభారీ వర్షాలు పడుతున్నాయని, దక్షిణాదిపైనా ప్రభావం ఉంటోందని తెలిపారు. సాధారణంగా మధ్యప్రాచ్యం నుంచి ఉత్తరం వైపు.. అంటే యూరప్ వైపు గాలులు వీస్తాయని, కానీ కొన్నేళ్లుగా తూర్పు వైపు వీస్తున్నాయని చెప్పారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా వాతావరణం పైపొరల్లోని జెట్‌స్ట్రీమ్‌ల (భూఉపరితలం నుంచి సుమారు 12 నుంచి 25 కిలోమీటర్ల ఎత్తులో అత్యంత వేగంగా జరిగే గాలి ప్రవాహాలు)లో మార్పులే దీనికి కారణమని వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఈ పరిస్థితి కొనసాగుతుందని తెలిపారు. పశ్చిమ దిశ నుంచి వస్తున్న తేమతో కూడిన గాలుల కారణంగా.. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కుంభవృష్టి కురుస్తోందని గత నెలాఖరులో భారత వాతావరణ విభాగం చీఫ్ మృత్యుంజయ మహాపాత్ర ప్రకటించారు కూడా.

\- సెంట్రల్ డెస్క్

పదేళ్లుగా పెరిగిపోతున్న క్లౌడ్ బరస్ట్ ఘటనలు

- ఏదైనా పరిమిత ప్రాంతంలో గంటలో 10 సెంటీమీటర్లు, అంతకన్నా ఎక్కువ వర్షం పడితే క్లౌడ్ బరస్ట్ అంటారు. మన దేశంలో పదేళ్లుగా క్లౌడ్ బరస్ట్ ఘటనలు బాగా పెరిగాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.
- ఈ ఏడాది జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్ తదితర హిమాలయ రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో క్లౌడ్ బరస్ట్, ఆకస్మిక వరదల ఘటనలు జరిగాయి. వందలాది మంది మరణించారు. హిమాలయాల్లోని మంచు ప్రాంతాలు, హిమానీ నదాలపై భారీ వర్షం కురవడంతో.. ఈ నీటితో పాటు మంచు కూడా వేగంగా కరిగి ఆకస్మిక వరదలకు కారణం అవుతోందని గ్రాజ్ యూనివర్సిటీ శాస్త్రవేత్త జేకబ్ స్టైనర్ తెలిపారు.
- ప్రస్తుత నైరుతి సీజన్‌కు సంబంధించి సెప్టెంబర్ 17 వరకు దేశంలో కురవాల్సిన సాధారణ వర్షపాతం 80.6 సెం.మీ.కాగా, ఈసారి 86.9 సెం.మీ. (8% అదనం) కురిసింది.
- ఉత్తరాది రాష్ట్రాల్లో 32% అదనంగా, దక్షిణ, మధ్య భారత రాష్ట్రాల్లో 11% అదనంగా వానలు కురిశాయి. కానీ ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమబెంగాల్, ఒడిశా తదితర తూర్పు రాష్ట్రాల్లో 18% లోటు నమోదైంది.

లోకం తీరు

మాదకద్రవ్యాలు ఉత్పత్తి చేస్తున్న 23 దేశాల జాబితాలో ఇండియాను చేర్చిన ట్రంప్



'డ్రగ్స్' అడ్డా భారత్

» మరోసారి విషం చిమ్మిన డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 18: ప్రతీకార సుంకాలు విధించినా లొంగని భారత్‌పై విషప్రచారాన్ని అమెరికా ముమ్మరం చేసింది. అక్రమంగా డ్రగ్స్ ఉత్పత్తి, రవాణాకు భారత్ అడ్డాగా మారిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. కాంగ్రెస్‌కు తాజాగా సమర్పించిన ప్రెసిడెన్షియల్ డిటర్మినేషన్ రిపోర్టులో ఆయన ఆ ఆరోపణలు చేశారు. అమెరికా పౌరుల ప్రాణాలకు ముప్పుగా మారిన సింథటిక్ డ్రగ్ ఫెంటానిల్ ఉత్పత్తికి వాడే రసాయనాలను పెద్దఎత్తున సమకూరుస్తుందంటూ చైనాపై ట్రంప్ విరుచుకుపడ్డారు. డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోలేకపోతున్నాయంటూ అఫ్ఘానిస్థాన్, బొలీవియా, మయన్మార్, కొలంబియా, వెనెజువెలాలపై ధ్వజమెత్తారు. పాకిస్థాన్ పేరు కూడా ప్రస్తావించిన ఆయన ఈ జాబితాలో మొత్తం 23 దేశాలు ఉన్నాయన్నారు. అమెరికాలోకి అక్రమంగా వస్తున్న డ్రగ్స్‌ను తయారుచేస్తున్న ప్రధాన కేంద్రాలుగాను లేక రవాణా స్థావరాలుగాను ఈ దేశాలు పనిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. డ్రగ్స్‌ను తయారుచేస్తున్న సంస్థలతోపాటు, వాటి అక్రమ రవాణాకు ఈ సంస్థలు వాడుకుంటున్న దేశాలూ ఇందుకు బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు.

భారతీయ వ్యాపారులపై అమెరికా వేటు

ఫెంటానిల్‌ను తయారుచేసి అమెరికాకు అక్రమంగా రవాణాచేసిన వ్యవహారంలో భారతీయ కార్పొరేట్లు, వ్యాపారులపై ఆ దేశం వేటు వేసింది. వారికి, వారి కుటుంబాలకు వీసాలను రద్దుచేస్తున్నట్టు ప్రకటించింది. భవిష్యత్తులోనూ అమెరికాలోకి వారి ప్రవేశాలను నిరోధిస్తామని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. సింథటిక్ డ్రగ్స్ నుంచి అమెరికాను రక్షించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. దీనిపై ఇప్పటి వరకు భారత్ స్పందించలేదు. అయితే, ఏదో కారణం చూపించి భారతీయులకు వీసాలను నియంత్రించడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి.

మాలో ఒకరిపై దాడి చేస్తే.. మా ఇద్దరిపై చేసినట్టే!

» పాక్-సౌదీ మధ్య 'నాటో' తరహా రక్షణ ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: నాటో దేశాల్లో ఏ దేశంపై అయినా దాడి జరిగితే.. అది తమ కూటమి మొత్తంపై జరిగిన దాడిగా భావించి నాటో దేశాలు దాని రక్షణకు ముందుకు వస్తాయి! 'వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం' పేరిట.. అదే తరహా ఒప్పందాన్ని ఇప్పుడు పాకిస్థాన్- సౌదీ అరేబియా కుదుర్చుకున్నాయి. దాని ప్రకారం.. ఆ రెండు దేశాల్లో ఏ దేశంపై ఇతర దేశాలు దాడికి దిగినా రెండూ కలిసి యుద్ధం చేస్తాయి. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ రియాద్ పర్యటన సందర్భంగా ఈ ఒప్పందం కుదిరింది. షెహబాజ్ షరీఫ్- సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ దీనిపై సంతకం చేశారు. ఆ సమయంలో పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిఫ్ మునీర్, పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్, రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ అక్కడే ఉన్నారు. అనంతరం ఇరుదేశాలూ కలిసి దీనిపై ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని విస్తరించడం, తమ రెండు దేశాల్లో ఏ దేశంపై దాడి జరిగినా ఉమ్మడిగా ఎదుర్కోవడమే ఈ ఒప్పందం ఉద్దేశమని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి. కాగా.. పాక్-సౌదీ నడుమ ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న చర్చల ఫలితమే ఈ ఒప్పందం అని సౌదీ అరేబియాకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఒప్పందం.. ఇటీవలికాలంలో జరిగిన ఎలాంటి ఘర్షణకూ ప్రతిస్పందన కాదని ఆయన పేర్కొన్నారు.

పరిశీలిస్తున్నాం..

పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య దశాబ్దాలుగా చిరకాలంగా కొనసాగుతున్న రక్షణ సహకారాన్ని అధికారికం చేసే ఒప్పందం ఒకటి పరిశీలనలో ఉందన్న విషయం భారత ప్రభుత్వానికి తెలుసని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం వల్ల కలిగే వ్యూహాత్మక, భద్రతా ప్రభావాలను భారత ప్రభుత్వం సమీక్షిస్తుందని ఆయన పేర్కొన్నారు. కాగా, పాకిస్థాన్‌తో ఈ ఒప్పందం కుదిరినప్పటికీ.. న్యూఢిల్లీతో తమ సంబంధాలు మరింత బలోపేతమవుతాయని సౌదీ సీనియర్ అధికారి ఒకరు పునరుద్ఘాటించారు. కాగా, ఈ ఒప్పందం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాని మోదీని తీవ్రంగా విమర్శించింది. "ఇది మన దేశ భద్రతకు ఆందోళన కలిగించే విషయం. ప్రధాని మోదీ విస్తృతంగా ప్రచారం చేసుకునే వ్యక్తిత్వ ఆధారిత దౌత్యానికి ఇది మరో ఎదురుదెబ్బగా కాంగ్రెస్ భావిస్తోంది" అని ఆ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో విమర్శించారు.

'ఇస్లామిక్ నాటో'కు బీజం?

ఖతార్ రాజధాని దోహాలోని హమాస్ నేతలే లక్ష్యంగా ఈ నెల 9న ఇజ్రాయెల్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడి నేపథ్యంలో.. అరబ్‌లీగ్, ఇస్లామిక్ సహకార సంస్థ (ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో-ఆపరేషన్(ఓఐసీ)లో సభ్యత్వం ఉన్న దాదాపు 40 దేశాల అధినేతలు సెప్టెంబరు 15న ఖతార్ నిర్వహించిన అత్యవసర సమావేశానికి హాజరయ్యారు. ఆ భేటీలో ఈజిప్టు, ఇరాన్, ఇరాక్, పాకిస్థాన్ తదితర దేశాలు 'అరబ్ నాటో' ఏర్పాటుకు ఒత్తిడి చేశాయి. ఆ భేటీ అయిన కొద్దిరోజులకే పాక్-సౌదీ నడుమ ఈ ఒప్పందం కుదరడం గమనార్హం. ఈ ఒప్పందం వల్ల భారత్‌కు ఎప్పటికైనా ప్రమాదం ఉంటుంది. ఒక్కసారి ఊహించండి.. పాక్ తన కుటిల బుద్ధితో భారత్‌పై నేరుగా దాడికి పాల్పడకుండా ఉగ్రవాదుల ద్వారా దాడులు చేయిస్తే.. దానికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' తరహా చర్య చేపట్టినప్పుడు.. పాక్‌కు మద్దతుగా సౌదీ రంగంలోకి దిగితే? తన వద్ద ఉన్న ఎఫ్-15 యుద్ధవిమానాలు, యూరోఫైటర్ టైఫూన్లను పాక్‌కు సాయంగా పంపిస్తే? ఈ ఒప్పందంవల్ల అలా జరిగేప్రమాదం ఉంది. అయితే.. పాక్ దృష్టి భారత్‌పై ఉండొచ్చుగానీ.. సౌదీ అసలు లక్ష్యం ఇజ్రాయెల్ అని రక్షణరంగ విశ్లేషకులు కొందరు అభిప్రాయపడుతున్నారు.

మోదీతో మంచి సంబంధాలున్నాయ్

» నేను ఇండియాకు చాలా దగ్గర: ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 18: భారత ప్రధాని నరేంద్ర మోదీతో తనకు స్నేహ సంబంధాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. బుధవారం మోదీకి ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పగా, గురువారం సామాజిక మాధ్యమాల్లో మరో పోస్టు పెట్టారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పినందుకు ట్రంప్‌నకు కృతజ్ఞతలు చెబుతూ మోదీ పోస్టు పెట్టారు. దానిపై స్పందించిన ట్రంప్... వాషింగ్టన్, ఢిల్లీల మధ్య చాలా మంచి సంబంధాలు ఉన్నాయని, మోదీతో తనకు వ్యక్తిగత సాన్నిహిత్యం ఉందని తెలిపారు. "నేను ఇండియాకు చాలా దగ్గర. భారత ప్రధాన మంత్రికి కూడా చాలా దగ్గర. నిన్నే ఆయనతో మాట్లాడా. పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పా. మా మధ్య చాలా మంచి సంబంధాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యపర ఘర్షణలు నెలకొన్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

భారత్.. సంపన్నుల ఫ్యాక్టరీ

» బెంజ్ హురూన్ ఇండియా వెల్త్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: మన దేశంలో సంపన్నుల సంఖ్య ఏటేటా భారీగా పెరుగుతోంది. మిలియనీర్లను తయారు చేసే ఫ్యాక్టరీగా భారత్ మారుతోంది. ఈ విషయం మెర్సిడెస్ బెంజ్ హురూన్ ఇండియా వెల్త్ రిపోర్టు- 2025 స్పష్టం చేసింది. దేశంలో లక్ష్మీపుత్రులు విలాస వస్తువులను కొనుగోలు చేస్తున్నారని, పలు రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారని, ప్రపంచాన్నే ప్రభావితం చేస్తున్నారని ఆ నివేదిక వివరించింది. ఆ నివేదిక ప్రకారం.. 8.5 కోట్లకు (1 మిలియన్ డాలర్లు)పైబడి ఆస్తి కలిగిన మిలియనీర్ల కుటుంబాలు ప్రస్తుతం దేశంలో 8.71 లక్షలు ఉన్నాయి. 2021తో పోలిస్తే ఆ సంఖ్య 90 శాతం పెరిగింది. అప్పట్లో మొత్తం దేశంలోని కుటుంబాల్లో ఈ మిలియనీర్ల కుటుంబాలు 0.17 శాతంగా (4,58,000) ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 0.31 శాతానికి (8,71,000) ఎగబాకింది. సంపన్నుల రాజధానిగా ముంబై తన ఖ్యాతిని నిలబెట్టుకుంది. మొత్తం మహారాష్ట్రలో 1.78 లక్షల కుటుంబాలు మిలియనీర్లు కాగా, ఒక్క ముంబైలోనే 1.42 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఇక ఢిల్లీలో 79,800, తమిళనాడులో 72,600, కర్ణాటకలో 68,800, గుజరాత్‌లో 68,300 కుటుంబాలు భోగభాగ్యాలతో తులతూగుతున్నాయి. మిలియనీర్ల సంఖ్య జోరుగా పెరుగుతుండగా, బిలియనీర్ల సంఖ్య పెరుగుదల మాత్రం నత్తనడకన కొనసాగుతోంది. 2017-25 మధ్య మిలియనీర్ కుటుంబాలు 445% పెరిగాయి. కానీ రూ.100 కోట్లు పైబడి సంపద ఉన్న బిలియనీర్లు కేవలం 5%మాత్రమే పెరిగారు.

సంపన్నులు ఏం కొంటున్నారు..

మిలియనీర్ల పెట్టుబడుల్లో స్టాక్ మార్కెట్, రియల్ ఎస్టేట్, బంగారం తొలి స్థానాల్లో ఉన్నాయి. ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ, అంతర్జాతీయ బ్యాంకుల్లో సిటీబ్యాంకుకు, వాచ్‌ల్లో రోలెక్స్, బంగారం షాపుల్లో తనిష్క్, హోటళ్లలో తాజ్, వినియోగ వస్తువుల్లో గూచి, లూయి విట్టన్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఓట్ల దొంగలకు సీఈసీ రక్ష!

త్వరలో 'మాస్టర్‌మైండ్' బయటపెడతా: రాహుల్

న్యూఢిల్లీ/బెంగళూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ తన దాడిని తీవ్రతరం చేశారు. ఈదఫా ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై నేరుగా దాడికి దిగారు. ఓట్ల దొంగలకు ఆయన అండగా ఉన్నారని.. ప్రజాస్వామ్య వినాశకులను కాపాడుతున్నారని ఆరోపించారు. కర్ణాటకలోని ఆళంద అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ ఓటర్లను టార్గెట్ చేశారని.. తమ పార్టీ అనుకూల పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను ఆన్‌లైన్లో తొలగించారని చెప్పారు. రాహుల్ గురువారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆళంద నియోజకవర్గంలో తమ పార్టీ ఓటర్లను తొలగించే ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. దీనిపై దర్యాప్తు కోసం ఆ రాష్ట్ర సీఐడీ కోరిన సమాచారం వారంలోగా ఇవ్వాలని అల్టిమేటం ఇచ్చారు. లేకపోతే రాజ్యాంగం హత్యలో సీఈసీ కూడా భాగస్వామి అయినట్లేనని స్పష్టంచేశారు. కొందరు దేశవ్యాప్తంగా ఓ పద్ధతి ప్రకారం లక్షల కొద్దీ ఓటర్లను తొలగిస్తున్నారని తెలిపారు. ఓ సాఫ్ట్‌వేర్ ద్వారా ఇది చేస్తున్నారని.. దీనిపై కర్ణాటకలో దర్యాప్తు జరుగుతోందన్నారు. 'ఎక్కడి నుంచి ఓట్ల తొలగింపు దరఖాస్తులు వచ్చాయో డెస్టినేషన్ ఐపీ, ఓటీపీ వివరాలను చెప్పాలని కర్ణాటక సీఐడీ 18 నెలల్లో ఈసీకి 18 లేఖలు రాసింది. కానీ ఈ ఆపరేషన్‌తో అంతా బయటపడుతుందని కమిషన్ ఆ వివరాలు ఇవ్వడం లేదు. ఇదంతా ఎవరు చేస్తున్నారో దానికి తెలుసు. అలాగే ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి మహారాష్ట్ర రాజురా అసెంబ్లీ స్థానంలో అదనపు ఓట్లు నమోదుచేశారు. ఆ వ్యవస్థనే అంతటా ఉపయోగిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్రల్లో వాడుతున్నారు. హరియాణా, ఉత్తరప్రదేశ్‌లో వాడారు. అందుకు మా వద్ద ఆధారాలున్నాయి. దేశంలో ప్రతి యువకుడూ ఇది తెలుసుకోవాలి. ఓట్ల చోరీపై మా పరిశోధన, ప్రజెంటేషన్లు ఇవ్వడానికి రెండు, మూడు నెలలు పడుతుంది. ఇవన్నీ పూర్తయ్యాక ఒక రాష్ట్రం తర్వాత మరొక రాష్ట్రాన్ని, లోక్‌సభ ఎన్నికలను తస్కరించారని నిస్సందేహంగా మీకే అర్థమవుతుంది. సత్యాన్ని అన్వేషించి ప్రజలకు చూపించడమే నా కర్తవ్యం' అని వివరించారు.

పథకం ప్రకారమే ఆపరేషన్

ఆళందలో కాంగ్రెస్ పటిష్ఠంగా ఉన్న పది పోలింగ్ కేంద్రాల్లో ఓట్ల తొలగింపులు జరిగాయని రాహుల్ చెప్పారు. '2018లో ఈ పదింటిలో 8 చోట్ల కాంగ్రెస్ గెలిచింది. ఓట్లు తీసేయడం కాకతాళీయం కాదు. పథకం ప్రకారం జరిగిన ఆపరేషన్. ఈరోజు నేను చెబుతున్న వివరాలు.. ఎన్నికలను ఎలా రిగ్గింగ్ చేస్తున్నారో ఈ దేశ యువతకు చాటే క్రమంలో మరో మైలురాయి. జ్ఞానేశ్‌కుమార్ గురించి తీవ్రమైన అంశం చెబుతున్నాను. సీఈసీ ఓట్ల దొంగలను కాపాడుతున్నారు. నేను ప్రతిపక్ష నేతను. వంద శాతం రుజువులు లేకుండా ఏదీ చెప్పను. జ్ఞానేశ్‌కుమార్.. మీ విధి మీరు విధించాలన్నదే మా డిమాండ్. మీరు భారత సీఈసీ. కర్ణాటక సీఐడీకి సాక్ష్యాధారాలు అందించాలి' అని డిమాండ్ చేశారు.



ఎన్నికల కమిషన్ అంతర్గత వర్గాల నుంచి కూడా తమకు సమాచారం, సహకారం అందుతోందని రాహుల్ చెప్పారు. ఈ నిజాలు తాను చెప్పిన హైడ్రోజన్ బాంబు కాదని.. ఆ బాంబులాంటి వివరాలను త్వరలోనే బయటపెడతానని తెలిపారు. దీనివెనుక మాస్టర్‌మైండ్ ఎవరని విలేకరులు ప్రశ్నించగా.. అది కూడా ప్రజల ముందుంచుతానని.. ఈ వాస్తవాల హైడ్రోజన్ బాంబు బహిర్గతం చేశాక సర్వం వెల్లడవుతుందని రాహుల్ బదులిచ్చారు.

ఆన్‌లైన్లో ఓటు తొలగించలేరు: ఈసీ

ఆన్‌లైన్లో ఓట్లు తొలగించారని రాహుల్ చేసిన ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎవరూ ఇలా తొలగించలేరని, జ్ఞానేశ్‌కుమార్‌పై ఆయన వ్యాఖ్యలు అవాస్తవం.. నిరాధారమని తేల్చిచెప్పింది. వాదన వినిపించుకునే అవకాశం బాధిత వ్యక్తి ఇవ్వకుండా.. ఓటు తొలగించే అవకాశం ఉండదని పేర్కొంది.

అలజడి సృష్టికే ఆరోపణలు: బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై రాహుల్‌గాంధీ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. చొరబాటుదారులే ఆయనకు పెద్దపీట వేస్తారని.. దేశంలో అలజడి, గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని ఆ పార్టీ నేత, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ ధ్వజమెత్తారు. 'రాజ్యాంగబద్ధ సంస్థ ఎన్నికల కమిషన్‌పై ఆయన పదే పదే చేస్తున్న ఆరోపణలు.. ప్రజాస్వామ్యంపై ఆయనకు విశ్వాసం లేదని చాటుతున్నాయి. నేపాల్, బంగ్లాదేశ్‌లలో మాదిరిగా భారత్‌లోనూ అలజడి, సంక్షోభం సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. చొరబాటుదార్లకే అగ్ర స్థానమనే రాజకీయాలే ఆయన ఏకైక ఎజెండా' అని దుయ్యబట్టారు. ఆళందలో ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు వచ్చిన ఐపీ అడ్రస్‌లు, మొబైల్ ఫోన్ల సమాచారాన్ని కమిషన్ సీఐడీకి అందజేసిందని.. కానీ పోలీసులు చర్యలూ తీసుకోలేదన్నారు.

4 వేల సీసీ కెమెరాలతో బ్రహ్మోత్సవాల్లో నిఘా

» తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 4 వేల సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్టు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుమలలో గురువారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళికృష్ణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలో 4 వేల మంది, తిరుపతిలో 1,400 మం ది పోలీసులతో భద్రత కల్పించేలా ప్రణాళికలు రూపొందించినట్టు వివరించారు. తిరుమల ఔటర్‌రింగురోడ్డులో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంటుందన్నారు. 1,500 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బంది బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తారని సీవీఎస్వో మురళికృష్ణ తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో ఇస్రో సేవలు

» తొక్కిసలాటలు లేకుండా జాగ్రత్తలు
» తప్పుడు ప్రచారాలు చేస్తే క్రిమినల్ కేసులు
» 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ నిర్వహణకు తొలిసారిగా ఇస్రో సహకారం తీసుకోనున్నట్లు టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఉపగ్రహ చాయాచిత్రాల సాయంతో ఇస్రో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తారని తెలిపారు. దీంతో రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుని తోపులాటలు, తొక్కిసలాటలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణకు సహకరించడానికి ఎల్‌అండ్‌టీ సంస్థ ముందుకొచ్చిందని, వాహనాల కదలికలపై వారి పర్యవేక్షణ ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. "బ్రహ్మోత్సవాలకు వచ్చే సామాన్య భక్తులు మూలమూర్తి దర్శనంతో పాటు వాహన సేవలను సంతృప్తికరంగా తిలకించేలా ఏర్పాట్లు చేశాం. ఆ సమయంలో ప్రత్యేక దర్శనాలన్నీ రద్దు చేశాం. కాలినడకన వచ్చే భక్తులను శ్రీవారిమెట్టు, అలిపిరి మార్గాల నుంచి 24 గంటలూ అనుమతిస్తాం. రోజువారీగా 3 లక్షల లడ్డూలతో పాటు అదనంగా 8 లక్షల లడ్డూలను తయారు చేసి సిద్ధంగా ఉంచుతాం. టీటీడీ సోషల్ మీడియా ద్వారా ప్రపంచం మొత్తం వాహన సేవలు వీక్షించేలా చర్యలు చేపట్టాం. గ్యాలరీల్లోకి రాలేకపోయే భక్తుల కోసం దాదాపు 30 ఎల్‌ఈడీ స్ర్కీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తాం. ముంబైకి చెందిన ఓ సంస్థ వాహన సేవల వైభవంపై 10 ఎపిసోడ్లతో డాక్యుమెంటరీ ఉచితంగా తీయనుంది. 4 వేల మంది పోలీసులు, 1,500 మంది విజిలెన్స్ సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నాం. అందరు సమష్టిగా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఇకనుంచి టీటీడీపై అసత్య ప్రచారాలు చేసేవారిపై క్రిమినల్ కేసులు పెట్టేలా తీర్మానించాం" అని బీఆర్ నాయుడు హెచ్చరించారు.


టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

భక్తుల రద్దీ నిర్వహణలో సహకారం


శ్రీశైలం రిజర్వాయర్ ఐదు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

శ్రీశైలంలో ఐదుగేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టులో భారీగా వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 212 టీఎంసీల నీరు ఉంది. దీంతోఐదు గేట్లను ఎత్తి స్పిల్‌వే నుంచి 1,67,346 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 884 అడుగులకు చేరింది. ఎగువన జూరాల స్పిల్‌వే నుంచి 1,52,020 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 32,293 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 17,916, హంద్రీ నుంచి 2,000 క్యూసెక్కుల నీరు శ్రీశైలం రిజర్వాయర్‌లోకి వస్తోంది. శ్రీశైలం రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 66,083 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నేటి నుంచి వరుస అల్పపీడనాలు

రెండు వారాల వ్యవధిలో మూడు.. చురుగ్గా మారనున్న రుతుపవనాలు

» నైరుతి ఉపసంహరణలో జాప్యం
» పలు ప్రాంతాల్లో కొనసాగనున్న వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రెండు వారాల వ్యవధిలో బంగాళాఖాతంలో వరుసగా మూడు అల్పపీడనాలు ఏర్పడనున్నాయి. దీంతో తూర్పు, మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఏపీ, తెలంగాణల్లో రుతుపవనాలు చురుగ్గా మారనున్నాయి. గత వారం ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో బలహీనపడినప్పటికీ దాని అవశేషాలతో మహారాష్ట్రలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దాని ప్రభావంతో మహారాష్ట్ర, తెలంగాణలో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మయన్మార్ సమీపాన అరక్కోణం తీరంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారానికి అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ తర్వాత అది తూర్పు మధ్య/ఈశాన్య బంగాళాఖాతం గుండా ఉత్తర, దానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు పశ్చిమబెంగాల్, ఒడిశా, ఉత్తరకోస్తాలో వర్షాలు కురవనున్నాయి. ఈనెల 25 లేదా 26వ తేదీన బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది బలపడి తీవ్ర అల్పపీడనం లేదా వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం అది పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ప్రవేశించి ఒడిశా, కోస్తాంధ్ర తీరం దిశగా వచ్చే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశాలో వర్షాలు ఎక్కువగా కురుస్తాయని పలు మోడళ్ల ద్వారా వెల్లడైంది. ఇది తీరం దాటిన తర్వాత తూర్పు, మధ్యభారతం మీదుగా వాయవ్య భారతం వరకూ పయనించే క్రమంలో తూర్పు భారతం నుంచి వాయవ్య భారతం వరకు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఇక వచ్చేనెల తొలి వారంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని కొన్ని వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. ఇది బలపడుతుందా? లేదా అనేది ఇప్పుడే చెప్పలేమని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. వరుస అల్పపీడనాలు ఏర్పడనున్న నేపథ్యంలో నైరుతి రుతుపవనాల నిష్క్రమణలో కొంత జాప్యం జరుగుతుందని విశ్లేషించారు. అక్టోబరు తొలివారంలో తూర్పు, మధ్య భారతం నుంచి పూర్తిగా రుతుపవనాలు నిష్క్రమించాల్సి ఉండగా కొంత ఆలస్యమవుతుందన్నారు. దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతాయని తెలిపారు.

నేడు దక్షిణ కోస్తా, సీమలో వర్షాలు

ఉపరితల ద్రోణుల ప్రభావంతో రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో పలుచోట్ల గురువారం వర్షాలు కురిశాయి. ప్రకాశం జిల్లా దర్శిలో 7.4, తిరుపతి జిల్లా మల్లంలో 7, కాకినాడ జిల్లా ఇంజరంలో 5.8 సెంటీమీటర్ల వాన పడింది. రాష్ట్రంలో కొన్నిచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. నెల్లూరులో 36.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ద్రోణి ప్రభావంతో మరో నాలుగు రోజులు దక్షిణ కోస్తా, రాయలసీమలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయంది.

గోదావరిలో 6.7 లక్షల క్యూసెక్కుల వరద

గోదావరిలో వరద ఉధృతి గురువారం సాయంత్రానికి నిలకడగా మారింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 6,74,121 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 38 అడుగులకు చేరగా, పోలవరం స్పిల్‌వే ఎగువన 31.070, దిగువన 22.050 మీటర్లు నమోదైంది.


కాలేజీకి జమయ్యే ఫీజులూ కట్టాల్సిందే!

» సర్టిఫికెట్ల జారీలో విద్యార్థులకు చుక్కలు చూపిస్తున్న ట్రిపుల్ ఐటీ అధికారులు
» అప్పు చేసి ఫీజు కట్టిన కృష్ణా జిల్లా విద్యార్థి

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ(ట్రిపుల్ ఐటీ) అధికారుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. ఫీజులు కట్టని విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీని నిలిపివేయడమే కాకుండా, కాలేజీ ఖాతాల్లో జమయ్యే ఫీజులను కూడా విద్యార్థుల నుంచే కట్టించుకోవడం ఇంకా దారుణంగా మారింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిబంధనల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరం వరకు ప్రభుత్వం ఇచ్చే ఫీజులు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ అవుతాయి. 2024-25 నుంచి నేరుగా కాలేజీల ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం నిబంధనలు మార్చింది. కాగా, రెండు విద్యా సంవత్సరాల్లోనూ మూడేసి క్వార్టర్ల చొప్పున ఆరు క్వార్టర్ల ఫీజులను ప్రభుత్వం బకాయి పెట్టింది. ఇందులో మూడు క్వార్టర్లు తల్లుల ఖాతాల్లో, మరో మూడు కాలేజీల ఖాతాల్లో జమ అవుతాయి. అయితే ట్రిపుల్ ఐటీ నూజివీడు అధికారులు మాత్రం సర్టిఫికెట్లు కావాలన్న విద్యార్థుల నుంచి మొత్తం ఆరు క్వార్టర్ల ఫీజులను వసూలు చేస్తున్నారు. కాగా, ఫీజుల ఇబ్బందులపై గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంలో ఉదహరించిన కృష్ణా జిల్లా విద్యార్థి నుంచీ మొత్తం ఫీజు వసూలు చేశారు. టీసీఎస్‌లో ఉద్యోగం వచ్చిందని, సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎంత వేడుకున్నా అధికారులు కరుణించలేదు. చేసేదేం లేక విద్యార్థి తండ్రి అప్పుచేసి ఫీజు చెల్లించడంతో అప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చారు. విద్యార్థుల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని ఓవైపు మంత్రి లోకేశ్ చెబుతున్నా ట్రిపుల్ ఐటీలు, యూనివర్సిటీల అధికారులు అందుకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. అయినా ఆర్జీయూకేటీ చాన్స్‌లర్, డైరెక్టర్లలో కనీస చలనం కనిపించడం లేదు. విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని ఆదేశాలు జారీచేయకపోవడం గమనార్హం.

కుర్రాడు... పరిగెడుతూ కుప్పకూలాడు

» ఎన్‌సీసీ ఎంపిక పోటీల్లో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి


సాయికిరణ్ (ఫైల్)

విజయనగరం క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ఎంపిక పోటీల్లో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి గుండెపోటుతో మృతి చెందాడు. పరుగు తీస్తూ కుప్పకూలి పోయాడు. ఈ ఘటన గురువారం విజయనగరంలో చోటుచేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన పాలవలస పోలినాయుడు, సుజాత దంపతుల చిన్న కొడుకు పాలవలస సాయికిరణ్ (19). విజయనగరంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఈఈఈ రెండో ఏడాది చదువుతున్నాడు. గురువారం ఉదయం కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికకు హాజరయ్యాడు. పరుగు పందెంలో కొద్దిదూరం పరిగెత్తిన తర్వాత కుప్పకూలిపోయాడు. వెంటనే కళాశాల నిర్వాహకులు కారులో ఆ విద్యార్థిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. గుండెపోటుతో చనిపోయినట్లు చెబుతున్నారు.

విశాఖ-హైదరాబాద్... ఎయిర్ ఇండియా విమానానికి తప్పిన ముప్పు

» బయలుదేరిన కొద్దిసేపటికే ఢీకొన్న పక్షి...వెనక్కి మళ్లింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానానికి పెద్ద ముప్పు తప్పింది. 103 మంది ప్రయాణికులతో మధ్యాహ్నం 2.38 గంటలకు ఈ విమానం విశాఖ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. కేవలం తొమ్మిది నిమిషాల్లోనే... 2.47 గంటల సమయంలో తిరిగి వెనక్కి వస్తున్నట్టు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)కు పైలట్ సమాచారం అందించారు. సరిగ్గా మూడు గంటలకు సురక్షితంగా విమానాన్ని ల్యాండింగ్ చేశారు. గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే ఓ పక్షి విమానంలో రెండో నంబరు ఇంజన్‌ను ఢీకొట్టిందని, దానివల్ల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉండడంతో విమానాన్ని వెనక్కి తీసుకువచ్చారని విమానాశ్రయం వర్గాలు తెలిపాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

మహిళా మావోయిస్టు మృతి

చింతూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు ఒకరు మృతి చెందారు. సుక్మా జిల్లా గాదిరాజ్ పోలీస్‌స్టేషన్ పరిధి గుప్తి పెర్మాపారా అటవీ ప్రాంతం మధ్యలో ఉన్న కొండల్లో గురువారం సాయుధ బలగాలు సెర్చ్‌ఆపరేషన్ నిర్వహించాయి. ఈక్రమంలో మావోయిస్టులకు, సాయుధ బలగాలకు ఎదురుకాల్పులు జరిగినట్టు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్‌చవాన్ స్పష్టం చేశారు. ఈ ఘటనలో మహిళా మావోయిస్టు మృతి చెందినట్లు ఆయన ప్రకటించారు. మృతిచెందిన మావోయిస్టును మలంగీర్ మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యురాలు బూస్కీ నుప్పోగా గుర్తించామని, ఆమెపై రూ.5లక్షల రివార్డు ఉందని వివరించారు. సంఘటనాస్థలంలో 315 రైఫిల్, పేలుడు సామగ్రి లభ్యమైందని తెలిపారు.

22 నుంచి డిగ్రీ కాలేజీలు బంద్

» ఫీజు బకాయిలు విడుదల చేసే వరకూ మూత
» ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘం ప్రకటన
» మరో సంఘం బంద్ తాత్కాలిక వాయిదా

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు ఈనెల 22 నుంచి బంద్‌కు పిలుపునిచ్చాయి. ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేశాయి. బకాయిలు విడుదల చేసే వరకూ కాలేజీలను మూసివేస్తామని ప్రకటించాయి. రాష్ట్రంలోని రెండు ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘాలు బంద్ చేయాలని తొలుత భావించగా.. దసరా సెలవుల నేపథ్యంలో ఓ సంఘం బంద్‌ను తాత్కాలింగా వాయిదా వేసింది. మరో సంఘం ఈనెల 22 నుంచి బంద్ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధులు పి.జయరాం, పి.పెద్దిరాజు, కె.గుండారెడ్డి గురువారం ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తిని కలిసి నోటీసు అందజేశారు. ప్రభుత్వం 16 నెలలుగా ఫీజులను బకాయి పెట్టడం వల్ల కాలేజీలు నడపలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక, మౌలిక వసతులు నిర్వహించలేకపోతున్నామని తెలిపారు. యూనివర్సిటీలు, ప్రభుత్వ శాఖలు తమ వద్ద నుంచి అన్ని ఫీజులు వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. మరోవైపు దసరా సెలవులు, రెండో విడత డిగ్రీ కౌన్సెలింగ్ నేపథ్యంలో బంద్ యోచనను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు మరో సంఘం ప్రతినిధులు జె.రమణాజీ, జి.రాజ్‌కుమార్ చౌదరి, సి.విజయ్‌భాస్కర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పెండింగ్ ఫీజులపై స్పందించకపోతే దసరా తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు.

22 నుంచి సోనోవిజన్‌లో తగ్గింపు జీఎస్టీతో అమ్మకాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పి.భాస్కరమూర్తి

గుణదల(విజయవాడ), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ నవరాత్రుల ప్రారంభం సందర్భంగా ఈ నెల 22వ తేదీ నుంచి జీఎస్టీ తగ్గింపు రేట్లతో సోనోవిజన్లో అమ్మకాలు జరపనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ పి.భాస్కరమూర్తి తెలిపారు. సోమవారం నుంచి జీఎస్టీ 10 శాతం తగ్గింపుతో వస్తువుల అమ్మకాలు జరపనున్నామని పేర్కొన్నారు. అదే సమయంలో నవరాత్రులను పురస్కరించుకుని వినియోగదారుల సౌలభ్యం కోసం ప్రవేశపెట్టే స్క్రాచ్ కార్డ్ పథకం ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రతి రెండు వేల కొనుగోలుపై వినియోగదారులు స్క్రాచ్ కార్డు పొందే అవకాశం ఉందని, స్క్రాచ్ కార్డు పొందిన వారికి వంద నుంచి లక్ష రూపాయల వరకు విలువగల బహుమతి పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులను కోరారు.

రెండో విడతలో 128 బార్లకు లైసెన్స్‌లు

» ఇంకా మిగిలినవి 300.. త్వరలో మళ్లీ నోటిఫికేషన్

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గురువారం నిర్వహించిన రెండో విడత లాటరీలో 128 బార్లకు లైసెన్స్‌లు మంజూరయ్యాయి. 428 బార్లకు రెండో విడత నోటిఫికేషన్ జారీచేయగా.. 4 దరఖాస్తులు వచ్చిన బార్లు 128 ఉన్నాయి. వాటికి లాటరీ తీసి లైసెన్సీలను ఎంపిక చేశారు. ఇంకా 300 బార్లు మిగిలిపోయాయి. వీటికి రెండు రోజుల్లో మూడో విడత నోటిఫికేషన్ జారీచేయనున్నారు. కల్లు గీత కులాలకు కేటాయించిన 84 బార్లలో తొలి విడతలో 80, రెండో విడతలో నాలుగు బార్లకు లైసెన్స్‌లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాల వారీగా ఉమ్మడి గుంటూరులో అత్యధికంగా 71 బార్లు మిగిలిపోయాయి. ఆ జిల్లాలో అధికారులు ఎంత ప్రయత్నించినా వ్యాపారులు ముందుకు రావట్లేదు.

కేంద్రం నుంచి మరో 13,050 టన్నుల యూరియా

» వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తూ గురువారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీకి గంగవరం పోర్టుకు యూరియా రాష్ట్రానికి చేరుతుందని పేర్కొన్నారు. ఈ కేటాయింపుతో రైతులకు మరింత వెసులబాటు లభిస్తుందని, రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కుదుటపడుతున్న నేపాల్

నేపాల్ త్వరితగతిన గాడినపడటం ఊరటనిస్తోంది. మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ గాడితప్పి, ఇంకా కుదురుకోక, అనతికాలంలోనే పక్కలోబల్లెంలాగా తయారైన నేపథ్యంలో నేపాల్ పరిణామాలు ఉపశమనం కలిగిస్తాయి. కేవలం నలభైఎనిమిది గంటల్లో భీతావహమైన ఘట్టాలను చవిచూసిందీ దేశం. పాలకుల అవినీతి, ఆశ్రితపక్షపాతంమీద జనం గుండెలోతుల్లో గూడుకట్టుకొని ఉన్న నిరాశానిస్పృహలు ఒక్కసారిగా ఓ చిన్న నిప్పురవ్వతో రాజుకున్నాయి. దొరికిన మంత్రులను నవతరం తన్నితరిమేసింది, ప్రధాని మాయమై రక్షణ స్థావరాల్లో తలదాచుకున్నారు, దేశాధ్యక్షుడు రహస్యప్రదేశాలకు తరలిపోయారు. ఐదుగురు మాజీ ప్రధానుల ఇళ్ళు తగలబడ్డాయి, చివరకు పార్లమెంటు, సుప్రీంకోర్టు భవనాలు సైతం అగ్నికి ఆహుతైనాయి. నాయకుడంటూ లేని ఈ తిరుగుబాటు ఎంతకాలం సాగుతుందో, ఎక్కడకు దారితీస్తుందోనన్న భయం మొదట్లో కలిగినప్పటికీ, తిరగబడిన యువత తాము అనుకున్న లక్ష్యాల సాధన దిశగా త్వరితంగానే అడుగులు వేశారు. నేపాల్ ఇప్పుడు స్వయం ప్రక్షాళనతో నవ యువ యుగం వైపు కదులుతోంది.

అర్థరాత్రి కుట్రలతో పౌరప్రభుత్వాలను కూల్చి, ప్రజానాయకులను జైళ్ళలోకి నెట్టి సైన్యం అధికారాన్ని తన్నుకుపోయిన ఉదంతాలు మన చుట్టూనే అనేకం. సైన్యాధ్యక్షులు నియంతలుగా అవతారమెత్తి ప్రజలను హింసించి, ప్రజాస్వామ్యాన్ని పాతరేసిన ఘనచరిత్ర మన ఇరుగుపొరుగులది. ఈ నేపథ్యంలో, అధికారాన్ని కొంతకాలం వెలగబెట్టగలిగే అంతపెద్ద అవకాశం వచ్చికూడా నేపాల్ సైన్యం ప్రజానుకూలంగా వ్యవహరించి దేశాన్ని తిరిగి గాడినపెట్టడం మెచ్చదగినది. నేపాల్ సైన్యాధ్యక్షుడు ఒక చిన్న విడియో సందేశంతో ప్రజలను అభ్యర్థించి, దేశాన్ని నియంత్రణలోకి తేవడం, సైనికాధికారులు ఎక్కడికక్కడ ఉద్యమకారులతో చర్చలు జరిపి కార్యాచరణను నిర్ణయించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. చట్టసభలు చట్టుబండలైన స్థితిలో, పౌర ప్రభుత్వం, రాజకీయ నాయకులు ఉనికిలో లేని ఉద్రిక్తవేళల్లో సైన్యమే మధ్యవర్తి అయింది, ఆర్మీ కార్యాలయమే చట్టసభగా అవతరించింది. రాజుగారి ఏలుబడినుంచి మావోయిస్టు ఉద్యమం వరకూ ఎన్నడూ ప్రజలపక్షాన లేని సైన్యం, ఇంతటి సంక్షోభంలోనూ నవతరం వైపు నిలబడింది. గతపాలకులు తప్పుకోవడం నుంచి, జెన్ జి గ్రూపుల్లో విభేదాలను చక్కదిద్ది సుశీలా కర్కిని ఎంపిక చేయడం వరకూ ప్రతీదీ సవ్యంగా పూర్తయ్యేట్టు చూసింది. గడ్డుకాలాన్ని గట్టెక్కించినందుకు నేపాల్ యువత సైన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పుకుంది.

ఆ నమ్మకాన్ని ఆపద్ధర్మ ప్రధాని కూడా నిలబెట్టుకున్నారు. అతి త్వరలోనే దేశాన్ని తిరిగి ప్రజాస్వామ్యం పట్టాలు ఎక్కించేందుకు వచ్చే మార్చిలో ఎన్నికల నిర్వహణకు సిద్ధపడ్డారు. బంగ్లాదేశ్‌లో గత ఏడాది ఆగస్టులో తిరుగుబాటు, మహ్మద్ యూనిస్‌ను విదేశాల నుంచి హడావుడిగా రప్పించి తాత్కాలిక ప్రభుత్వాధినేతగా కూర్చోబెట్టడం, ఆయన ఎంతో నాన్చి ఎట్టకేలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలను ప్రకటించడం తెలిసిందే. అవి కూడా సజావుగా సకాలంలో జరుగుతాయన్న నమ్మకం ఇప్పటికీ అక్కడ లేకపోతోంది. హసీనాను గద్దెదించిన తరువాత కూడా మైనారిటీలపైనా, బంగ్లా పితామహుడు ముజిబుర్ రహ్మాన్ ఆస్తులు, పార్టీనేతలపైనా సాగిన దమనకాండ ఆ పోరాట స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీశాయి. హసీనా పార్టీని ఎన్నికల్లో పాల్గొననీయకుండా చేయడం, ఆమె ప్రత్యర్థి ఖలేదాజియాను బలోపేతం చేయడం, మతోన్మాదులను జైళ్ళనుంచి రోడ్లమీదకు వదిలేయడం, బంగ్లా ఆవిర్భావ చరిత్రను పాతరేసి పాకిస్థాన్‌తో అంటకాగడం వంటివి గమనించినప్పుడు నేపాల్ ఎంత ఉన్నతంగా నిలబడిందో అర్థమవుతుంది. బంగ్లాలో దీర్ఘకాలం విధ్వంసం కొనసాగితే, నేపాల్ వెనువెంటనే పరిసరాలను శుభ్రం చేసుకుంది, పరిస్థితిని చక్కదిద్దుకుంది. ఏదో ఆపద్ధర్మంగానో, సలహాదారుగానో కాక, ఆయా రంగాల్లో అనుభవం ఉన్న ముగ్గురు మంత్రులతో ప్రధానిగా ప్రమాణం చేసిన సుశీల దేశాన్ని గాడినపెట్టేపని ఇప్పటికే ఆరంభించారు. అధికారాన్ని దుర్వినియోగం చేసి, ఆస్తులు కూడబెట్టుకున్న నాయకులందరిమీదా యువతరం దండెత్తిన నేపథ్యంలో, వీరి ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగంలో మార్పుచేర్పులు చేపట్టాల్సి వుంది. ఓ నలుగురు వ్యక్తులు మారి, అవే విధానాలు కొనసాగితే ఈ ప్రజాగ్రహానికి విలువే లేకుండా పోతుంది కనుక, నవతరం ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థల ప్రక్షాళన జరగాల్సి ఉంది.

ఉత్తరాఖండ్‌లో విధ్వంస వికాసం





■ రామచంద్ర గుహ

ఉత్తరాఖండ్ రాష్ట్రం 2000 సంవత్సరంలో నవంబర్ 9న ఏర్పాటయింది. ఆ శుభ వేడుకలు ఇంకా పూర్తిగా ముగియకముందే ముస్సోరిలో ఒక ఉపన్యాసం వెలువరించేందుకు నాకు ఆహ్వానం అందింది. ఆ ఆహ్వానాన్ని అంగీకరించాను. ఆ రాష్ట్రంలోని ప్రధాన నగరాలలో ఒకటైన డెహ్రాడూన్‌లోనే నేను పుట్టి పెరగడమే అందుకొక కారణం. ముస్సోరికి వెళ్లిన తరువాత నా బసకు సమీపంలో ఉన్న ఒక పబ్లిక్ కాల్ బూత్ (అప్పటికి ఇంకా సెల్ ఫోన్లు లేవు)కు వెళ్లి నైనిటాల్‌లో ఉండే చరిత్రకారుడు శేఖర్ పాఠక్‌కు ఫోన్ చేశాను. నా మిత్రుడు ఫోన్ ఎత్తగానే నేను ఇలా సగర్వంగా ప్రకటించాను: 'మై అప్నే ప్రదేశ్ సె బోల్ రహా హూ' (నేను నీతో మన రాష్ట్రం నుంచి మాట్లాడుతున్నాను).

ఇప్పుడు బెంగళూరులో స్థిరపడినప్పటికీ నేను యువకుడుగా ఎదిగిన, నా తొలి పరిశోధనను నిర్వహించిన ప్రదేశంతో నా ఆత్మీయ సంబంధాలను కొనసాగిస్తున్నాను. ఉత్తరప్రదేశ్‌లోని పర్వత ప్రాంత జిల్లాలతో ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకై అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ ప్రజలు నిర్వహించిన ఉద్యమాన్ని మొదటి నుంచి చివరివరకు నేను ఆసక్తితో గమనించాను. తుదకు ఉత్తరాఖండ్ ఏర్పడినప్పుడు 'దేవ భూమి'గా ప్రసిద్ధిగాంచిన ఆ హిమాలయ ప్రాంతాల ప్రజల జీవితాలలో కొత్త యుగోదయాన్ని ఆకాంక్షించాను.

1971లో హిమాచల్‌ప్రదేశ్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ప్రభవించిన తరువాత ఆ రాష్ట్ర ప్రజలు గణనీయమైన సామాజిక, ఆర్థిక పురోగతి సాధించిన విధంగానే ఉత్తరాఖండ్ వాసులు తమ సొంత రాష్ట్రంలో సర్వతోముఖమైన ప్రగతి సాధించగలరని భావించాను. నా నమ్మకానికి కారణమేమిటి? ఆ కొత్త రాష్ట్రాన్ని పాలించే రాజకీయవేత్తలు తమ పాలితులతో ఉమ్మడి సాంస్కృతిక నేపథ్యమున్నవారే కాక, ప్రజల ఆశలు, అభిలాషలలో భాగస్వాములుగా ఉండడమే. మరో కొద్ది వారాలలో ఉత్తరాఖండ్ 25వ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నది. ఈ పాతికేళ్ల కాలంలో కాంగ్రెస్ పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండగా భారతీయ జనతా పార్టీ పదిహేనేళ్లు పాలించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర రజతోత్సవాలను చాలా ఘనంగా నిర్వహిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రెండూ ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు చేసింది చాలా తక్కువ అనేది ఒక చేదు సత్యం. విద్యా వైద్య రంగాలను రెండు పార్టీల ప్రభుత్వాలూ ఒకే విధంగా నిర్లక్ష్యం చేశాయి. మహిళలకు రక్షణ కల్పించడంలోను, జీవనోపాధులకు భద్రత సమకూర్చడంలోనూ అన్ని ప్రభుత్వాలూ విఫలమయ్యాయి. 2017 నుంచి అధికారంలో ఉన్న బీజేపీ హిందూత్వ భావజాలాన్ని ప్రోత్సహిస్తోంది. మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శిస్తోంది. భయపూరిత వాతావరణాన్ని సృష్టించి మత సామరస్యానికి విఘాతం కలిగిస్తోంది.

ఇదిలావుండగా ఉత్తరాఖండ్‌లో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వమూ కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో 'అభివృద్ధి' పేరిట పర్యావరణ విధ్వంసానికి పాల్పడడం పరిపాటిగా ఉన్నది. కొండలు తొలిచివేస్తున్నారు. నాణ్యత లేని రోడ్లు నిర్మిస్తున్నారు. ఆలోచనారహితంగా భారీ డ్యాంల నిర్మాణానికి పూనుకుంటున్నారు. చార్ ధామ్ హైవే ఈ ప్రాజెక్టులలో అత్యంత ప్రమాదకరమైనది. ప్రజలు, పర్యావరణానికి ఈ ప్రాజెక్టు హానికరమైనదని నిరాకరించలేని శాస్త్రీయ సాక్ష్యాధారాలు నివేదించినప్పటికీ ఆ హైవే నిర్మాణాన్ని కొనసాగించేందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం అనుమతినిచ్చింది.

ఒక సాధికారిక అంచనా ప్రకారం 2000 సంవత్సరంలో ఏర్పడినప్పటి నుంచీ ఇప్పటివరకు హై వేలు, డ్యాంలు, గనులు, ప్రభుత్వ బస్తీలు మొదలైన 'అభివృద్ధి ప్రాజెక్టుల' పేరిట 50 వేల ఎకరాల సహజ అడవిని కోల్పోయింది. ఆ 'అభివృద్ధి' నుంచి ప్రజలు రవ్వంత కూడా లబ్ధి పొందలేదు. ఎంత తక్కువగా అంచనా వేసినా ప్రతి హెక్టారు సహజారణ్యంలో 3000 వృక్షాలు ఉంటాయి. హరించుకుపోయిన 50 వేల హెక్టార్లలో ఇంచుమించు 15 కోట్ల వృక్షాలు ఉండవచ్చు. ఉత్తరాఖండ్ ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వమే ఆ వృక్ష సంపదను సంపూర్ణంగా నిర్మూలించింది. ఈ సహజ సంపద విధ్వంసకాండ ఆర్థిక, పర్యావరణ వ్యయాలు అగణితమైనవి.

హిమాలయాల పర్యావరణ వ్యవస్థ సున్నితమైనది. భూకంపాలు సంభవించే ప్రాంతంలో హిమాలయాలు ఉన్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పోషణకే కాకుండా నేల కోత, వరదల నుంచి రక్షణకు కూడా దట్టమైన అడవులు విలసిల్లడం చాలా అవసరం. హైవేలు, రైళ్ల మార్గాలను నిర్మించేందుకు కొండలు తొలిచి సొరంగాలు నిర్మిస్తున్నారు. సదరు కొండ ప్రాంతాలను కాంక్రీట్ నిర్మాణాలతో నింపివేస్తున్నారు. ఈ పర్యావరణ విరుద్ధ నిర్మాణాలతో వరుసగా అనేక ఘోర ప్రమాదాలు, విపత్తులు సంభవించాయి. ధరాళిలో చోటుచేసుకున్న దుర్ఘటన ఈ ప్రమాదాలలో చాలా ఇటీవలది. భూపాతాల కారణంగా చోటుచేసుకున్న మానవ మరణాలు, ఆస్తినష్టం లెక్కకు మించి జరిగింది. ఇటీవలి కాలంలో వరదలు తరచుగా సంభవిస్తున్నాయి. పెద్ద ఎత్తున ప్రాణనష్టానికి ఇవి దారితీశాయి. జీవనాధారాలకు వాటిల్లిన నష్టం అపారమైనది. ఈ దుర్ఘటనలను పాలక పక్షాలు 'ప్రాకృతిక విపత్తుల'గా పరిగణిస్తున్నాయి. నిజానికి అవి మానవుల విచక్షణారహిత కార్యకలాపాల మూలంగానే సంభవించాయి. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై స్వప్రయోజనాలకై రోడ్ల విస్తరణ, డ్యాంల నిర్మాణాలు, రిసార్ట్ ఏర్పాటుకు ముందు వెనుకలు చూడకుండా అనుమతినిస్తున్నారు.

ప్రకృతి పరిరక్షణకు, సమాజశ్రేయస్సుకు తోడ్పడని ఈ ప్రాజెక్టులు తరచు విపత్తులకు దారితీస్తున్నా ఉత్తరాఖండ్‌ను పరిపాలిస్తున్నవారు లబ్ధి పొందుతున్నారు. డెహ్రాడూన్‌లో బిందాల్, రిస్పాన నదులపై తలపెట్టిన రెండు ఎలివేటెడ్ హైవే (నేలమట్టం లేదా నదీతలానికి పైన ఎత్తుగా నిర్మితమయ్యేవి)లనే తీసుకోండి. ఒక్కోటి పది కిలోమీటర్లకు పైగా పొడవు ఉంటుంది. ఏమిటి వీటి లక్ష్యం? అధికారికంగా చెప్పక పోయినప్పటికీ మైదాన ప్రాంతాల నుంచి డెహ్రాడూన్‌లోకి ప్రవేశించిన పర్యాటకుల వాహనాలు శీఘ్రగతిన ముస్సోరికి చేరేందుకు సౌలభ్యాన్ని కల్పించడమేనన్నది స్పష్టం. ఒక్కో ఎలివేటెడ్ హైవే నిర్మాణ అంచనా వ్యయం రూ.6000 కోట్లు. ఇది మరింతగా పెరుగుతుందనడంలో సందేహం లేదు. వీటి నిర్మాణానికి చట్టబద్ధంగా నిర్మాణమైన వేలాది గృహాలు, ఇతర కట్టడాలను కూల్చివేయవలసి ఉంటుంది. పెద్ద ఎత్తున నేల కోత సంభవిస్తుంది. వంతెనల స్తంభాలు సహజ ప్రవాహాన్ని అడ్డుకోవడం వల్ల ఆకస్మిక వరదలు పెరిగిపోయే ప్రమాదమున్నది. వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఎలివేటెడ్ హైవేల ప్రత్యక్ష లబ్ధిదారులు కాంట్రాక్టర్లు కాగా పరోక్ష లబ్ధిదారులు కార్ల ఉత్పత్తిదారులు, వాటి పంపిణీదారులు అని డెహ్రాడూన్ పౌరసమాజ బృందం ఒకటి విమర్శించింది.

ఈ హైవేల నిర్మాణాలకు బిందాల్, రిస్పాన నదుల నుంచి లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్విపోయవలసి వుంటుందని, దీనివల్ల వరదల సంభవత పెరుగుతుందని డెహ్రాడూన్ నివాసి అయిన భారతి జైన్ అన్నారు. డెహ్రాడూన్ పరిసర ప్రాంతాలలో భూగర్భ జలాల పెరుగుదలకు విశేషంగా తోడ్పడే ఈ నదులలో మట్టి తవ్వకాలు, జల ప్రవాహాలకు ఆటంకాల వల్ల వర్షాకాలంలో వరదలు, వేసవిలో కరువులు వస్తాయని ఆమె తెలిపారు. డెహ్రాడూన్ ప్రాంతం ఇప్పటికే భూగర్భ జలాల కొరత నెదుర్కొంటుందని, రిస్పాన-బిందాల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వల్ల వాహనాల రాకపోకలకు సౌలభ్యం కలగవచ్చునేమో కానీ దానివల్ల జల భద్రత, పర్యావరణ సమతుల్యతకు ప్రమాదమేర్పడుతుందని ఆమె అన్నారు. తాత్కాలిక వెసులుబాటు లేదా దీర్ఘకాలిక ప్రయోజనాలలో నొకదాన్ని డెహ్రాడూన్ పౌరులు ఎంచుకోవల్సిన సమయమాసన్నమయిందని భారతి జైన్ స్పష్టం చేశారు.

ఈ హైవేల నిర్మాణంపై డెహ్రాడూన్ పౌరులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని ఇటీవల ఒక సర్వేలో వెల్లడయింది. వీటితో పాటు ఢిల్లీ–డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నారు. వీటివల్ల డెహ్రాడూన్ పౌరులకు సమకూరే తాత్కాలిక సామాజిక ప్రయోజనాలు స్వల్పం కాగా దీర్ఘకాలిక పర్యావరణ, సామాజిక నష్టాలు చాలా తీవ్రంగా ఉంటాయి. పర్యాటకులకు అవి ఏ విధంగా లబ్ధి కలిగిస్తాయి అన్నది తెలియదు. ఈ హైవేల నిర్మాణం పూర్తయితే ముస్సోరిలోకి ప్రతిరోజూ అదనంగా వేలాది చిన్నకార్లు, బస్సులు ప్రవేశిస్తాయి. ఈ పర్యాటకుల రద్దీని ఎలా తట్టుకుంటారు? అదనపు వాహనాల వెల్లువ సృష్టించే ట్రాఫిక్ జామ్‌లను ఎలా నివారిస్తారు? వాహనాలను తాత్కాలికంగా నిలపడానికి కొండ పక్కన పది అంతస్తుల పార్కింగ్ సదుపాయాన్ని నిర్మించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం పూనుకోనున్నదా?

ఉత్తరాఖండ్ విలక్షణ భౌగోళికత, చరిత్ర, సంస్కృతి గురించి మన కాలంలో మరెవ్వరికి కంటే సమగ్రంగా తెలిసిన శేఖర్ పాఠక్ తన విద్వత్ ప్రాజ్ఞతతో ఒక వివేకవంతమైన వ్యాఖ్య చేశారు: 'ప్రాకృతిక జగత్తు, జన సమూహాల వైవిధ్య జీవన రీతులను గౌరవిస్తూ నిదానంగా, నిరాడంబరంగా జరిగే పుణ్యక్షేత్రాల సందర్శన యాత్రలా పర్యాటకాన్ని రూపొందించుకోవల్సి ఉండగా ప్రకృతి, ప్రజలకు విధ్వంసాన్ని కాలుష్యాన్ని మిగిల్చే ఆర్భాటపూరిత పర్యాటకంలా తీర్థయాత్రలను తీర్చిదిద్దాలని ప్రభుత్వాలు ఆకాంక్షిస్తున్నాయి' అని పవిత్ర క్షేత్రాల సందర్శనలా పర్యాటక రంగాన్ని పునః రూపకల్పన చేయడమనేది ఉత్తరాఖండ్‌ను ప్రస్తుతం పరిపాలిస్తున్న రాజకీయవేత్తల, అధికారుల ప్రధాన ప్రాధాన్యత అవ్వాలి. మరింత మెరుగైన, అందరికీ అందుబాటులో ఉండే పాఠశాలల, ఆసుపత్రుల నిర్వహణ, తద్వారా ఆ హిమాలయ రాష్ట్ర ప్రజలకు సుస్థిర ఆర్థిక భవిష్యత్తును సమకూర్చడం ఉత్తరాఖండ్ పాలకులకు రెండవ, బహుశా మరింత ముఖ్యమైన ప్రాథమ్యం కావాలి. ఉత్తరాఖండ్ ఆవిర్భావానికి ప్రేరణ అయిన ఉదాత్త ఆకాంక్షలు, సమున్నత లక్ష్యాలు ఇప్పటికీ చాలా స్వల్పంగా మాత్రమే నెరవేరాయి. వాటిని సంపూర్ణంగా సాకారం చేయవలసిన బాధ్యత ఉత్తరాఖండ్ ప్రస్తుత, భావి పరిపాలకులపై ఉన్నది.

> ప్రాకృతిక జగత్తు, జన సమూహాల వైవిధ్య జీవన రీతులను గౌరవిస్తూ జరిగే పుణ్యక్షేత్రాల సందర్శన యాత్రలా పర్యాటకాన్ని రూపొందించుకోవల్సి ఉండగా ప్రకృతి, ప్రజలకు విధ్వంసాన్ని, కాలుష్యాన్ని మిగిల్చే ఆర్భాటపూరిత పర్యాటకంలా తీర్థయాత్రలను తీర్చిదిద్దాలని ప్రభుత్వాలు ఆకాంక్షిస్తున్నాయని చరిత్రకారుడు శేఖర్ పాఠక్ వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్ రజతోత్సవాల శుభవేళ పవిత్ర క్షేత్రాల సందర్శనలా పర్యాటక రంగాన్ని రూపొందించేందుకు, ప్రజలకు సుస్థిర ఆర్థిక భవిష్యత్తును సమకూర్చేందుకు పాలకులు పూనుకోవాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

చిరస్మరణీయులు ఆచార్య ఎస్వీ రామారావు

ఆచార్య ఎస్వీ రామారావు ఇక లేరు అన్నది భౌతిక సత్యం. తమ గ్రంథాలలో వారు సజీవంగా ఉన్నారన్నది సాహిత్య సత్యం. సెప్టెంబర్ 17న ఉదయం వారు కనుమూశారన్న వార్త సాహిత్యలోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. వారు వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలో 1941లో జన్మించారు.

2000 సంవత్సరం నుంచి తెలుగు సాహిత్య రంగంలో మార్పులు చోటుచేసుకుంటూ వచ్చాయి. తెలంగాణ సాహిత్య ప్రత్యేక అస్తిత్వాన్ని నిరూపించుకోవటానికి బలమైన వాదనలను వినిపించవలసిన అగత్యం ఏర్పడింది. తెలుగు సాహిత్య చరిత్రలలో తెలంగాణ సాహిత్యానికి సరైన చోటు లభించకపోవటం వంటి సత్యాలను ఎత్తి చూపవలసి వచ్చింది.

ఇట్లాంటి చారిత్రక సందర్భంలో ఎస్వీ రామారావు తమ కలానికి పదును పెట్టి తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించారు. వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా, శాఖాధ్యక్షులుగా, పాఠ్యప్రణాళికా సంఘం అధ్యక్షులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. కాని తెలుగు సాహిత్య చరిత్రకు, తెలంగాణ సాహిత్య చరిత్రకు సంబంధించిన వ్యాసాలను, గ్రంథాలను ఎత్తిన కలం దించకుండా రాస్తూ వచ్చారు. వీరు ఈ అంశాల మీద ఆంగ్లంలో కూడా రచనలు చేసి ప్రచురించడం మూలంగా అన్యభాషీయులకు కూడా తెలంగాణ ప్రాంతపు సాహిత్య వైశిష్ట్యం తెలిసింది.

నివాళి



ఎస్వీ రామారావు 1960 ప్రాంతం నుంచి సాహిత్య రంగంలో ఉన్నారని చెప్పవచ్చు. 'జ్యోతిర్మయి' అన్న సాహిత్య సంస్థను నెలకొల్పి, అదే పేరుతో సాహిత్య సంచికలను కూడా ప్రచురిస్తూ వచ్చారు. వీటిల్లో ఎక్కువగా పాలమూరు జిల్లా కవుల రచనలు ప్రచురితమయ్యాయి.

సాహిత్య విమర్శ, సాహిత్య చరిత్ర ఈ రెండూ వారికి ఇష్టమైన ప్రక్రియలు. డా. సి.నారాయణరెడ్డి పర్యవేక్షణలో 'తెలుగు సాహిత్య విమర్శ–అవతరణ, వికాసాలు' అన్న అంశం మీద పరిశోధన చేసి, 1973లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి పట్టా పొందారు. ఇది విమర్శ ప్రక్రియలో తెలుగులో వచ్చిన తొలి పరిశోధన గ్రంథం. ఇది పలు ముద్రణలు పొంది దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో ప్రాచుర్యం పొందింది. విమర్శలో ఆలంకారిక విమర్శ, తులనాత్మక విమర్శ, స్వతంత్ర విమర్శ, చారిత్రక విమర్శ, కవి జీవిత విమర్శ, కళాతత్వ విమర్శ, సాంఘిక విమర్శ, మనస్తత్వ విమర్శ– వంటి అనేక భేదాలున్నాయని ఒక వ్యాసంలో పేర్కొన్నారు. వాటిని వివరించారు కూడా. ఇది వారి కూలంకష ప్రజ్ఞకు నిదర్శనం.

2012లో ఎస్వీ రామారావు రచించిన 'తెలుగు సాహిత్య చరిత్ర' ఒక తెలంగాణ పరిశోధకుడు ఒక చేతిమీదుగా రాసిన తొలి చరిత్రగా చెప్పుకోవచ్చు. సాహిత్య చరిత్రలో కవుల కాలస్థలాలకు సంబంధించి, అధ్యాయాల విభజనకు సంబంధించి అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. అంతర్ బహిర్ సాక్ష్యాల ఆధారంగా వీటిని పరిష్కరించవలసి ఉంటుంది. ప్రపంచంలోనే తొలి కథల సంపుటి అయిన బృహత్కథను రచించిన గుణాఢ్యుని కాలం గూర్చి తొలితరం చరిత్రకారులు అనేక వాదాలు చేశారు. అయితే ఎస్వీ రామారావు గుణాఢ్యుడు క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందిన హాల శాతవాహనుని కాలం నాటివాడని భావించారు. అధిక సంఖ్యాకుల అభిప్రాయం కూడా ఇదే కావటం గమనార్హం. తెలంగాణ సాహిత్య చరిత్ర మీద కూడా వారు అనేక గ్రంథాలు రాశారు. 'మావూరి కథలు', 'విశ్వనాథ దర్శనం', 'గ్రంథావలోకనం', 'విమర్శక వతంసులు' వంటి ఇతర పుస్తకాలు రచించారు.

ఎస్వీ రామారావు చాలా అభిరుచులున్న రచయిత. 'మాయాబజారు', 'గుండమ్మ కథ' వంటి అనేక సినిమాల మీద వారు రాసిన సమీక్షలు పాఠకులను ఆకట్టుకున్నాయి. నెల్లూరి కేశవస్వామి, భాస్కరభట్ల కృష్ణారావు వంటి సత్తా ఉన్న రచయితల పుస్తకాల మీద కూడా వారు సమీక్షలు రాశారు. 'తెలుగు అధ్యాపక సంఘం' అధ్యక్షులుగా ఉన్న సమయంలో కళాశాల విద్యలో తెలుగు భాష ప్రాముఖ్యం తగ్గిపోవడాన్ని నిరసిస్తూ, ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరిస్తూ వచ్చారు.

కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోసం 'సి.నారాయణరెడ్డి' మీద మోనోగ్రాఫ్ రాశారు. నారాయణరెడ్డి జీవిత సాహిత్యాల మీద వచ్చిన సాధికారికమైన గ్రంథంగా దీన్ని చెప్పుకోవచ్చు.

ఎస్వీ రామారావు పర్యవేక్షణలో సుమారు 30 మంది పరిశోధకులకు ఎం.ఫిల్, పిహెచ్.డి పట్టాలు లభించాయి. విద్యార్థులకు సన్నిహితంగా ఉంటూ, వారి సందేహాలను నివృత్తి చేస్తూ సరైన బాటలో వారిని నడిపించారు. ఏది ఏమైనా చివరి శ్వాస వరకు సాహిత్య సేవ చేస్తూ సార్థక జీవితాన్ని గడిపిన ఆచార్య ఎస్వీ రామారావు చిరస్మరణీయులు.

● అమ్మంగి వేణుగోపాల్

సంఘాల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పది లక్షలకు పైగా ఉన్నారు. వారి సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదు. దీనికి ప్రధాన కారణం ఆయా ఉద్యోగ సంఘాల విభజన, వాటి మధ్య సమైక్యత లోపించడం. 2009కి ముందు ఉద్యోగ సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా ఉద్యమించేవి. దీంతో ప్రభుత్వం సత్వరమే స్పందించి, ఆయా సమస్యలను పరిష్కరించేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఉద్యోగ సంఘాల సంఖ్య పెరగడంతో వారి గళం బలహీనమైంది. ప్రభుత్వానికి ఒకే విధమైన డిమాండ్ వెళ్లకపోవడంతో సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోంది.

ఉద్యోగి– ఉపాధ్యాయ– పెన్షనర్ల సమస్యలు సత్వరమే పరిష్కారం కావాలంటే సంఘాల ఐక్యత తప్పనిసరి. దాని కోసం కొత్త నిర్మాణం అవసరం. ప్రతి ఉద్యోగ శాఖలోని సంఘాలన్నీ కలసి ఒకే జాయింట్ యాక్షన్ కమిటీ (JAC)ని ఏర్పాటు చేయాలి. అలా అన్ని శాఖల జేఏసీల ఛైర్మన్లు, జనరల్ సెక్రటరీలు కలసి రాష్ట్ర స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి. అప్పుడు అన్ని శాఖల ఉద్యోగుల సమస్యలను ఈ కౌన్సిల్ ప్రభుత్వ స్థాయిలో సమగ్రంగా ప్రతిపాదిస్తుంది. సమస్యల సత్వర పరిష్కారానికి ఇదే ఉత్తమ పద్ధతి. సంఘాల్లో రాజకీయ ప్రభావాన్ని తగ్గించి, పూర్తిగా ఉద్యోగి, ఉపాధ్యాయ, పెన్షనర్ల హక్కుల కోసం మాత్రమే కృషి చేయాలి.

నేడు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు అనేక సమస్యలనెదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ/డీఆర్ బకాయిలు చెల్లించడంతో పాటు, కొత్త పీఆర్సీ ప్రకటన వరకు తక్షణమే సరిపడే ఇంటరిమ్ రిలీఫ్‌ను ప్రకటించాలి. హెల్త్ కార్డ్ వ్యవస్థలోని లోపాలు సరిచేయాలి. పెన్షనర్లను వర్గీకరించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలి. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో పారదర్శకత ఉండేలా చూడాలి. పాఠశాలల్లో, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. వేతన అసమానతలను తొలగించాలి. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి. పాత పెన్షన్ విధానాన్నే ప్రభుత్వం కొనసాగించాలి.

– టిఎంబి. బుచ్చిరాజు

అభివృద్ధి రథానికి కూటమి 'సారథ్యం'

సమర్థవంతమైన సారథ్యమే విజయాన్ని తెచ్చిపెడుతుంది. నరేంద్రమోదీ సారథ్యం దేశానికి ఎన్నో అపురూప విజయాలను తెచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కూటమి పార్టీల సారథ్యంలో సమష్టి కృషితో అభివృద్ధి, జవాబుదారీతనం రాష్ట్రానికి మంచి భవిష్యత్‌ను కల్పిస్తున్నాయి. సమర్థులంతా తమ తమ విభాగాల్లో సారథ్యం వహిస్తున్నందున ఇవాళ దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్టాలెక్కింది.

ఎన్డీయే కూటమి కలసికట్టుగా దేశ ప్రగతిని సాధిస్తూ ప్రజలు కోరుకున్న పాలన అందిస్తోంది. దాని ఫలితమే నేడు అనేక రకాలుగా పన్నుల విషయంలో అంతర్జాతీయ ఒత్తిడులు ఉన్నా, మన ఆత్మగౌరవాన్ని కోల్పోకుండా ముందుకు సాగుతున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో, అభివృద్ధి–సంక్షేమం సాధించడంలో ఎన్డీయే కూటమి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోంది. ఏపీ వృద్ధి రేటు 10.5 శాతానికి చేరుకోవడం అభినందనీయం. దీనిని ఎన్డీయే కూటమి ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధికి చక్కటి సంకేతంగా భావించవచ్చు. అందుకే భారతీయ జనతా పార్టీ 'సారథ్యం' పేరుతో కేంద్ర ప్రభుత్వం విజయాలను, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ మంచి పనులను నేడు ప్రజలలోకి తీసుకెళ్లింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బాధ్యతలు చేపట్టిన వెంటనే వివిధ దశల్లో 26 జిల్లాలలో 'సారథ్యం' పేరుతో నేరుగా ప్రజలను, పార్టీ శ్రేణులను కలిసి ఈ యాత్రను దిగ్విజయంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాగిస్తున్న పురోగతిని, కేంద్రం అందిస్తున్న సహకారాన్ని, రాష్ట్రంలో ఎన్డీయే సాగిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను ప్రజలకు తెలియచేసేలా ఈ యాత్ర విజయవంతంగా జరిగింది. ఈ యాత్రలో పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు వివిధ వర్గాల ప్రజలతో మమేకమయ్యారు. మెరుగైన పాలనకు వారి అభిప్రాయాలను, సూచనలను తీసుకున్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభమైన ఈ యాత్ర 14న విశాఖపట్నంలో ముగిసింది.

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు సెమీకండక్టర్ యూనిట్‌ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పరిశ్రమ రాబోయే రోజుల్లో అత్యంత కీలకం. ఒక పరిశ్రమ ప్రభుత్వ రంగంలో ఏర్పాటయితే, ప్రైవేటు రంగంలోనూ పెట్టుబడులు వస్తాయి. అందుకే సెమీకండక్టర్ ఇండస్ట్రీ కేటాయింపుపై విస్తృత ప్రచారం జరిగింది.

> రాష్ట్రాన్ని వృద్ధి బాటలోకి నడిపించడం.. నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల సారథ్యం వల్లనే సాధ్యమవుతుందని ప్రజలు గట్టిగా నమ్మి, వారికి పట్టం కట్టారు. ఆ నమ్మకాన్ని సాధ్యం చేయడానికి నేడు కూటమి పార్టీలు పని చేస్తున్నాయి. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరేలా సాగిన 'సారథ్యం' యాత్ర లక్ష్యాన్ని చేరింది. ఏపీలో బీజేపీతో పాటు కూటమిని మరింత బలోపేతం చేసింది.



ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ డబుల్ ఇంజిన్ సర్కార్ సారథ్యంలో చేస్తున్న ప్రతి అభివృద్ధి, సంక్షేమం వెనుక కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ ప్రత్యక్ష సహకారం ఉంది. అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు, పారిశ్రామిక కారిడార్లు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వంటి వాటిలో నిధుల కొరత లేదు. సారథ్యం యాత్రలో ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ కూడా అదే.

అమరావతి, పోలవరం– ఈ రెండింటిలోనూ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ డబుల్ ఇంజిన్ సర్కారులో పనులు వేగంగా జరుగుతున్నాయి. వైసీపీ హయాంలో ఆగిపోయిన అనేక ప్రాజెక్టులు గట్టెక్కించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువచ్చిన ప్రతి ప్రతిపాదననూ కేంద్రం ఆమోదించింది. మొదటగా 2024–25 యూనియన్ బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధి కోసం రూ.15,000 కోట్లు కేటాయించారు. ఈ నిధులు వరల్డ్ బ్యాంక్, ADB వంటి సంస్థల ద్వారా అందుబాటులోకి వచ్చాయి. మొదటి విడతలో రూ.4,285 కోట్లు విడుదల చేశారు, ఇది 25 శాతం మొబిలైజేషన్ అడ్వాన్స్‌గా వరల్డ్ బ్యాంక్ ద్వారా ఏప్రిల్ 1, 2025న వచ్చింది. ఇవన్నీ కేంద్రమే తిరిగి చెల్లిస్తుంది. రాష్ట్రానికి ఆర్థిక భారం లేదు. మే 2, 2025న ప్రధాని మోదీ అమరావతిలో రూ.58,000 కోట్ల విలువైన పనులను ప్రారంభించారు. మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు 2024–25 కేంద్ర బడ్జెట్‌లో రూ.50,475 కోట్లు కేటాయించారు. ఇందులో అమరావతి, జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాలు, విద్యారంగం సహా ఇతర ప్రాజెక్టులు ఉన్నాయి. ఇప్పుడు పలు శాఖలలో పనులు జరుగుతున్నాయి. ఇది కూటమి సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధి.

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు గందరగోళంలో పడింది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ కోసం 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.12,157 కోట్లను రెండు విడతలలో కేటాయించింది, వీటితో ప్రాజెక్టు నిర్మాణం ఊపందుకుంది. 2014 నుంచి 2025 వరకు, కేంద్రం రూ.13,226.04 కోట్లను ప్రాజెక్ట్ కోసం విడుదల చేసింది. 2025 ఫిబ్రవరి నాటికి ప్రాజెక్ట్ 55.9శాతం పూర్తయింది. 2019–2024 మధ్య వైసీపీ ప్రభుత్వం సంవత్సరానికి 2.32శాతం పురోగతి సాధించగా, ఎన్డీయే ప్రభుత్వం 2024 జూన్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు 8 నెలల్లో 6.11శాతం పురోగతిని సాధించింది. విశాఖకు గూగుల్ డేటా సెంటర్, అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమ రావడం ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్. భోగాపురం ఎయిర్‌పోర్టు శరవేగంగా పూర్తవుతోంది. రాయలసీమ ప్రాంతంలోని కొప్పర్తి నోడ్, ఓర్వకల్ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి రూ.4,000 కోట్ల నిధులు కేంద్రం కేటాయించింది. ఈ కారిడార్లు ఇండస్ట్రియల్ గ్రోత్‌ను ప్రోత్సహించడం, ఉద్యోగ అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా ఉన్నాయి. రాయలసీమ, ప్రకాశం, ఉత్తర కోస్తాంధ్రలలో సామాజిక–ఆర్థిక అభివృద్ధి కోసం రూ.4,000 కోట్లు కేటాయించారు. ఇందులో రోడ్లు, నీటి సరఫరా, ఇతర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు ఉన్నాయి. సోలార్, విండ్, ఇతర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ఇది ప్రోత్సాహం ఇస్తుంది. ఏపీలో 1,336 కి.మీ. కొత్త, అదనపు రైల్వే లైన్ల కోసం డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. విశాఖ రైల్వేజోన్ కూడా ప్రారంభానికి సిద్ధమవుతోంది.

రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలు గమ్యం లేని పాలన సాగింది. అలాంటి స్థితి నుంచి రాష్ట్రాన్ని వృద్ధి బాటలోకి నడిపించడం.. నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల సారథ్యం వల్లనే సాధ్యమవుతుందని ప్రజలు గట్టిగా నమ్మి, వారికి పట్టం కట్టారు. ఆ నమ్మకాన్ని సాధ్యం చేయడానికి నేడు కూటమి పార్టీలు పని చేస్తున్నాయి. మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తోంది. చంద్రబాబునాయుడు, సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పవన్ కల్యాణ్ సహకారంతో ఆంధ్రను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నది. 'సారథ్యం' యాత్ర ముగింపు సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరై ఇవే విషయాలను గుర్తు చేసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను మెప్పించడానికే సారథ్యం చేయాలి. అలాంటి నాయకత్వం ప్రజలకు వచ్చినప్పుడు వారు ప్రత్యామ్నాయం దిశగా ఆలోచించరు. ప్రధాని మోదీ సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని, ఆంధ్రకు కొత్త వందేభారత్ రైళ్లు అందించామని, విమానాశ్రయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని నడ్డా తెలిపారు. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరేలా సాగిన ఈ 'సారథ్యం' యాత్ర లక్ష్యాన్ని చేరింది. ఏపీలో బీజేపీతో పాటు కూటమిని మరింత బలోపేతం చేసింది. గ్రామగ్రామానికి కూటమి విజయాలు చేరేలా చేసింది.

■ ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి
బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు



అమ్మరూపం అపురూపం

దసరా ఉత్సవాల్లో అలంకారాల విశిష్టత

ఈసారి కొత్తగా కాత్యాయనీ అలంకారం

ఒక్కో రూపానికి ఒక్కో చరిత్ర

కౌంట్‌డౌన్ 3

6



● **ఫ్లాష్ మాబ్**

విజయవాడ ఉత్సవ్ సక్సెస్‌ను కాంక్షిస్తూ గురువారం నగరవ్యాప్తంగా ఫ్లాష్‌మాబ్ జరిగింది. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కాలేజీలో జరిగిన ఫ్లాష్‌మాబ్ అందరినీ ఆకట్టుకుంది.

మాయాజలం

దసరాలో భక్తులకిచ్చే వాటర్ బాటిళ్ల టెండర్లలో అవినీతి

కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగ అధికారుల చేతివాటం

- రాజకీయ జోక్యంతో అడ్డగోలుగా నిబంధనల మార్పు
- కంపెనీల బ్రాండ్ పేర్లతో టెండర్లు పిలిచిన కార్పొరేషన్
- కోరియండం పేరుతో ఇష్టానుసారంగా మార్పులు
- దుర్గమ్మ జలప్రసాదం పేరు తొలగింపుపై విమర్శలు
- అస్మదీయ సంస్థ కోసం బాటిల్ పరిమాణం తగ్గింపు
- కోర్టును ఆశ్రయించిన ఇతర కాంట్రాక్టు సంస్థలు
- సరుకు దించేయాలంటూ సంస్థకు అధికారుల సలహా



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దసరా ఉత్సవాల్లో భక్తులకు మంచినీటి సరఫరా నిమిత్తం ఏటా శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంతో పాటు కార్పొరేషన్ కూడా టెండర్లు పిలుస్తుంది. గత ఉత్సవాల్లో 500 ఎంఎల్ వాటర్ బాటిళ్లు 21 లక్షలు కొన్నారు. అవి సరిపోలేదని మరో 2 లక్షలు కొన్నారు. ఈసారి మాత్రం 30 లక్షల వాటర్ బాటిళ్లు కొనడానికి కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఇటీవల టెండర్లు పిలిచారు. టెండర్లు పిలిచే ముందు నిబంధనలు పట్టించుకోలేదు. కొన్ని బ్రాండ్ పేర్లనే సూచిస్తూ టెండర్లు పిలిచారు. వీటిలో కూడా రెండు బ్రాండ్లు అంతగా వాడుకలో లేనివే ఉన్నాయి.

టెండర్లలో వండర్లు

మంచినీటి బాటిళ్ల కోసం కార్పొరేషన్ అధికారులు టాటా, కిన్లే, బిస్లరీ, ఆల్కాజోన్, ఆక్వాజెన్ వంటి బ్రాండ్ల పేర్లను ప్రతిపాదించారు. వీటిలో టాటా, కిన్లే, బిస్లరీ వంటివి అందరికీ పరిచయమున్నవే. ఆల్కాజోన్, ఆక్వాజెన్ గురించి అందరికీ తెలియదు. ఇలా బ్రాండ్ పేర్లు పెట్టి టెండర్లను పిలవటమే నిబంధనలను తుంగలో తొక్కడం. మినరల్ వాటర్ బాటిల్ కొనాలంటే ముందుగా వాటి పరిమాణం, నాణ్యత, మినరల్స్ స్పెసిఫికేషన్లు చూడాలి. బీఐఎస్, ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫసాయ్) ప్రమాణాలు ఉన్నవాటిని అనుమతించవచ్చు. కానీ, కార్పొరేషన్ అధికారులు అలా చేయలేదు.

ముందుగా అనుకున్న సంస్థకే కాంట్రాక్టు

మొదటి నుంచి ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఓ సంస్థకు అనుకూలంగా పావులు కదుపుతూ వచ్చారు. ఆ సంస్థ కోసం కోరియండంతో ఆట మొదలుపెట్టారు. మిగతా 6లో..

దసరా ఉత్సవాల్లో భక్తులకు అందించే వాటర్ బాటిళ్ల టెండర్లలో కార్పొరేషన్ అధికారులు ఇష్టానుసారం వ్యవహరించారు. ఓ కాంట్రాక్టు సంస్థకు కట్టబెట్టేందుకు ఏకంగా నిబంధనలనే మార్చేశారు. 30 లక్షల వాటర్ బాటిళ్ల సరఫరాకు సంబంధించిన అవినీతి టెండర్ల వ్యవహారం బయటపడటంతో కొందరు కోర్టును ఆశ్రయించారు. అయినా ఏమాత్రం బెరుకు లేకుండా సదరు టెండరును అమల్లోకి తెచ్చేందుకు కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రయత్నాలు చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కమిషనర్‌కు ఫిర్యాదులు.. కోర్టు మెట్లెక్కిన పలు సంస్థలు

టెండర్ల వ్యవహారంలో లోపాలు ఉన్నాయని, అవినీతి చోటుచేసుకుందని మునిసిపల్ కమిషనర్ ధాన్యచంద్రకు పలువురు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. టెండర్లను రద్దు చేయాల్సిందిగా కోరారు. టెండర్లలో పాలుపంచుకున్న సంస్థలు కూడా కార్పొరేషన్ అధికారుల తీరుపై గొడవపడ్డాయి. అక్రమాలు జరిగాయంటూ కొన్ని సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో ఎంపిక చేసిన సంస్థ కాంట్రాక్టును రద్దు చేయాల్సి వస్తుందన్న ఉద్దేశంతో యుద్ధప్రాతిపదికన సరుకు దింపాలంటూ పరోక్షంగా కాంట్రాక్టు సంస్థకు ఇంజనీరింగ్ అధికారులు సూచనలిచ్చారు. ఒకసారి సరుకు దింపితే.. కాంట్రాక్టును రద్దుచేసే అవకాశం ఉండదన్నది వారి ఆలోచన.

రాధాకృష్ణను అభినందిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని



దుర్గగుడి ధర్మకర్తల మండలి చైర్మన్‌గా

బొర్రా రాధాకృష్ణ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రాధాకృష్ణది కృష్ణాజిల్లా పోరంకి

విజయవాడ, సెప్టెంబరు 18 **(ఆంధ్రజ్యోతి) :** శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కృష్ణా జిల్లాకు చెందిన బొర్రా రాధాకృష్ణ (గాంధీ) నియమితులయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రాష్ట్రంలోని వివిధ దేవాలయాలు, టీటీడీ ఆలయాల స్థానిక సలహా మండలి చైర్మన్లను నియమించింది. ఇందులో రాధాకృష్ణను దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి వరించింది. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం పోరంకి గ్రామానికి చెందిన ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ఉన్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసి, ఆ ప్రకటన చేసినప్పటి నుంచి రాధాకృష్ణ రాజకీయాల్లో ఉన్నారు. హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్టీ ప్రకటన మిగతా 6లో..

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.2.17 కోట్లు



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 18 **(ఆంధ్రజ్యోతి) :** ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. 14 రోజులకు రూ.2కోట్ల17లక్షల98వేల528 ఆదాయం రాగా, బంగారం 235 గ్రాములు, వెండి మూడు కిలోల 970 గ్రాములు వచ్చింది. ఇందులో విదేశీ కరెన్సీ కూడా ఉంది. ఈవో శీనానాయక్, అధికారులు, ఎస్పీఎఫ్, పోలీసుల పర్యవేక్షణలో ఈ లెక్కింపు కార్యక్రమం జరిగింది.

చకచకా..

- విజయవాడ ఉత్సవ్-2025కు చురుగ్గా ఏర్పాట్లు
- కోర్టు తీర్పుతో గొల్లపూడిలో పనులు ముమ్మరం
- దసరా ఉత్సవాలకు ముందే అందుబాటులోకి..
- కట్టుదిట్టమైన భద్రత, పార్కింగ్ ఏర్పాట్లు



గొల్లపూడిలో చదును చేస్తున్న స్థలం

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం) : విజయవాడ ఉత్సవ్-2025లో భాగంగా గొల్లపూడిలోని 40 ఎకరాల్లో ఎగ్జిబిషన్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. కోర్టు తీర్పు సానుకూలంగా రావటంతో నిర్వాహకులు పనులు ముమ్మరం చేశారు. ఎక్స్‌కవేటర్లతో నేలను చదును చేస్తున్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ఎగ్జిబిషన్ నిర్వహణ చేపట్టారు. దేవీ నవరాత్రులు ప్రారంభమయ్యేలోపు ఇక్కడ స్టాళ్లు ఏర్పాటుచేసేలా పనులు వేగవంతం చేశారు.

● ఎగ్జిబిషన్ ప్రత్యేకతలు

ఎగ్జిబిషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేకంగా స్టేజ్ ఏర్పాటు చేస్తున్నారు. రెస్ట్ చాంబర్, అఫిషియల్ చాంబర్, వీఐపీ చాంబర్లు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడే సమావేశ మందిరం కూడా ఉంటుంది. జెయింట్ వీల్, పలు రకాల ఆట వస్తువులు, గ్లోబల్ విలేజ్, ఫుడ్ జోన్ ఏర్పాటు చేస్తున్నారు. డ్వాక్రా మహిళలు తయారుచేసిన వస్తువులు, వ్యవసాయ, ఉద్యాన పంటలు, హస్తకళల ప్రదర్శనతో పాటు కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలను ప్రదర్శించనున్నారు. ఎగ్జిబిషన్‌కు వచ్చే వీఐపీలు, వీవీఐపీలు, సాధారణ భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం సువిశాలమైన స్థలాన్ని ఎంపిక చేశారు. ఎగ్జిబిషన్‌లో కట్టుదిట్టమైన భద్రతా మిగతా 6లో..

రాకింగ్ రోబోస్..!

సిద్ధార్థ వర్సిటీలో జాతీయ రోబోటిక్స్ విద్యార్థి పోటీలు

400 మంది విద్యార్థుల రాక

8



బార్‌లకు మరోసారి లాటరీ

- ఏడు బార్‌లకు వ్యాపారుల ఎంపిక
- 54 బార్‌లకు కనిపించని స్పందన

విజయవాడ, సెప్టెంబరు 18 **(ఆంధ్రజ్యోతి) :** జిల్లాలో రెండో విడత నిర్వహించిన బార్‌ల కేటాయింపు లాటరీలో ఏడింటికి వ్యాపారులను ఖరారు చేశారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం ఈ లాటరీ తీశారు. కలెక్టర్ లక్ష్మీశ లాటరీ ద్వారా వ్యాపారులను ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 61 బార్‌లకు తొలివిడతగా ఎలాంటి దరఖాస్తులు రాలేదు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు మూడో తేదీన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో ఏడు బార్‌లకే నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చాయి. వాటికి లాటరీ ద్వారా వ్యాపారులను ఎంపిక చేశారు. ఇంకా 54 బార్‌లకు ఎలాంటి స్పందన రాలేదు. తిరువూరు 1, జగ్గయ్యపేట 1, కొండపల్లి 6, విజయవాడలో 46 బార్‌లు పెండింగ్‌లు ఉన్నాయి. ఈ బార్‌లకు ఒక్క దరఖాస్తూ రాకపోవడం గమనార్హం.

పక్కా కమర్షియల్

ఆటోనగర్‌లో వాణిజ్య పన్నుల శాఖ చేతివాటం

- అందినకాడికి దండుకుంటున్న అధికారులు
- కేసుల పేరుతో వ్యాపారులకు బెదిరింపులు
- లోడును బట్టి రేటు నిర్ణయించి అక్రమ వసూళ్లు
- ఏజెంట్లుగా అటెండర్లు, డ్రైవర్లు, వాచ్‌మెన్లు



ఆటోనగర్.. విజయవాడ నగరానికి, కృష్ణాజిల్లాకు మధ్య ఉన్న కీలకమైన వాణిజ్య కేంద్రం. ఇక్కడ భారీ వాహనాలకు బాడీలు తయారవుతాయి. రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. వేలమందికి ఉపాధి లభిస్తుంది. ఇదంతా నాణేనికి ఒకవైపే. రెండోవైపు మాత్రం అనేక అక్రమాలు, అవినీతి కార్యకలాపాలు కనిపిస్తాయి. వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు ఇదో కల్పతరువు. తనిఖీలు చేయాలని పై నుంచి టాస్క్ రాగానే ఈ శాఖలోని అధికారులకు ముందుగా ఆటోనగరే గుర్తొస్తుంది. సీవీటీ (చెకింగ్ వెహికల్ ట్యాక్స్) ఆదేశాలు వచ్చినా, రాకపోయినా ఠంచనుగా ఇక్కడ వాలిపోయి రూ.లక్షల్లో దండుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఆటోనగర్‌లో వాహనాల బాడీబిల్డింగ్ యూనిట్లు ఉన్నాయి. ఇవికాకుండా ఈ-వ్యర్థాలు, పాడైపోయిన తీగలు, ప్లాస్టిక్‌ను సేకరించే యూనిట్లు ఉన్నాయి. వాటిని టార్గెట్ చేసుకుని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వ్యవహారాలు చక్కబెడుతున్నారు. బహిరంగంగానే వసూళ్లు చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు ఆటోనగర్‌లో దుమారం రేపుతోంది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

లారీ కదిలితే రూ.లక్ష

ఆటోనగర్‌లో ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్, చెత్త కాగితాలను కొనే యూనిట్లు 120 వరకు ఉన్నాయి. ఇందులో కొన్ని యూనిట్లు హోల్‌సేల్‌గా, మరికొన్ని రిటైల్‌గా మిగతా 6లో..

హద్దులు దాటి..

నందిగామలో ఇసుక అక్రమ రవాణా

- తెలంగాణాకు సరఫరా చేస్తున్న అక్రమార్కులు
- రాత్రిపూట సరిహద్దులు దాటేస్తున్న వాహనాలు
- తెలంగాణాలో అధిక ధరలకు విక్రయం

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల) : నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. తెలంగాణాలో ఇసుక ఎక్కువ ధర పలుకుతుండటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. లారీలు, ట్రాక్టర్ల ద్వారా సరిహద్దు గ్రామాల మీదుగా రాత్రిపూట మిగతా 6లో..



కొద్దిరోజుల క్రితం నందిగామ పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు




జగజ్జననీ..

(ఇంద్రకీలాద్రి, ఆంధ్రజ్యోతి)


బెజవాడ అంటే కనకదుర్గాదేవి, కృష్ణానది గుర్తుకువస్తాయి. భక్తులు కృష్ణానదిలో స్నానంచేసి కొండపైన అమ్మవారిని దర్శించుకుంటారు. దసరా మహోత్సవాలలో మూలానక్షత్రం అమ్మవారు పుట్టినరోజు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. దసరా మహోత్సవాలు నవరాత్రులకు బదులుగా ఈఏడాది 11రోజులు జరుగుతాయి. తిథులు హెచ్చు తగ్గుల కారణంగా ఒకరోజు అదనంగా జరుపుకోవాల్సి వస్తుంది.

బాలాత్రిపుర సుందరీదేవి అలంకారం



దసరా మహోత్సవాలలో తొలి రోజు (22వ తేదీ) సోమవారం నాడు బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. సమస్త దేవీ మంత్రాల్లో బాలా త్రిపురసుందరీదేవి మంత్రం అత్యంత ప్రధానమైనదని, శక్తివంతమైనదని పేరు. మూడు లోకాలలోనూ అత్యంత అందమైన దేవతగా ఆమెను భావిస్తారు. దసరా మహోత్సవాలలో కన్నెపిల్లలను బాలాత్రిపుర సుందరిగా భావించి పూజలు చేస్తారు.

గాయత్రీదేవి అలంకారం



23వ తేదీ మంగళవారం గాయత్రీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. గాయత్రీదేవిని కొలవటం వల్ల సుఖశాంతులు లభిస్తాయని, మానసిక శాంతి కలుగుతుందని నమ్మిక. గాయత్రి మంత్ర జపంతో గుండె సంబంధిత వ్యాధులు తగ్గుముఖం పడతాయన్న శాస్త్ర పరిశోధనలున్నాయి. ముక్తా, విద్రుమ, హేమ, నీల, దవళం. సాంఖ్యాయనస గోత్ర గాయత్రిదేవి పిలవంగానే వరాలు ఇచ్చే దేవతగా నమ్ముతారు.

అన్నపూర్ణాదేవి అలంకారం



24వ తేదీ బుధవారం అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనమిస్తారు. కాశీపురాధీశ్వరి భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరి అంటే ఆమె ఈతి బాధలు లేకుండా అన్నపానాదులకు లోటులేకుండా చేస్తుందని నమ్మిక. ఆమెను శాంకరిగా, శంభుని ప్రియురాలిగా, కాశ్మీరవాసినిగా, కాశీనివాసిగా, త్రిపురేశ్వరిగా, త్రినయినిగా, విశ్వేశ్వరిగా కొలుస్తారు. అన్నపూర్ణ అంటే పూర్ణమైన ఆహారం కలది అని అర్థం.

కాత్యాయనీ దేవి అలంకారం



25వ తేదీ గురువారం కాత్యాయనీదేవిగా దుర్గమ్మ దర్శనమిస్తారు. నవ దుర్గలలో ఆరో అవతారం కాత్యాయనీదేవి. రాక్షస సంహారం కోసం ఆమె కాత్యాయనీ రూపంలో ఉన్నారని ప్రతీతి. ముక్కోటి దేవతలు, త్రిమూర్తులు కాత్యాయనీదేవికి సహకరిస్తారు. అత్యంత ఉగ్రరూపాల్లో ఆమె ఒకరు. దసరా మహోత్సవాలలో ఈఏడాది అదనంగా ఒకరోజు రావటంతో కాత్యాయనీ అలంకారంలో దుర్గమ్మ దర్శనం ఇస్తారు.

మహాలక్ష్మీదేవి అలంకారం




26వ తేదీ శుక్రవారం మహాలక్ష్మీదేవిగా కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. అష్టలక్ష్మి రూపాల్లో ఆమె పూజలు అందుకుంటుంది. మహాలక్ష్మీదేవి ధనానికి ఐశ్వర్యానికి అధిదేవత. మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన పత్నిగా ఆమె విష్ణువుతో పాటు భూలోకానికి వచ్చి కొలువై ఉన్నారని నమ్మిక. ధనం, ధాన్యం, ధైర్యం వంటివి కలగటానికి ఆమెను అమృతస్వరూపిణిగా కొలుస్తారు.

లలితా త్రిపుర సుందరీదేవి అలంకారం



27వ తేదీ శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మభక్తులకు దర్శనమిస్తారు. లలితా త్రిపుర సుందరీ శక్తి స్వరూపాలలో ముఖ్యమైన దేవత. ఆమె ఆదిపరాశక్తి స్వరూపం. దసరా ఉత్సవాలలో లలితా సహస్రనామ పారాయణ చేస్తారు. పరమేశ్వరుడు మహాకామేశ్వరుడుగా అమ్మవారు మహాత్రిపుర సుందరిగా ఈ అలంకారంలో కనిపించటం విశేషం.

మహాచండీదేవి అలంకారం



28వ తేదీ ఆదివారంనాడు మహాచండీదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. చండీదేవిని కొలిస్తే సర్వదేవతలను ప్రార్థించినట్లేనని పండితులు చెబుతారు. దుష్టులను సంహరించి శిష్ట రక్షణ చేయటమే అవతారానికి ప్రసిద్ధి. దుర్గగుడిలో నిత్యం చండీహోమం ద్వారా భక్తులు అమ్మవారిని కొలిచి సంతుష్టులు అవుతారు. చండీహోమానికి ప్రథమ ప్రాధాన్యత ఉంది.

సరస్వతీదేవి అలంకారం




29వ తేదీ సోమవారం మూలా నక్షత్రంనాడు మహాసరస్వతీ దేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. సరస్వతీ దేవి అలంకారానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. మూలనక్షత్రం నాడు అమ్మవారిని విశిష్టంగా కొలుస్తారు. ఆమెను కొలిచిన వారికి ఈతి బాధలు ఉండవని నమ్మిక. విద్య ఉన్నవాడు లోకంలో ఎక్కడైనా బ్రతకగలడని నమ్మిక. సరస్వతీదేవిని కొలిస్తే విద్య అపారంగా కలుగుతుందని నమ్మిక. మూలా నక్షత్రం నాడు సరస్వతిదేవిగా, వాగ్దేవతా మూర్తిగా విద్యార్థులు ఆమెను అత్యంత భక్తితో కొలుస్తుంటారు.

దుర్గాదేవి అలంకారం..




30వ తేదీ మంగళవారం నిజరూపం దుర్గాదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారు. చెడుపై విజయాన్ని సాధించినందుకు గుర్తుగా దుర్గాదేవిని కొలుస్తారు. దుర్గమాసురుడిని సంహరించటంతో ఆమెను దుర్గగా పూజలు అందుకుంటున్నారు. దుర్గ అంటే దుర్గతులు అన్నీ నాశనమవుతాయని నమ్మిక. తమ ఇంటి ఆడపడుచుగా భావించి పూజాదికాలు చేస్తారు. సమస్త దేవతా స్వరూపిణిగా దుర్గమ్మవారు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

మహిషాసుర మర్ధినీదేవి అలంకారం



అక్టోబరు 1వ తేదీ బుధవారంనాడు దుర్గాదేవి మహిషాసుర మర్ధినీదేవిగా భక్తులకు దర్శనం ఇస్తారు. అత్యంత శక్తివంతమైన ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకోవటం వలన ఈతి బాధలు ఉండవని నమ్మిక. ఈరోజునే ఆయుధ పూజ చేస్తారు. చివరి మూడురోజులు అమ్మవారిని పూజించటం వల్ల సర్వ శుభాలు కలుగుతాయని నమ్మిక.

రాజరాజేశ్వరి దేవి అలంకారం



దసరా మహోత్సవాలలో చివరి రోజైన 11వ రోజు 2వ తేదీ గురువారంనాడు దుర్గమ్మ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనం ఇస్తారు. అమ్మవారిని శాంతమూర్తిగా దర్శించుకుంటారు. జగన్మోహిని, మోక్షప్రదాయిని, శ్రీరాజరాజేశ్వరిదేవిని కొలవటం వల్ల సకల శుభాలు కలుగుతాయని నమ్మిక. చివరి రోజున అమ్మవారు హంస వాహనంపై కృష్ణానదిలో నదీ విహారం చేస్తారు. ఈ సమయంలో ముక్కోటి దేవతలు ఆమెకు జయజయధ్వానాలు పలుకుతారని నమ్మిక.



భూమిపూజ చేసి ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటును ప్రారంభిస్తున్న కూటమి నేతలు

అట్టహాసంగా విజయవాడ ఉత్సవ్ ఏర్పాట్లు

» గొల్లపూడిలో ఎగ్జిబిషన్‌కి భూమిపూజ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో గొల్లపూడిలోని వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ స్టాల్స్‌కు కూటమి నేతలు గురువారం సాయంత్రం భూమిపూజ చేసి ప్రారంభించారు. విఘ్నాలు తొలగి కార్యక్రమం విజయవంతం చేయాలని అమ్మవారిని వేడుకున్నారు. పుష్కర కాలం తర్వాత ఎంపీ కేశినేని శివనాథ్ చొరవతో ఎగ్జిబిషన్ మొదలు కావడం ఎంతో ఆనందంగా ఉందని కూటమి నేతలు అన్నారు. కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ అడ్వజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, బొమ్మసాని సుబ్బారావు, నూతులపాటి బాలకోటేశ్వరరావు, అక్కల గాంధీ, శ్రేయాస్ డైరెక్టర్ శ్రీనివాస్, నారద, గోపాలకృష్ణ, కాటంనేని చలపతి, కోటేశ్వరరావు, పద్మశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పవిత్రసంగమంలో సాంస్కృతిక శోభ

'విజయనర్తనం - కొండపల్లి మున్సిపాలిటీ' నినాదంతో కొండపల్లిలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రతిరోజుమూడు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్స్ చనమోలు నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ కోయ నెహ్రూ, చెరుకుమల్లి సురుష్, పులి దాను, వల్లూరు జనార్ధన స్వామి, ఇన్‌చార్జి కమిషనర్ మోస్మీ గనియా తదితరులు పాల్గొన్నారు.



గొల్లపూడిలో ఎగ్జిబిషన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వసంత

అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ పని

» ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఎద్దేవా

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడకు చెడ్డ పేరు తేవాలి, నగరంలో ఎలాంటి అభివృద్ధి జరగకూడదనేదే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని, అందులో భాగంగానే దేవస్థానం భూమిపై రైతులు పెట్టినట్టు తప్పుడు సంతకాలు పెట్టించి కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చాడని, అమ్మ దయవల్ల కోర్టు స్టే ఎత్తివేసిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో దేవస్థానం భూమిలో జరుగుతున్న ఎగ్జిబిషన్ ఏర్పాటు పనుల్ని ఆయన గురువారం ఆర్‌అండ్‌బీ, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనలో విజయవాడలో ఒక్కటంటే ఒక్క ఈవెంట్ కూడా నిర్వహించలేదని, ఇప్పుడు ఆ భావనను తొలగించి ఎగ్జిబిషన్ నిర్వహిస్తుంటే దానిని కూడా ఆపాలని చూశారన్నారు. విజయవాడలో స్థలం లేదు కనుకనే గొల్లపూడికి రావాల్సి వచ్చిందన్నారు. ఆటంకాలను అధిగమించి సకాలంలో పనులు పూర్తి చేస్తాం.. అన్నారు.

ఆహార భద్రతలో గోదాములు కీలకం

» వేర్ హౌసింగ్ ఎండీ విజయసునీత

అమరావతి, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ నిల్వల గిడ్డంగులు (సైంటిఫిక్ స్టోరేజ్) రైతుల అవసరాలతో పాటు జాతీయ ఆహార భద్రతకు అత్యంత అవసరమని ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విజయసునీత చెప్పారు. గురువారం లాంలోని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలో భారత ఆహార, ప్రజాపంపిణీశాఖ పరిధిలోని గోదాముల అభివృద్ధి, నియంత్రణ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డబ్ల్యూడీఆర్‌ఏలో నమోదయ్యే గోదాముల లాభాలు, ఎలక్ట్రానిక్ నెగోషియబుల్ వేర్‌హౌసింగ్ రశీదు, ప్లెడ్జ్ ఫైనాన్స్, వాణిజ్య అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయసునీత మాట్లాడుతూ ఏపీలో అనేక గోదాములు డబ్ల్యూడీఆర్‌ఏలో నమోదయ్యాయని, రాష్ట్రంలో ఉత్పత్తయ్యే ధాన్యాన్ని సరిగ్గా నిల్వచేసే కృషిని కొనసాగించాలని సూచించారు.

దసరా ఉత్సవాలు విజయవంతం చేద్దాం

» శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు

వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్వదినాలు మతసామరస్యానికి ప్రతీకలని, ఐక్యత, సోదరభావంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రతి పండగనూ జరుపుకుంటున్నామని, ఇదే స్ఫూర్తితో దసరా ఉత్సవాల విజయవంతానికి చేయిచేయి కలుపుదామని, జిల్లాను ఆదర్శవంతంగా నిలబెడదామని పేర్కొన్నారు. ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మందికిపైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే అవకాశముందని తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తిచేసే వారిపై నిఘా ఉంటుందని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, పార్కింగ్ సదుపాయాలు, సీసీటీవీలు, డ్రోన్లతో నిఘా.. ఇలా ప్రతివిషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విజయవాడ శాంతియుత వాతావరణానికి ప్రతీక అని, దసరా ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములమవుతామని వివిధ మతాల పెద్దలు పేర్కొన్నారు.

బ్యాటరీ పరిశ్రమలో అగ్నిప్రమాదం

» రూ.80 కోట్లకు పైగా ఆస్తి నష్టం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన మునోత్ పరిశ్రమ

తిరుపతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలోని మునోత్ లిథియం అయాన్ బ్యాటరీల తయారీ పరిశ్రమలో గురువారం అగ్నిప్రమాదం సంభవించింది. తెల్లవారుజామున 4.30 గంటలకు మంటలు చెలరేగగా, ఆ సమయంలో పరిశ్రమలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. శ్రీకాళహస్తి, పుత్తూరు, తిరుపతి, నాయుడుపేట, పాకాల, చిత్తూరు, రైల్వే కోడూరుల నుంచి 13 ఫైర్ ఇంజన్లను రప్పించి మంటలను ఆర్పేందుకు యత్నించారు. సుమారు ఐదారు గంటల తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. ప్రమాదంలో పవర్ బ్యాంకులు, మిషనరీ, ముడి పదార్థాలు, మొబైల్ బ్యాటరీలు, ఫర్నిచర్, ఏసీలు వంటివి 80 శాతం దగ్ధమయ్యాయి. ప్రాథమిక అం చనా మేరకు ఈ పరిశ్రమలో రూ. 80 కోట్ల విలువైన ఆస్తి కాలి బూడిదైంది. ఫోరెన్సిక్ నిపుణుల బృందం ప్రమాదస్థలిని సందర్శించి పరిశీలించింది.

అరబిందో ఫార్మా ఇండస్ట్రీలో షార్ట్ సర్క్యూట్

నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లోని అరబిందో ఫార్మా ఇండస్ట్రీలో గురువారం ఉదయం 9.15 గంటలకు గ్రాన్యులేషన్ విభాగంలో షార్ట్ సర్క్యూట్ అయింది. ఆ సమయంలో 1500మంది వరకూ సిబ్బంది పనిచేస్తున్నారు. పొగలు కమ్ముకోవడంతో సిబ్బంది పరిశ్రమ నుంచి వెలుపలికి పరుగులు తీశారు. గూడూరు, నాయుడుపేట, నెల్లూరు నుంచి ఐదు ఫైర్ ఇంజన్లను రప్పించారు. రెండున్నర గంటల తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. సుమారు రూ. కోటికి పైగా నష్టం వాటిల్లి ఉంటుందని భావిస్తున్నారు.

హద్దులు దాటి..

(5వ పేజీ తరువాయి)

గుట్టుగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

తెలంగాణలో ధర ఎక్కువ

కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత విధానం వల్ల అక్రమార్కులకు ఆశించినంత మిగలట్లేదు. పక్కనే ఉన్న తెలంగాణాలో ధర ఎక్కువగా ఉండటంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం నందిగామ పోలీసులు తెలంగాణాకు వెళ్తున్న రెండు లారీలు పట్టుకున్నారు. బుధవారం అర్ధరాత్రి చిల్లకల్లు పోలీసులు మల్కాపురం వద్ద మునేటి నుంచి ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకున్నారు.

కొత్త ఎత్తుగడలు

అక్రమార్కులు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. తెలంగాణాకు ఇసుక అక్రమంగా తరలించే క్రమంలో అక్కడి పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు ఆ రాష్ట్ర రిజిస్ట్రేషన్ కలిగిన ట్రాక్టర్లు, లారీలు వినియోగిస్తున్నారు. ఇంతకుముందు ఇసుక వాహనాలను ప్రత్యేకంగా ఎస్కార్టుతో నడిపేవారు. కొన్నాళ్ల ప్రత్యేకంగా రూపొందించిన ఒక యాప్ ద్వారా అక్రమ రవాణా సాగిస్తున్నారు. కొద్దిరోజుల కిందట ఇసుక లారీలను పట్టుకున్న సూర్యాపేట జిల్లా చింతలపాలెం, కోదాడ పోలీసులు ఆశ్చర్యపోయారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తి వద్ద నకిలీ అనుమతి పత్రాలు, నకిలీ రబ్బరు స్టాంపులు దొరికాయి. ఇక్కడి నుంచి రాత్రుళ్లు గుట్టుగా ఇసుక తీసుకెళ్లి, నకిలీ పత్రాలతో తెలంగాణాలో డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించి అధిక ధరకు అమ్ముతున్నారు. తెలంగాణాకు నిత్యం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల నుంచి భారీగా ఇసుక వాహనాలు తరలివస్తున్నాయని అక్కడి పోలీసులు పేర్కొనటం విశేషం.

తెలంగాణాలో డిమాండ్ కారణంగానే..

నందిగామ రెవెన్యూ డివిజన్‌కు సరిహద్దుగా ఉన్న తెలంగాణా రాష్ట్రం కోదాడ, ఖమ్మం ప్రాంతాల్లో ఇసుకకు డిమాండ్ ఎక్కువ. వరదల వల్ల గోదావరి నుంచి ఇసుక తీయటానికి వీలుపడలేదు. పులిచింతల ఎగువ ప్రాంతం సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో కూడా కృష్ణానది నుంచి ఇసుక రావట్లేదు. దీంతో తెలంగాణాలో ఇసుక కొరత తీవ్రంగా ఉంది. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో దూరాన్ని బట్టి ట్రాక్టరు ఇసుక రూ.8 వేల నుంచి రూ.12 వేలు పలుకుతుండగా, ఖమ్మంలో గరిష్ఠంగా రూ.15 వేలు పలుకుతోంది. దీనికి తోడు పక్కా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వాగులు, వంకల నుంచి లబ్ధిదారులు ఇసుక తీసుకునేందుకు తెలంగాణా ప్రభుత్వం హుజూర్‌నగర్, కోదాడ తదితర నియోజకవర్గాలను ఫ్రీజోన్‌గా ప్రకటించటం ఇక్కడి అక్రమార్కులకు వరంగా మారింది. అక్కడి వాగులు, వంకల్లో దొరికే ఇసుక కంటే మన ఇసుక నాణ్యంగా ఉంది. దీనివల్ల ఎక్కువ మంది వినియోగదారులు ఆంధ్రా ఇసుకనే కొంటున్నారు.

పక్కా కమర్షియల్

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వ్యర్థాలను వాహనాల్లో ఇక్కడికి తీసుకొస్తారు. వాటిని కొన్న వ్యాపారులు తిరిగి భారీ లారీల్లో రీసైక్లింగ్ కేంద్రాలకు పంపుతారు. వ్యర్థాల కొనుగోళ్లు, రీసైక్లింగ్ యూనిట్లకు విక్రయించే క్రమంలో వ్యాపారులు జీఎస్టీ చెల్లించాలి. కానీ, వ్యాపారులు జీఎస్టీ చెల్లించట్లేదు. ఇన్వాయిస్‌లతో సంబంధం లేకుండా రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. దీన్ని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, ఉద్యోగులు ఓ ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. తనిఖీల పేరుతో అధికారులు నిత్యం ఆటోనగర్‌లోని వ్యర్థాల సేకరణ యూనిట్ల వద్ద తిష్ట వేస్తున్నారు. కొంతమంది అధికారులు అక్కడే కుర్చీలు వేసుకుని కూర్చుంటున్నారని వ్యాపారులు చెబుతున్నారు. మరికొంతమంది హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలపై చక్కర్లు కొడుతున్నారు. వ్యర్థాలతో వాహనం వచ్చినా, వెళ్లినా టక్కున వాలిపోతున్నారు.

ఒక్కో రేటు

ఇనుప వ్యర్థాలతో వచ్చే వాహనాలను తనిఖీ చేసి బిల్లులు లేకపోతే రూ.25 వేలు వసూలు చేస్తున్నారు. అదే ప్లాస్టిక్ వ్యర్థాల వాహనాలైతే రూ.5 వేలు తీసుకుంటున్నారు. ఈ యూనిట్ల నుంచి లారీల్లో టన్నుల సరుకు బయటకు వెళ్తే మాత్రం రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చేస్తున్న ఈ దందా దారుణంగా ఉంటోందని వ్యాపార వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకోసం వ్యర్థాలను తీసుకొచ్చే వారికి చేసే చెల్లింపుల్లో కోత విధిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖలోని సర్కిళ్లలో పని చేసే డ్రైవర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లను ఈ వసూళ్లకు ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు.

మాయాజలం

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టు సంస్థలతో సంప్రదింపుల మేరకు టెండర్ల నిబంధనల్లో మార్పులు చేస్తూ కోరియండం ఇస్తుంటారు. 30 లక్షల వాటర్ బాటిళ్ల సరఫరా టెండరుకు కేవలం 20 లక్షల సరఫరా సామర్థ్యం ఉన్న సంస్థనే నిర్దేశించారు. చివరి నిమిషంలో డెడ్‌లైన్‌ను పొడిగించింది. అనుకున్న సంస్థ కోసమే ఇలా చేసిందన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి టెండర్లలో బ్రాండెడ్ కంపెనీలైన టాటా, కిన్లే, బిస్లరీ వంటివి పాల్గొన్నా ఎవరికీ పెద్దగా తెలియని ఓ సంస్థకు అప్పగించారు.

పెద్ద సంస్థలను తప్పించటం కోసం..

పెద్ద సంస్థలను తప్పించటానికి కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు వాటర్ బాటిళ్ల పరిమాణాన్ని తగ్గించారు. ఈ ఏడాది 250 ఎంఎల్ బాటిళ్లను సరఫరా చేయాల్సిందిగా నిర్దేశించారు. మార్కెట్లోని బడా కంపెనీలన్నీ 300 ఎంఎల్, 500 ఎంఎల్, లీటర్, 2 లీటర్ల బాటిళ్లను సరఫరా చేస్తుంటాయి. 250 ఎంఎల్ బాటిళ్లు తక్కువగా కనిపిస్తుంటాయి.

జలప్రసాదం ముద్ర తొలగింపు

భక్తులకు ఇచ్చే వాటర్ బాటిళ్లపై గతంలో దుర్గమ్మ జలప్రసాదం పేరుతో అమ్మవారి ఫొటోను ముద్రించి అందించేవారు. మొదట టెండర్ పిలిచినపుడు ఇదే నిబంధన పెట్టారు. కాంట్రాక్టు సంస్థలతో సంప్రదింపుల పేరుతో ఆ పేరును తొలగించారు.

రాజకీయ ఒత్తిడి కూడా కారణమే..

ఒక కంపెనీ ప్రయోజనం కోసం బయట నుంచి రాజకీయ ఒత్తిళ్లు కూడా వచ్చాయని తెలుస్తోంది. ఇంజనీరింగ్ విభాగం అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఆ పనిచేశారన్న విమర్శలు వస్తున్నాయి. ఎంపిక చేసిన వెండార్‌కు అనుగుణంగా రాజకీయ శక్తులు గట్టిగా ఒత్తిడి తెచ్చినట్టు తెలుస్తోంది.



మంత్రి పయ్యావులకు దసరా ఆహ్వాన పత్రికను అందచేస్తున్న ఈవో

మంత్రి పయ్యావుల కేశవ్‌కు దసరా ఉత్సవ ఆహ్వానం

వన్‌టౌన్ : ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను గురువారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్, దేవస్థానం అర్చక బృందంతో పాటు కలిసి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

వంటశాల ఏర్పాట్ల పరిశీలన..

ఇంద్రకీలాద్రి : భక్తుల సౌకర్యార్థం ఇంద్రకీలాద్రి దిగువన నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, లడ్డు పోటులో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. దసరా ఉత్సవాలలో అన్నప్రసాద తయారీ కేంద్రం సిద్ధమవుతోంది. వాటర్ ట్యాప్‌లు, క్యూలు, వంటచేసే ప్రాంతం, బఫే విధానంలో భోజనం చేసేందుకు మార్కింగ్ తదితర అంశాలపై ఈవో శీనానాయక్ గురువారం దిశా నిర్దేశం చేశారు. వీరివెంట అన్నదానం ఏఈవో వెంకటరెడ్డి పెనుగంచిప్రోలు ఈఈ ఎల్.రమ ఉన్నారు. భక్తుల సౌలభ్యం కోసం ఉచితంగా అల్పాహారం, అన్న ప్రసాదం, ఉచిత ప్రసాదాలు, మూలా నక్షత్రం, విజయదశమి రోజుల్లో చిన్న లడ్డు పంపిణీకి అన్నిఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. భక్తులకు పంపిణీ చేయడానికి మంచినీటి బాటిళ్లను సిద్ధం చేశారు.

సబ్సిడీలు చెల్లించకుంటే వస్త్ర పరిశ్రమ మూతే

» ఏపీ టెక్స్‌టైల్స్ అసోసియేషన్

గుంటూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వస్త్ర పరిశ్రమ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నదని ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ నేతలు చెప్పారు. గురువారం గుంటూరులోని ఏపీ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ కార్యాలయంలో సంఘం ముఖ్యనేతలు సమావేశమయ్యారు. చైర్మన్ పి.కోటిరావు, వైస్‌చైర్మన్ సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం సబ్సిడీ బకాయిలు రూ.900 కోట్లు విడుదల చేయకుంటే మరికొన్ని నెలల్లోనే మిల్లులన్నీ శాశ్వతంగా మూతబడటం ఖాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

బావ మృతిని జీర్ణించుకోలేక .. ప్రాణాలు విడిచిన బావమరిది!

» ఒకే రోజు ఇరువురి మృతితో గ్రామంలో విషాదఛాయలు



ఆకుల గోపాలరావు



వేణుగోపాలరావు

గుణదల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ బావ, బావమరుదులు. వారిమధ్య అనుబంధాలు ఎంతగా పెనవేసుకున్నాయంటే.. బావ మృతిని జీర్ణించుకోలేక బావమరిది గంటల వ్యవధిలోనే తనువు చాలించాడు. ఈ ఘటన గుణదల ఊర్మిళానగర్లో ఆ ఇంట విషాదం నింపింది. వివరాలలోకి వెళితే.. కొద్దికాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఆకుల గోపాలరావు(65) ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ఉదయం మృతిచెందాడు. మృతదేహాన్ని ఇంటికి తెచ్చారు. బావ ఇంటికి చెంతనే నివాసం ఉంటున్న బావమరిది ఉప్పులూరి వేణుగోపాలరావు(54) విషయం తెలుసుకుని బావ మృతదేహానికి పూలదండ వేసి నివాళులు అర్పించాడు. దుఃఖాన్ని తట్టుకోలేక పక్కనే ఉన్న కుర్చీలో కుప్పకూలిపోయాడు. వేణుగోపాలరావును ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. ఒకే రోజు ఇరువురు మరణించడంతో ఊర్మిళానగర్లో విషాదఛాయలు అలముకున్నాయి.

చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ

(5వ పేజీ తరువాయి)

జరిగినపుడు విద్యార్థి నాయకుడిగా అక్కడే ఉన్నారు. ప్రస్తుతం ఆయన భవన నిర్మాణ రంగంలో ఉన్నారు. మరోపక్క పార్టీ ఇచ్చిన ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు సన్నిహితుడిగా రాధాకృష్ణకు గుర్తింపు ఉంది. రాధాకృష్ణకు అనుకూలంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఇద్దరు ఎంపీలు, ఇద్దరు మంత్రులు, 11 మంది ఎమ్మెల్యేలు లేఖలు ఇచ్చారు. దీంతో సౌమ్యుడిగా పేరు ఉన్న రాధాకృష్ణను ప్రభుత్వం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమించింది. కాగా, బొర్రా రాధాకృష్ణ గురునానక్ కాలనీలో ఎంపీ కేశినేని చిన్నిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

చకచకా..

(5వ పేజీ తరువాయి)

చర్యలు చేపట్టనున్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి అందులో నుంచి ప్రతి దృశ్యాన్ని నునితంగా పరిశీలిస్తారు. ప్రత్యేకంగా పోలీస్ పోస్టు పెట్టి దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు కట్టడి చేస్తారు. వైద్య సేవల కోసం హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ పోస్టును పెడుతున్నారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా ప్రత్యేకమైన పవర్ హౌస్‌ను సిద్ధం చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133,142, 153
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

రీబోరింగ్ వర్కర్లకు స్థలాలు మంజూరు చేయాలి: దుర్గాప్రసాద్

ఆటోనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లో రీబోరింగ్ పనులు చేసే వర్కర్లకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని జవహర్ ఆటోనగర్ ఐలా మాజీ ఛైర్మన్, రీబోరింగ్ వర్క్‌షాప్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సుంకర దుర్గాప్రసాద్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం రాత్రి ఆటోనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షుడిగా బొప్పవరపు రాంబాబు, కార్యదర్శిగా నంద్యాల నాగేశ్వరరావు, కోశాధికారిగా కాండ్రు శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. కార్యక్రమంలో పులి అర్జునరావు, కోటేశ్వరరావు, వెనిగళ్ల వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'వాహనమిత్ర'కు అనూహ్య స్పందన

● దరఖాస్తుదారులతో సచివాలయాలు కిటకిట ● దరఖాస్తుకు నేటితో ఆఖరు

రాణిగారితోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఫైనాన్షియల్ అసిస్టెంట్ టూ సెల్ఫ్ ఓన్డ్ ఆటో, టాక్సీ మాక్సీ క్యాబ్ డ్రైవర్స్ పథకానికి లబ్ధిదారుల నుంచి అనూహ్య స్పందన వస్తుంది. ఈ పథకం కోసం అర్హత కలిగిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి వార్డు సచివాలయాలకు క్యూ కట్టారు. ఈ పథకంలో లబ్ధి పొందడానికి ఆఖరు తేది ఈ నెల 19వ తేది కావడంతో దరఖాస్తు దారులతో సచివాలయాలు కిటకిటలాడుతున్నాయి. గత ప్రభుత్వం వాహనమిత్ర పేరుతో టాక్సీ వాహన యజమానులకు సంవత్సరానికి రూ.10వేలు అందజేసింది. అయితే కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో టాక్సీ వాహనాలు ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ఉచిత బస్సు కారణంగా తమకు ఆర్థిక ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో వ ం ం ఖ్య వ ం ం త్రి చంద్రబాబు వీరి ఆవేదన అర్థం చేసుకుని ఆదు కుంటానని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా రూ.15వేలు ఆర్థిక భరోసా అందించే విధంగా పథకాన్ని అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా గత ప్రభుత్వం లబ్ధిపొందిన వారితో పాటు కొత్తగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది, దీంతో టాక్సీ, మ్యాక్సీ క్యాబ్, ఆటో యజమానులు తమ దరఖాస్తులు అందజేస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ పథకం కింద అర్హులైన వారి బ్యాంక్ అకౌంట్లలో ఈ మొత్తాన్ని ప్రభుత్వం జమ చేయనుంది.



రాణిగారితోటలోని ఒక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవడానికి వేచి ఉన్న వాహనదారులు

గడువు పెంచేనా: ట్యాక్సీ వాహన యజమానులకు ప్రభుత్వం అందజేస్తున్న రూ.15వేలు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకునే వారికి శుక్రవారం(ఈ నెల 19) ఆఖరు కావడంతో సమయం పెంచాలని డ్రైవర్లు కోరుతున్నారు. దరఖాస్తు చేసుకునే వారిలో కొందరికి అవసరమైన పత్రాలు అందుబాటులోకి లేకపోవడంతో సమయం పెంచాలని కోరుతున్నారు. ముఖ్యంగా యజమాని, డ్రైవర్ ఒకే కుటుంబ సభ్యులుగా ఉండాలనే నిబంధన ఉండడంతో కొందరు దరఖాస్తులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చాలా సంతోషంగా ఉంది



ఆటో డ్రైవర్ గా మొదటిసారి పథకం కోసం దరఖాస్తు చేసుకుంటున్నాను. ట్యాక్సీ వాహనదారులకు ఆర్థిక భరోసా కింద రూ.15వేలు అందజేయడం చాలా సంతోషంగా ఉంది. -నారాయణ రెడ్డి

సిద్ధార్థ మహిళా కళాశాలలో యువ అర్థ 2025 ఎగ్జిబిషన్

లబ్బీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్థాపించి 50 సంవత్సరాల సందర్భంగా సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం కళాశాల వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో యువ అర్థ 2025 ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో వాణిజ్య, మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన 50 మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషనల్ అకడమిక్ అడ్వైజర్ ఎల్‌కే మోహనరావు ఎగ్జిబిషన్‌లో మోడల్స్‌ను తిలకించారు. ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించడానికి పలు కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ మోడల్స్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ వి.వి సుబ్రహ్మణ్య కుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆటోనగర్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జవహర్ ఆటోనగర్‌లో భారీ బైక్ ర్యాలీ

ఉత్సవం విజయవంతం చేయాలని కోరుతూ

ఆటోనగర్‌లో బైక్ ర్యాలీ

ఆటోనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవం విజయవంతం చేయాలని కోరుతూ గురువారం సాయంత్రం జవహర్ ఆటోనగర్‌లో భారీ బైక్ ర్యాలీ జరిగింది. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సంస్థ, ఆటోనగర్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆటోనగర్ ఆర్టీసీ టెర్మినల్ వంద అడుగుల రోడ్డు నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ డిస్పోజల్ రోడ్డు, టైర్ మార్కెట్ రోడ్డు, పంటకాలువ రోడ్డు, సాయి హోటల్ సెంటర్ మీదుగా ఆటోనగర్ మొత్తం సాగింది. ప్రతి సెంటర్‌లో యువకులు ఫ్లాష్ మాబ్ నిర్వహించి సందడి చేశారు. . కార్యక్రమంలో ఐలా సర్వీస్ సొసైటీ మాజీ ఛైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ఆర్ కేంద్రం ఏర్పాటు చేయాలి

కమిషనర్ ధ్యానచంద్ర



కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛోత్సవ, స్వచ్ఛత ఈ సేవ-2025లో భాగంగా ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీ యూస్, రీసైకిల్) ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాఘవయ్య పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. 64 డివిజన్లలో 64 ఆర్ఆర్ఆర్ సెంటర్లు ఉన్నాయని, అలాగే 9 ప్రత్యేక ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ఆర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రజలు ఆర్ఆర్ఆర్ కేంద్రం వద్దకు వచ్చి, వారికి అవసరం లేని స్టీల్ పాత్రలు, వస్త్రాలు, పుస్తకాలు, కాగితాలు, చెప్పులు, షూలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతరత్రా సామాగ్రిని అందించాలని కోరారు. వాటి ద్వారా వ్యర్థాలను రెడ్యూస్ అంటే తగ్గించడం, రీయూస్ అంటే మళ్లీ వాడటం, రీసైకిల్ అంటే పునరుద్ధరించే చర్యలు అధికారులు తీసుకుంటారన్నారు. పార్కు వద్ద ప్రజలు అందిస్తున్న పుస్తకాలను చూసి వారిని ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు అభినందించారు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలు జీవన మార్గాలు

ఐలూ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్ర ప్రసాద్

మొగల్రాజపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశ భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు జీవన మార్గాలని, వాటి గురించి నేటి యువత తెలుసుకుని పాటించాలని ఐలూ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. మాకినేని బసవపున్నయ్య భవన్, సేఫ్, తరుణీ తరంగాలు, భారత మహిళా మండలి, జనశిక్షణా సంస్థాన్, ఫోర్ ఫర్ ఆర్టిస్టు, స్నేహాప్తి ఆర్గనైజేషన్, ఇన్నర్ వీల్ (మిడ్‌టౌన్)సన్‌షైన్, వన్‌ఎర్త్ వన్ లైఫ్, నిర్భయ మహిళా మండలి వంటి సంస్థలు ఒక నిర్వహణా కమిటీగా ఏర్పడి దసరా సాంస్కృతికోత్సవాలు నిర్వహిస్తున్నాయి. మొదటి రోజు గురువారం వీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో హింసారహిత సమాజం - పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దసరా పండగకు విజయవాడ నగరానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. చెడును అంతం చేసే అమ్మవారి ప్రాశస్త్యం దసరా ప్రత్యేకత అని చెప్పారు. ప్రముఖ రచయిత్రి వి. సత్యవతి మాట్లాడుతూ దసరా సాంస్కృతికోత్సవాలలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం యువతకు, మహిళలకు ఇవ్వడం అభినందనీయం అన్నారు. మహిళలు సూపర్ సీనియర్స్‌గా, విద్యార్థినులు సీనియర్స్‌గా నిర్వహించిన ఈ పోటీల్లో 1100 మంది పాల్గొన్నారు. మొదటి రోజు కోలాటం, వీధి నాటిక, బొమ్మల కొలువు, దాండియా, ఓనం, డప్పుల నృత్యం తదితర పోటీలు నిర్వహించారు. రెండో రోజు పోటీలు శుక్రవారం ఎంబీవీకే భవన్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల కన్వీనర్ కె. స్వరూప రాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్

చీటింగ్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

విజయవాడ లీగల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చీటింగ్ కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో ఏడాది జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ నాలుగవ అదనపు చీఫ్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ యు.రామ్మోహన్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పటమట పోలీసు స్టేషన్ పరిధిలోని సుస్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పోరంకికి చెందిన మల్లెపూడి గోపి పనిచేస్తున్నాడు. ఇతడు కంపెనీ ప్రోడక్ట్‌లను షాపులో ఇచ్చి వారి వద్ద నుంచి నగదు తీసుకొని కంపెనీకి కట్టేవాడు. ఈ క్రమంలో షాప్‌ల యజమానులకు చెందిన క్రెడిట్ పెండింగ్ వుందని అడిగిన సమయంలో వారు గోపికి కట్టినట్లు తెలిపారు. అయితే గోపి కంపెనీకి 2016 నుంచి కట్టలేదు. ఆ డబ్బును తన స్వంతానికి జల్సాలకు వాడుకున్నాడు. దీనిపై గోపిని కంపెనీ నిర్వాహకులు వివరణ అడుగగా కంపెనీ ప్రతినిధులపై ఎస్సీ, ఎస్టీ కులం పేరుతో ఫిర్యాదు చేసి వారి అంతు చూస్తానని బెదిరించినట్లుగా వచ్చిన ఫిర్యాదుపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మర్యాదపూర్వక కలయిక

వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రిబ్కో (క్రిషక్ భారతి కోఆపరేటివ్ లిమిటెడ్) నూతన ఛైర్మన్‌గా ఎంపికైన తెలుగు వ్యాపారవేత్త వల్లభనేని సుధాకర్ చౌదరి గురువారం గురునానక్ కాలనీలో విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వల్లభనేని సుధాకర్ చౌదరికి ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. సహకార రంగంలో రెండో అతి పెద్ద ఎరువుల కంపెనీ అయిన క్రిషక్ భారతి కో ఆపరేటివ్ లిమిటెడ్ ఛైర్మన్‌గా ఎరువులు, వ్యవసాయ రంగాలను బలోపేతం చేయడంలో కృషి చేయాలని సుధాకర్ చౌదరికి ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

'బొబ్బా'కు ఘన నివాళులు

కృష్ణలంక, ఆంధ్రజ్యోతి: టీడీపీ నాయకుడు బొబ్బా వాసుదేవ చౌదరి 53వ జయంతిని కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్‌లో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావులు బొబ్బా చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు వల్లభనేని శ్రీనివాస్, ఆన్నే రమణ, తుమ్మల శ్రీకాంత్, పాల్గొన్నారు.

రాకింగ్ రోబోస్..!



- సిద్ధార్థ వర్సిటీలో జాతీయ రోబోటిక్స్ పోటీలు ● ఇన్నోవేట్, ఆటోమేట్, డామినేట్ అంశాల్లో ఆరు విభాగాల్లో రోబోలతో ప్రదర్శన
- దేశంలోని పలు కళాశాలల నుంచి 400 మంది విద్యార్థుల హాజరు ● ఆరు థీమ్స్‌లో 66 జట్లు పోటీ ● ఆధునికతను ప్రతిబింబించేలా విన్యాసాలు

కానూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో రోబోటిక్స్ టెక్నాలజీ వినియోగించి రోబోలను తయారుచేసి వివిధ రకాలుగా సమాజ శ్రేయస్సుకు ఎలా వినియోగించవచ్చో నిరూపించారు ఇంజనీరింగ్ మెకానికల్ విభాగం విద్యార్థులు. దేశంలోని పలు ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థులు తరలివచ్చి కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో రోబో ఎక్స్-2025 పేరుతో నిర్వహించిన పోటీల్లో సుమారు 400 మంది విద్యార్థులు పాలుపంచుకున్నారు. గురువారం ప్రారంభమైన ఈపోటీలు శుక్రవారం వరకు కొనసాగుతాయి.



ఆరు అంశాల్లో రోబో పోటీలు

సిద్ధార్థ వర్సిటీలో జరిగిన రోబో ఎక్స్ పోటీలు ఆరు అంశాల్లో సాగాయి. ఈ అంశాలన్నీ రోబోలు వివిధ రంగాల్లో ఎలా ఉపయోగకారిగా పనిచేస్తాయో చేప్పేలా విద్యార్థులు తమ ప్రదర్శనలతో నిరూపించారు. రోబో యుద్ధం అనే అంశంపై జరిగిన పోటీలో యుద్ధంలో శత్రువుల నుంచి రోబో సాయంతో తమను ఎలా కాపాడుకోవచ్చో విద్యార్థులు స్పష్టంగా వివరించారు. సెల్‌ఫోన్ బ్లూటూత్ ఆధారంగా ట్యాంక్ టైపులో ఉన్న యుద్ధ రోబోను ప్రదర్శించారు. పాత్‌ఫైండర్ చాలెంజ్ అనే అంశంపై డ్రైవర్ లేకుండా ఆటోమేటిక్ పద్ధతిలో వాహనం దారితప్పకుండా ఎలా నడపవచ్చో తమ ప్రదర్శనతో నిరూపించారు. ప్రెసిషన్ పిక్ అండ్ ప్లేస్ అనే అంశంపై ఒక ప్రదేశం నుంచి వస్తువులను మరో ప్రదేశానికి సమయపాలనకు అనుగుణంగా ఖచ్చితంగా చేర్చడానికి దోహదపడేలా రోబో సాయంతో ప్రదర్శించారు. అగ్రిబోట్ చాలెంజ్ పేరుతో వ్యవసాయ రంగంలో రోబోను వినియోగించి మనుషులు వచ్చే జాడ, గ్యాస్ వాసన తదితర అంశాలను ఎలా గ్రహించవచ్చో నిరూపించారు. మిషన్ రెస్క్యూ రోబో విధానంలో విపత్తుల్లో మనుషులను ఎలా కాపాడాలి, వారికి ఆహారం, మందులు, నీరు, లైఫ్ జాకెట్లు రోబో సహాయంతో ఎలా అందించగలమో విద్యార్థులు వివరించారు. ఇండస్ట్రీ 4.0 ఛాలెంజ్ అంశంట పరిశ్రమల్లో మనుషుల సంఖ్య తగ్గించి రోబోలను వినియోగించి తక్కువ ఖర్చుతో, సమయాన్ని ఎలా ఆదా చేయవచ్చో వారు వివరించారు. ఈ రోబోటిక్స్ ప్రదర్శనగురించి విద్యార్థులు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

పరిశ్రమల భవిష్యత్ రూపకల్పనలో

రోబోటిక్స్ పాత్ర కీలకం

- రోబో ఎక్స్ ప్రారంభోత్సవంలో డాక్టర్ కృష్ణ దొర

పరిశ్రమల భవిష్యత్ రూపకల్పనలో రోబోటిక్స్, ఏఐ, స్మార్ట్ ఆటోమిషన్ పాత్ర ఎంతో కీలకమని వాల్టినో సిస్టమ్స్ (హైదరాబాద్)వ్యవస్థాపకుడు, ఎండీ కృష్ణ దొర అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో రెండు రోజుల పాటు రోబో ఎక్స్-2025 పేరుతో జరిగే జాతీయ రోబోటిక్స్ విద్యార్థి పోటీలను గురువారం ఆయన జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కృష్ణ దొర ప్రసంగిస్తూ సమాజాభివృద్ధికి స్థిరమైన పరిష్కారాలు చూపే యువ ఇంజనీర్లను ప్రోత్సహించాలన్నారు. వీసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలకు రూ. 2లక్షలు పైగా బహుమతులు అందజేస్తామన్నారు. ప్రొ. వీ సీ ఏవీ రత్నప్రసాద్, వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎన్ రవికుమార్, కన్వీనర్ డాక్టర్ జీ ఢిల్లీబాబు, వర్సిటీ రిజిస్ట్రార్ ఎం రవిచంద్, ఎస్‌ఏజీటీఈ అధ్యక్ష, కార్యదర్శులు ఏ రాజయ్య, పీ లక్ష్మణరావు, డాక్టర్ డీ పాండురంగారావు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.



విద్యార్థుల పాత్ర కీలకం



విజయవాడలో రోబో ఎక్స్ పేరుతో సిద్ధార్థ వర్సిటీలో నిర్వహిస్తున్న రోబో ఎక్స్ పోటీలో విద్యార్థుల పాత్ర కీలకం. పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది.

డాక్టర్ ఎస్ రవికుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి, సిద్ధార్థ వర్సిటీ

పోటీతత్వాన్ని పెంచింది



రోబో ఎక్స్ పేరుతో నిర్వహించిన జాతీయ రోబోటిక్స్ పోటీలు పోటీతత్వాన్ని పెంచాయి. రోబో యుద్ధం అంశంపై జరిగిన ప్రదర్శన ప్రత్యర్థి యంత్రాన్ని నిలిపివేయడం, అధిగగమించడం ఎలా సాధ్యమో కళ్లకు కట్టినట్టు ఉంది.

ఎస్ జ్యోతిర్మయి, విద్యార్థిని, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, మైలవరం

ఆకట్టుకున్న సాంకేతికత



జాతీయ ప్రదర్శనలో రోబోటిక్స్ సాంకేతికత ఎంతగానో ఆకట్టుకుంది. డ్రైవర్ లేకుండా సాంకేతిక సాయంతో కారులు, తదితర వాటిని ఎలా నడపవచ్చో ఈ ప్రదర్శనలో ఉంచడం ఆసక్తిరేపింది.

కే దేవీశ్రీ, విద్యార్థి, వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, విజయవాడ

రోబో టెక్నాలజీపై అవగాహన పెరిగింది



జాతీయ రోబో ఎక్స్ ప్రదర్శనతో రోబో టెక్నాలజీపై అవగాహన పెరిగింది. ప్రస్తుతం రోబోల పాత్ర, ఉపయోగాలు, వినియోగించే విధానాన్ని ప్రదర్శన రూపంలో తెలుసుకోగలిగాం. ఇవి భవిష్యత్ ప్రయోగాల్లో దోహదపడతాయి.

జీ జ్ఞానదీప్, విద్యార్థి, వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, విజయవాడ

అసెంబ్లీ వాయిస్

రెండు మండలాలను విజయవాడలో కలపాలి

- అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాగునీరు, చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గన్నవరం, విజయవాడ రూరల్ మండలాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ప్రారంభమైన శాసనసభ వర్షాకాల సమావేశాల్లో యార్లగడ్డ ప లు సమస్యలు ప్రస్తావించారు. ప్రకాశం బ్యారేజీకి కూతవేటు దూరం లో విజయవాడ రూరల్ మండలంలోని 9 గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంబాపురంలో రూ.2500 కోట్లతో చేపట్టిన పథకం వల్ల ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. ప్రత్యామ్నాయంగా కరెన్సీ నగర్ వరకు ఉన్న తాగునీటి పైపులైనును ముందుకు పొడిగిస్తే తక్కువ ఖర్చుతో కృష్ణా నీటిని అందించవచ్చన్నారు. అలాగే చెత్త సమస్య పరిష్కారానికి ఈ 9 గ్రామాలను, గన్నవరం మండలాన్ని వీఎంసీలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న పీఏసీఎస్ కార్యదర్శులను బదిలీ చే యాలని గత అసెంబ్లీ సమావేశాల్లో కోరితే స్పందించలేదన్నారు. విజయ డెయిరీ బాపులపాడు మండలంలో నిర్మించిన కామధేను ప్లాంట్లో జరిగిన అక్రమాలకు ఆధారాలను ప్రభుత్వానికి అందజేసి విచారణ కోరితే జరగలేదని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

బుడమేరు కట్ట అభివృద్ధి చేయాలి

- పెనమలూరు ఎమ్మెల్యే బోడె



కంకిపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది బుడమేరు కట్టలు తెగి విజయవాడతో పాటు దిగువనున్న పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలంలోని వేల్పూరు, ఉప్పలూరు, మంతెన గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపించిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం జరిగిన శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రి రామానాయుడు కృషి చేసి కాంక్రీట్ వాల్స్ ఏర్పాటు చేశారన్నారు. అయితే దిగువున బుడమేరు అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టలేదని, అనేకమార్లు వారి దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదన్నారు. రూ.5లక్షల సొంత నిధులతో వేల్పూరులోని బుడమేరు కట్ట తాత్కాలికంగా అభివృద్ధి చేశామన్నారు. స్పీకర్ ద్వారా మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకువెళ్తున్నామని తెలిపారు.

తగ్గిన జీఎస్టీతో యువతకు ఉపాధి



- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి

తిరువూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై భారం తగ్గించే ఏ నిర్ణయమైనా సమాజం హర్షిస్తుందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజన్ 2047 ప్రకారం, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అయ్యేనాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దేశం మొదటి రెండు స్థానాల్లో ఉంటుందని, గణాంకాలతో సహా సీఎం అనేక సందర్భాల్లో తెలిపారన్నారు. యువగళం పాదయాత్ర లో యువనేత నారా లోకేశ్ ఇచ్చిన ప్రధాన హామీ, 20 లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలని, ఆ హామీ జీఎస్టీ తగ్గించడం వలన నెరవేరుతుందనే నమ్మకం ఏర్పడిందన్నారు. ధరలు అందుబాటులో ఉండి ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగితే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

పారిశ్రామికీకరణకు విఘాతం

- మైలవరం ఎమ్మెల్యే వసంత



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది వచ్చిన ఇంటిగ్రేటెడ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో రియల్ టైమ్ అనే నిబంధనలతో పారిశ్రామికీకరణకు విఘాతం కలుగుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో అన్నారు. సంప్రదాయేతర విద్యుత్ వనరులు సోలార్, విండ్ పవర్ నుంచి ఏ 15 నిముషాల్లో ఉత్పత్తయిన విద్యుత్‌ను అదే 15 నిముషాల్లో సద్వినియోగం చేసుకోవాలని చెప్పారని, మరి సోలార్ సూర్యరశ్మిపై, విండ్ పవర్ వాయువుపై ఆధారపడి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా, అదే సమయంలో విద్యుత్‌ను ఉపయోగించుకోవడం అసాధ్యమన్నారు. ఈనిబంధనతో పరిశ్రమలకు ప్రయోజనం లేదన్నారు. ప్రభుత్వం ఆ పాలసీని సవరించాలన్నారు.

టూరిజం హోటళ్లు, ఆస్తుల ప్రైవేటీకరణ తగదు: రామకృష్ణ

ధర్నాచౌక్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం సంస్థ ప్రైవేటీకరణకు చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపాదించిన 22 హోటళ్లు, ఆస్తుల ప్రైవేటీకరణకు తెచ్చిన జీవో 23ను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావుల రవీంద్రనాథ్, టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర నేతలు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్రంలో జనగణనలో కులగణన పూర్తి చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఆయా కులాలవారికి సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు కులగణన వల్లే సాధ్యమవుతుందన్నారు.

లేజర్ రన్ విజేతలకు శాప్ చైర్మన్ అభినందన

లబ్బీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4 నుంచి 8 వరకు బిహార్‌లో జరిగిన మోడ్రన్ పెంటాథలైన్ లేజర్ రన్ జాతీయ స్థాయి పోటీలలో పథకాలు సాధించిన క్రీడాకారులను శాప్ చైర్మన్ రవినాయుడు అభినందించారు. ఐజీఎం స్టేడియంలో గురువారం క్రీడాకారులు శాప్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేజర్ రన్ క్రీడల్లో డిసెంబర్‌లో సౌత్ ఆఫ్రికాలో జరిగే పోటీల్లో దేశం తరపున పాల్గొనే రాష్ట్ర క్రీడాకారులకు సహకారం అందిస్తామన్నారు. ఎంపీఎఫ్ఐ లెవల్ 1 కోచ్ కే కృష్ణ, అధ్యక్షులు కె.హరిబాబు, సాఫ్ట్‌బాల్ ఏపీ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత పి.షణ్ముగం, చిత్తూరు జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు చందు, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు. గత నెల 25న కోస్టారికా రాజధాని శాంన్ జోస్‌లో జరిగిన వరల్డ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 57 కేజీల విభాగంలో భారత్ తరపున తలపడి బ్రాంజ్ మెడల్ సాధించిన మంగళగిరికి చెందిన షేక్ సాదియా ఆల్మస్‌ను శాప్ చైర్మన్ అభినందించారు.

ప్రపంచస్థాయి మౌలిక వసతులతో అమరావతి

- సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

విజయవాడ సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ప్రభుత్వ సదుపాయాలు, సమగ్ర మౌలిక వసతులతో గ్లోబల్ ప్రమాణాలకు తగినట్టు అమరావతి ప్రపంచ స్థాయి రాజధానిగా నిలుస్తుందని సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు అన్నారు. 11వ అమరావతి ప్రాపర్టీ ఫెస్టివల్‌లో భాగంగా విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన అమరావతి ప్రభుత్వ సముదాయాల సూక్ష్మ నమూనాలను గురువారం ఆయన సందర్శించి మీడియాతో మాట్లాడారు. శాసనసభ, 50 అంతస్తుల సచివాలయం, హెచ్‌వోడీ టవర్స్, జేఏడీ కాంప్లెక్స్, మెట్రోలైన్ తదితర కీలక వసతులను అమరావతిలో కల్పిస్తుందన్నారు. పచ్చని వనరులు, సమగ్ర రవాణా మార్గాలు, డిజిటల్ సదుపాయాలు సమన్వయం కావడంతో స్థిరమైన అభివృద్ధికి ఆదర్శనగరంగా రూపుదిద్దుకుంటుందన్నారు. కృష్ణానదికి భారీగా వరద వచ్చినా అమరావతి ముంపునకు గురయ్యే అవకాశం లేదన్నారు. భవిష్యత్తులో అక్కడ నివాసం ఉండబోయే ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేలా ప్రణాళిక చేశామన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ ఆదేశాలతో భవన నిర్మాణ పనులు శరవేగంతో సాగుతున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు నడిచి వెళ్లేలా, సైకిల్‌పై వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్తు తరాల మనుగడను దృష్టిలో ఉంచుకుని అమరావతిని అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. నారెడ్కో అధ్యక్షుడు గద్దె చక్రధర్ మాట్లాడుతూ అమరావతిపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఈ ప్రాపర్టీ షో అద్దం పడుతుందన్నారు. ఈ నెల 19, 20, 21న ఏ కన్వెన్షన్‌లో జరిగే ప్రాపర్టీ షో లో డెవలపర్లు, కొనుగోలుదారులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. నారెడ్కో సెంట్రల్ జోన్ అధ్యక్షుడు మండవ సందీప్, ప్రాపర్టీ షో చైర్మన్ పరుచూరి కిరణ్, నారెడ్కో సెంట్రల్ జోన్ కార్యదర్శి ఎస్వీ రమణ, ప్రతినిధులు వీవీ కృష్ణ, వంశీ, కోడే జగన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.



ప్రాపర్టీ షోలో అమరావతి నమూనా చూస్తున్న కన్నబాబు

కోట్లు ఖర్చుపెట్టినా నిరుపయోగమే?

ఇరువైపులా అప్రోచ్ రోడ్లు లేక అక్కరకు రాని వైరాయేటిపై నిర్మించిన వంతెన

- వరదలకు దెబ్బతిన్న కాజ్‌వే
- వాహనాల రాకపోకలు పూర్తిగా బంద్
- 2 నెలలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి - కంచికచర్ల: మండలంలోని చెవిటికల్లు - వత్సవాయి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో నందిగామ మండలం దాములూరు కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామాల మధ్య వైరాయేటిపై రూ. 7 కోట్లతో నిర్మించిన వంతెన 8 ఏళ్లుగా నిరుపయోగంగా పడి ఉంది. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్లు వేయకపోవడంతో వంతెన ఉపయోగపడటం లేదు. వరదలకు లోలెవల్ కాజ్‌వే దెబ్బతింది. 2 నెలలుగా ఈ మార్గంలో రాకపోకలు సాగటం లేదు. కూడలి వంతెన ఎగువన కొద్దిదూరంలో వైరాయేటిలో కట్లేరు కలుస్తుంది. వాహనాల రాకపోకలకు దశాబ్దాల క్రితం ఈ యేటిలో లోలెవల్ కాజ్‌వే ఏర్పాటు చేశారు. అయితే వైరా లేదా కట్లేరుకు వరద వచ్చినప్పుడల్లా కాజ్‌వే పూర్తిగా మునిగిపోతోంది. వర్షాకాలంలో వాహనాల రాకపోకలు బంద్ అవుతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. 200 మీటర్ల పొడవున్న వంతెన నిర్మించారు. అప్రోచ్ రోడ్లు వేయలేదు. దీందీ అప్పటి నుంచి వంతెన నిరుపయోగంగా పడి ఉంది. ఇక కాజ్‌వేనే దిక్కైంది. అయితే ఈ ఏడాది రోజుల తరబడి భారీ వర్షాలు పడుతుండటంతో వైరాయేరు, కట్లేరులకు వరద ఎక్కువగా వస్తోంది. కాజ్‌వేపై ఆరేడు అడుగుల ఎత్తున వరద పొంగుతోంది. వరదల ఉధృతికి కాజ్‌వే కూడా దెబ్బతింది. ఈ మార్గంలో 2 నెలల నుంచి వాహనాల రాకపోకలు బంద్ కావటంతో సుమారుగా 40 గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ పాలకుల్లో స్పందన కరువైంది.





అప్రోచ్ లేనందున నిరుపయోగంగా ఉన్న కూడలి వంతెన, వరదలకు దెబ్బతిన్న కాజ్‌వే

వేగా లక్కీడ్రా విజేతలు వీరే..

వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢం సందర్భంగా విజయవాడలోని వేగా జ్యువెలర్స్ నిర్వహించిన లక్కీడీప్‌లో గెలుపొందిన విజేతల పేర్లను గురువారం ప్రకటించారు. విజయవాడ షోరూమ్‌లో నిర్వహించిన లక్కీ డ్రాలో గెలుపొందిన ఐదుగురు విజేతలకు ఒక్కొక్కరికి రూ.2లక్షల విలువైన బంగారు, డైమండ్ నక్లెస్‌లను అందజేశారు. నరసరావుపేటకు చెందిన నసీమబేగం, విజయవాడకు చెందిన కొల్ల బాలకృష్ణ, విజయకుమారి బెల్లంకొండ, లక్ష్మీ తిరువీధుల, గుంటుపల్లికి చెందిన హరిబాబు నల్లాకు బహుమతులు అందజేశారు. వేగా జ్యువెలర్స్ సంస్థ చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, ఎండీ నవీన్ వనమాలు మాట్లాడుతూ తమ సంస్థ అనేక ఆకర్షణీయమైన ఆఫర్లను తీసుకువస్తుందన్నారు. వినియోగదారులు కొనుగోలు సమయంలో కూపన్లు అందజేసి, గడవు ముగిశాక లక్కీడ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్టు తెలిపారు. ఆధునిక డిజైన్లతో ఆకర్షణీయంగా, నాణ్యతాప్రమాణాల్లో రాజీ లేకుండా ఆభరణాలు తయారు చేస్తున్నట్టు తెలిపారు. మహిళల అభిరుచులను గుర్తించి నగల రూపకల్పన చేస్తున్నట్టు తెలిపారు. విజేతలు తమ సంతోషాన్ని వ్యక్తం చేయగా, వారిని చైర్మన్, ఎండీ అభినందించారు.



ఎంపీ కేశినేనికి వినతి

బూడిద టెండర్ రద్దు చేయించాలని, ఉచితంగా తమకు బూడిద లోడింగ్ చేయించాలని ఉద్యమం చేస్తున్న డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ నేతలు, సభ్యులు గురువారం రాత్రి నగరంలో ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ఎంపీ సమస్యను మంత్రికి, జెన్కో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

\- ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం

ఆలయ భూముల్లో

మట్టి అక్రమ తవ్వకాలపై విచారణ

గోసవీడు (గంపలగూడెం) సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయాల భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలపై దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నటరాజన్ షణ్ముగం గురువారం విచారణ నిర్వహించారు. మండలంలోని గోసవీడు గ్రామంలో మదనవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన ఆర్ఎస్ నెంబర్ 68లో 4.30 ఎకరాల భూమి ఉంది. 2012లో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన వైసీపీ నేత సానికొమ్ము రాజగోపాల్‌రెడ్డి ఆ భూమిలో ఆరడుగులు మేర మట్టిని అక్రమంగా తవ్వినట్టు అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత గోగిరెడ్డి పాపిరెడ్డి అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. నాటి నుంచి 2023 వరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గోగిరెడ్డి పాపిరెడ్డి 2023లో ఇదే అంశంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు. గతంలో ఆలయాలను పర్యవేక్షిస్తున్న జన్ను వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ ఫిర్యాదును ఆలస్యంగా చేశారనే నెపంతో పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదు. మట్టి అక్రమ తొలగింపుపై లోకయుక్త కోర్టు విచారణ చేసి నివేదిక ఇవ్వాలని దేవదాయ శాఖ అధికారుల్ని, ఉన్నాతాధికారుల్ని ఆదేశించడంతో, దేవదాయశాఖ అధికారి నటరాజన్ షణ్ముగం, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు అనురాధ, దారాసింగ్, పామర్రు ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు మట్టి తరలించిన దేవదాయ భూమిని పరిశీలించారు. అధికారుల విచారణలో 2012 నుంచి నేటి వరకు 4.30 ఎకరాల్లో మట్టి తరలింపు కారణంగా, ఆ భూమిని ఎవరూ కౌలుకు తీసుకోకవపోవడంతో ఆలయానిక రూ.5లక్షల నష్టం వచ్చిందని అధికారులు తెలిపారు. రూ.5లక్షల లోపు ఆదాయం వచ్చే ఆలయాలకు 2023 నుంచి చైర్మన్ల నియామకం జరపడం లేదని, మట్టిని అక్రమంగా తరలించిన భూమిని వనమ పిచ్చమ్మ మదనవేణుగోపాలస్వామి ఆలయానికి విరాళంగా అందించినట్లు తెలిపారు. ఫిర్యాదుదారుడు గోపిరెడ్డి పాపిరెడ్డి, అర్చకుడి నుంచి మట్టి తరలింపుపై స్టేట్‌మెంట్ తీసుకున్నారు. తాము చేసిన విచారణ నివేదికను లోకాయుక్త కోర్టుకు అందిస్తామని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.



ఆలయ భూముల్లో మట్టితోలకాలు పరిశీలిస్తున్న అధికారులు

నగర ప్రాచుర్యం, కళలు పరిచయం చేసేందుకే

'విజయవాడ ఉత్సవ్' నిర్వహణ

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరిగే దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు విజయవాడ ప్రాచుర్యం, కళలను పరిచయం చేసేందుకే 'విజయవాడ ఉత్సవ్' నిర్వహిస్తున్నట్టు విజయవాడ ఉత్సవ్ సభ్యుడు, ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. వ్యాపారస్తులందరూ విద్యుత్ దీపాలంకరణతో విజయవాడ ఉత్సవ్‌లో భాగస్వామ్యం కావాలని కోరుతూ గురువారం రాత్రి వన్‌టౌన్ అర్జున వీధిలోని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తన నివాసానికి ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకారం ప్రారంభానికి ఎంపీ కేశినేని చిన్ని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రిమోట్‌తో విద్యుత్ దీపాలంకరణను వెలిగించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్‌లో నగర ప్రజలంతా భాగస్వాములై అమ్మవారి భక్తులకు వినోద ప్రదర్శనలు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా నగరం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించనున్నట్టు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లను, షాపులను విద్యుత్ దీపాలతో అలంకరించుకోవాలని కోరారు. ఆలీబాబా 40 దొంగల్లా జగన్ బాబా డజన్ దొంగలు తయారయ్యారని, వారంతా ఒకచోట చేరి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఆహ్లాదపరిచేందుకు విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవ్‌లో భాగస్వామ్యం కావాల్సిన వైసీపీ నేతలు వివాదంగా మారుస్తున్నారని, పేర్ని నాని కోర్టులను కూడా విమర్శిస్తున్నారన్నారు. నాడు కోర్టు స్టే ఇస్తే సంబరాలు చేసుకోవచ్చు కానీ, విజయవాడ ఉత్సవ్ దేవదాయ శాఖ భూమిలో నిర్వహించుకోవటానికి స్టే ఇస్తే కోర్టును విమర్శిస్తారా అని ప్రశ్నించారు. టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, టీడీపీ మాజీ ఫ్లోర్ లీడర్ గుండారపు హరిబాబు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేష్, రాష్ట్ర మహిళా నాయకురాలు తుపాకుల రమణమ్మ, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ చిన్ని




ఉత్సవ్ పేరుతో వసూళ్లు

- మాజీ మంత్రి పేర్ని నాని

పాయకాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్ పేరుతో ఎంపీ కేశినేని చిన్ని నగరంలో వసూళ్లకు పాల్పడి జేబులు నింపుకుంటున్నారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని మల్లాది విష్ణు కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రులు పేర్ని నాని, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్ పలు విమర్శలు చేశారు. పేర్ని నాని మాట్లాడుతూ ఎంపీ చిన్ని కార్యాలయం వసూళ్ల కేంద్రంగా మారిందని, పెద్దిరెడ్డి అనే వ్యక్తిని పెట్టి రేషన్ దందా నడిపి నెలకు రూ.1.20 కోటి వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇసుక రీచ్‌లతో పాటు బూడిద అక్రమంగా హైదరాబాద్, ఖమ్మం తరలించి కోట్లు గడిస్తున్నారన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ పేరుతో ఎంపీ అమ్మవారి ప్రతిష్టతో పాటు విజయవాడ ప్రతిష్టను దెబ్బతీసేలా వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. దసరా ఉత్సవాల్లో మాంసాహారం అమ్మటం సిగ్గుచేటన్నారు. మల్లాది విష్ణు, దేవినేని అవినాష్ మాట్లాడుతూ నగరంలో సంక్షేమం, అభివృద్ధిపై ఎంపీ చిన్ని సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామన్నారు.

సమాచారం

శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి వైభవంగా అవుతాయి. ఆ రోజు మధ్యాహ్నం 3.00 గంటల నుంచి 5.00 గంటల వరకూ ధ్వజారోహణం ఉంటుంది.

మొదటిరోజు - సెప్టెంబరు 24:
బంగారు తిరుచ్చి ఉత్సవం (మధ్యాహ్నం 3 గంటలకు), పెద్ద శేష వాహనం (రాత్రి 9 గంటలకు)

రెండో రోజు - సెప్టెంబరు 25 :
చిన్న శేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)

మూడో రోజు - సెప్టెంబరు 26:
సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపు పందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)

నాలుగో రోజు - సెప్టెంబరు 27:
కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వ భూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)

అయిదో రోజు - సెప్టెంబరు 28:
మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6.30 గంటలకు)

ఆరో రోజు - సెప్టెంబరు 29:
హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), స్వర్ణ రథోత్సవం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)

ఏడో రోజు - సెప్టెంబరు 30:
సూర్య ప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)

ఎనిమిదో రోజు - అక్టోబరు 1:
రథోత్సవం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)

తొమ్మిదో రోజు - అక్టోబరు 2:
పల్లకి ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం (తెల్లవారుజామున 3 గంటల నుంచి). చక్రస్నానం (ఉదయం 6 గంటలకు), ధ్వజావరోహణం (రాత్రి 7.00 గంటలకు)

విశేషం

తీరొక్క పూల పండుగ



ప్రపంచంలో తీరొక్క పూలతో పండుగ జరుపుకొనే సంప్రదాయం తెలంగాణ బతుకమ్మదే. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదు... ప్రకృతి, సంస్కృతి కలయికలో పుట్టిన సజీవ కావ్యం. రంగు రంగుల పువ్వులతో అందంగా దొంతరలుగా పేర్చే బతుకమ్మలతో ఆడబిడ్డలు సంబురపడే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతుంది.

21నుంచి బతుకమ్మ సంబురాలు

చెలకల్లో, చేనుల్లో వాటంతట అవే మొలిచే సహజ పూలనే సేకరించి, రంగురంగుల గుండ్రటి ఆకారంలో శిఖరంగా పేర్చడం బతుకమ్మ పండుగకు జీవం. 'పెత్రామాస' (పితృ అమావాస్య) నాడు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఈ వేడుకలతో ఊరూ, వాడా కళకళలాడుతుంది. పూల రంగుల మేళవింపుతో ప్రతి ప్రాంతం బతుకమ్మ పూదోటగా గుబాళిస్తుంది.

సాయంత్రం ఆడబిడ్డలు ముస్తాబై, వలయాకారంలో నిలబడి, నెమ్మదిగా కదులుతూ, కోలాటమాడుతూ, పాటలు పాడుతూ నృత్యాలు చేయడం ఈ పండుగ గుండెచప్పుడు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

అచ్చ తెలుగు తెలంగాణ గీతసుధలలో బతుకమ్మ పాటలకు ప్రత్యేక స్థానం ఉంది...

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...
గోరింటాకు గోరుముద్దలో...
తంగేడు పువ్వు తాలంలో...
జాతి పూల జడలో..

ఇలాంటి పాటలు సజీవంగా పల్లెల గాలిలో వినిపిస్తాయి. ప్రతి పాటలో మహిళల మనసు, ప్రకృతి, పంటల పట్ల మమకారం ధ్వనిస్తూ ఉంటుంది. బతుకమ్మ పండుగను తెలంగాణ మహిళలు తమ ఆత్మగౌరవంగా భావిస్తారు. బతుకమ్మ పాటలు అన్నిట్లో ఒక కథ, ఒక సంస్కృతి, ఒక ఆశ, ఒక స్ఫూర్తి ఉంటాయి. ఈ వేడుకల్లో ప్రతి పువ్వుకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ప్రధానంగా ఉపయోగించే తంగేడు పువ్వు శక్తికి, గుమ్మడి పువ్వు సౌందర్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి

ప్రపంచమంతటా...

తెలంగాణ ప్రజలు ప్రపంచంలో



ఎక్కడ ఉన్నా బతుకమ్మ పండుగను జరుపుకొంటారు. ఆయా దేశాలలో తెలంగాణ యాసతో జానపదాలు మారుమోగుతాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో కూడా... అన్ని ప్రాంతాల్లో కాకపోయినా... పల్నాడు ప్రాంతంలోని మాచెర్ల, కంభంపాడు, కారెంపూడి గ్రామాల్లో మహిళలు బతుకమ్మను జరుపుకొంటారు. బతుకమ్మ పండుగ బొడ్డెమ్మ సందడితో ప్రారంభం కావడం ఆనవాయితీ. అయితే తెలంగాణలోని ఖమ్మం, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాల వారికి ఈ సంప్రదాయం లేదు. కాగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని గ్రామాలలో బతుకమ్మ కనిపించదు. అలాగే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో కూడా ఈ పూల పండుగను జరుపుకోరు.

నేలతో, నీటితో అనుబంధం

ఈ మధ్య కాలంలో పలు కారణాల వల్ల తంగేడుకు కరువొచ్చింది. చెలక భూముల్లో కాంక్రీట్ అరణ్యాలు విస్తరించడంతో ప్రకృతికి సహజ అలంకారాలైన పూలమొక్కలు కనిపించడం లేదు. ఫలితంగా కాగితం పూల బతుకమ్మలు మార్కెట్‌లోకి వచ్చాయి. వెదురు కర్రతో బుట్టలను చేసి వాటికి పూల మాలలు చుట్టడం ప్రారంభమైంది. బతుకమ్మ వేడుకల సందర్భంగా గౌరమ్మను పసుపు రంగు పూలతో పేర్చి తొమ్మిది రోజుల పాటు ఆటలాడి, పాటలు పాడి పూలను నీటిలో వదులుతారు. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు నిండుకుండల్లా ఉండే సమయంలో వచ్చే ఈ పండుగ... నేలతో, నీటితో మానవులకు ఉన్న అనుబంధాన్ని చాటుతుంది.

• కసువు వెంకటరమణ

సహజయోగ

ఎవరి పాదపద్మాలకు నమస్కరించడం వల్ల లభించే శక్తితో బ్రహ్మదేవుడు సకల చరాచర జగత్తును సృష్టించగలుగుతున్నాడో, ఎవరి చరణ కమలాలను స్మరించినంత మాత్రాన లభించే శక్తితో విష్ణుమూర్తి సకల లోకాలకు స్థితి కారకుడు అవుతున్నాడో, ఎవరి చరణ యుగళాన్ని ధ్యానించడం వల్ల లభించే శక్తితో శివుడు ముల్లోకాలకు లయకారకుడు అవుతున్నాడో... అటువంటి ఆదిపరాశక్తికి ప్రీతికరమైన రోజులు శరన్నవరాత్రులు.

శక్తి స్వరూపిణి జగదంబ

22 నుంచి దేవీ నవరాత్రులు

సమస్త సృష్టికి మూలం ఆది పరాశక్తి అయిన జగదంబ. దేవీ రూపాలు ఎన్నో ఉన్నాయి. వాటన్నిటికీ మూలం... ఆ జగదంబే. ఆమే దుర్గా మాత. రాక్షసులు కూడా ఆ దేవి సృష్టించినవారే. కానీ దేవీ భక్తులను నాశనం చేయడానికి వాళ్ళు అనేకసార్లు ప్రయత్నించారు. ఆ దుష్టశక్తులు నాశనం కాకపోతే... సత్యాన్వేషకులకు, సాధువులకు హాని కలిగించి, వారిని నాశనం చేస్తాయి. కాబట్టి ఎంతోమంది దేవతల, భక్తుల కోరిక మేరకు ఆమె అనేక అవతారాలు ధరించింది.

మానవుల కర్తవ్యం

పూర్వం మునులు హిమాలయాలకు వెళ్ళి, శరీరాన్ని గడ్డకట్టించే చలిలో ధ్యానం చేసేవారు. వారు ఎక్కడో గుహల్లో నివసించేవారు. పండ్లు తింటూ జీవించేవారు. ఎందుకంటే వారి జ్ఞానాన్వేషణ ఎంతో లోతైనది, చాలా బలమైనది, భగవత్ సాక్షాత్కారం అయ్యేవరకు వారు తపస్సును విడిచిపెట్టేవారు. కానీ ప్రస్తుత కాలంలో అది అసాధ్యం. ఈ కలియుగంలో దుష్ట శక్తులు రకరకాల చెడు ఆలోచనల రూపంలో మానవుల మనస్సుల్లోకి ప్రవేశించి, వినాశనంవైపు వారిని నడిపిస్తున్నాయి. ఆ దుష్ట ఆలోచనలను దూరంగా తరిమివేయడమే మానవుల కర్తవ్యం. మన లోపల అంతర్గతంగా ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేయడం ఒక్కటే దానికి ఏకైక మార్గం. కానీ ఇది అంత సులువుగా జరిగేది కాదు. అయితే శ్రీమాతాజీ నిర్మలాదేవి ఆవిష్కరించిన సహజయోగ సాధనతో... సామూహిక ఆత్మసాక్షాత్కారం ద్వారా కొన్నివేల మందిలో ఒకేసారి కుండలినీ శక్తిని జాగృతం చేయవచ్చు.

హృదయ చక్రానికి అధిష్ఠాన దేవత

దుర్గాదేవి మన సూక్ష్మ శరీర వ్యవస్థలోని హృదయ చక్రానికి అధిష్ఠాన దేవతగా ఉంటుంది. ఆ చక్రానికి పన్నెండు దళాలు ఉంటాయి. అందుకనే దుర్గాదేవికి పన్నెండు చేతులు ఉంటాయని మన పురాణాలు చెబుతున్నాయి. వైద్య శాస్త్రం ప్రకారం... హృదయ చక్రం ఉన్న చోట మన స్టెర్నమ్ ఎముక ఉంటుంది. అక్కడ యాంటీబాడీలుగా మనం పిలిచే రోగ నిరోధక శక్తులు ఉత్పత్తి అయి, శరీరంలో వ్యాపిస్తాయి. రోగకారకమైన క్రిములు, వైరస్‌లు మన శరీరంపై దాడి చేసినప్పుడు... ఈ రోగ నిరోధక శక్తులు వాటితో పోరాడతాయి. ఇవి చాలా సూక్ష్మమైన కణాలు. వాటినే మన పూర్వీకులు 'గణాలు'గా అభివర్ణించారు. ఆ గణాలకు అధిపతి శ్రీగణేశుడు. ఆయన జగదంబ రూపమైన గౌరీదేవి కుమారుడు. మన హృదయచక్రం మధ్యలో ఆసీనురాలైన జగదంబ... మనలో ధైర్యాన్ని, విశ్వాసాన్ని, ప్రేమను పెంపొందిస్తుంది. ఈ చక్రం పరిశుద్ధంగా ఉన్నవారు దుర్గాదేవిలా నిర్భయంగా, అందరి



పట్లా ప్రేమపూర్వకంగా ఉంటారు. ప్రతి నిత్యం చేసే సహజయోగ ధ్యాన సాధన సందర్భంగా... మనలోని కుండలినీ శక్తి సహస్రారం వైపు పయనిస్తూ... మార్గమధ్యంలోని హృదయ చక్రాన్ని దాటుతున్నప్పుడు, కుండలినీ శక్తి స్పర్శతో ఆ చక్రం జాగృతం అవుతుంది. అక్కడ ఆసీనురాలైన దుర్గామాత ప్రసన్నురాలు అవుతుంది. ఆ చక్రం పరిపుష్టి చెంది, శక్తిమంతంగా, ఆరోగ్యంగా తయారవుతుంది. ఆ చక్రంలోని లక్షణాలు, గుణాలు మనలో స్థిరపడతాయి. రాక్షస సంహారం చేసిన శ్రీదుర్గామాత శరన్నవరాత్రి పర్వదినాలలో ఎంతో ఆనందంగా ఉంటుంది.

ఆ రోజులలో ఆమెను ప్రసన్నం చేసుకుంటే మన కోరికలు సిద్ధిస్తాయి. నవరాత్రుల్లో ప్రతిరోజూ భక్తి ప్రపత్తులతో ధ్యానం, కీర్తనల ద్వారా దుర్గామాతను పూజించాలి. దుష్టశిక్షణ, భక్త రక్షణ ద్వారా ప్రపంచంలో శాంతిని నెలకొల్పాలని ప్రార్థించాలి.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



దారి చూపిన ప్రభువు

ఏసు క్రీస్తు పన్నెండుమంది శిష్యులను ఏర్పరచుకున్నాడు. సమాజంలోని మానవులతో ఎలా ప్రవర్తించాలో వారికి బోధించాడు. తన సందేశాన్ని అందరికీ అందించాల్సిందిగా వారిని ఆదేశించాడు. వారు పయనమవుతున్నప్పుడు... తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించాడు.

"సమాజంలో మిమ్మల్ని కొందరు శపించవచ్చు. వారిపై కోపగించుకోకుండా దీవించండి. మిమ్మల్ని ఎవరైతే బాధిస్తారో... వారి కోసం ప్రార్థించండి. మిమ్మల్ని ఎవరైనా ఒక చెంప మీద కొడితే... రెండో చెంపను కూడా చూపించండి. మీ వస్తువులను ఎత్తుకుపోయేవారిని ఏమాత్రం అడ్డగించకండి. ఇతరులు మీకు ఏవేవి చేయాలని మీరు ఆశిస్తారో... మీరు కూడా వారికోసం అవి చేయడానికి సిద్ధపడాలి. మిమ్మల్ని ప్రేమించేవారిని తిరిగి మీరు ప్రేమిస్తే అందులో పెద్ద విశేషం లేదు. మిమ్మల్ని ద్వేషించేవారిని కూడా ప్రేమించాలి. కీడు చేసేవారికి మేలు చేయాలి. పైలోకంలో ఉన్న ఆ తండ్రి మీపైన ఎంత కనికరం చూపిస్తున్నాడో... అంతటి దయా దాక్షిణ్యాలను తోటివారిపైన మీరు చూపించాలి. మీ ముందు ఎవరైనా తప్పు చేస్తే వారిని క్షమించండి. అప్పుడే దేవుడు కూడా మీ తప్పులను క్షమిస్తాడు. ఇతరులను మీరు ఎటువంటి కొలమానంతో కొలుస్తారో... అదే కొలమానం మీకు కూడా వర్తిస్తుంది. ఏ శిష్యుడైనా తన బోధకుడి మాదిరిగానే ప్రవర్తించాలి. ఏదీ తెలియనివాణ్ణి మార్గదర్శిగా ఎంచుకోకూడదు. ఎప్పుడైనా ఒక అంధుడు మరో అంధుడికి దారి చూపగలడా? వారిద్దరూ ఒక గుంతలో పడిపోతారు కదా!" అంటూ వారికి హితవు చెప్పాడు.

దైవమార్గం



అంతేకాదు... "ఒక్కోసారి ఇతరులు చేసిన తప్పులేమిటో గమనించకుండానే విమర్శిస్తాం. మీ కంట్లో ఉన్న దూలాన్ని పరిగణనలోకి తీసుకోకుండా... మీ తోటివారి కంట్లో ఉన్న నలుసు గురించి మాట్లాడడం సమంజసమా? చక్కటి ఆలోచనా ధోరణితో మంచి పునాదిని నిర్మించుకోవాలి. అదే సత్కార్యాలకు నాంది. మంచి వృక్షాల్లా ఎదగాలి. తియ్యని ఫలాలను కాయించాలి. మంచి చెట్టుకు పనికిమాలిన ఫలాలు కాయవు. మంచికీ, చెడుకూ హృదయం కేంద్రస్థానం. ఒక మనిషి సజ్జనుడు కావాలన్నా, దుర్జనుడు కావాలన్నా హృదయమే మూలం. అది మంచి చెట్టుకు బీజం లాంటిది. నేను చెప్పే మాటలను మీరు శ్రద్ధగా ఆచరించి చూడండి. సత్ఫలాలు లభిస్తాయి. నా మాట వినకపోతే నన్ను ఊరకే "ప్రభువా, ప్రభువా" అని పిలవడం వ్యర్థం. నా మాటలు మీకు మంచి పునాది వేస్తాయి. ఆ పునాది మీద ఎంతటి అందమైన భవనమైనా నిర్మించవచ్చు. కాబట్టి నా ఈ సందేశాన్ని మీ జీవన భవనానికి పునాదిగా చేసుకోండి" (లూకా... ఆరవ అధ్యాయం) అంటూ వారికి మార్గనిర్దేశం చేశాడు. ఏసు తన శిష్యులకు చెప్పిన మాటలు ఎవరికైనా, ఏ కాలంలోనైనా గొప్ప సామాజిక, ఆధ్యాత్మిక జీవనానికి దారి చూపుతాయి.


• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

సందేశం

నామస్మరణతో కార్యసాఫల్యం

మనిషికి జీవితంలో అనేక సమస్యలు, పరీక్షలు ఎదురవుతాయి. కొన్ని ఇబ్బందులు మన ప్రగతికి ఊహించలేని అవరోధంగా మారుతాయి. అలాంటి పరిస్థితుల్లో దైవనామాన్ని పఠిస్తూ పని మొదలుపెడితే... అది సజావుగా సాగిపోతుందని బోధించారు దైవప్రవక్త మహమ్మద్. "అల్లాహ్ నామంతో రోజును ప్రారంభించాలి. ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రపోయేవరకూ... చిన్నదైనా, పెద్దదైనా ప్రతి పనినీ దేవుని పేరిటే ప్రారంభించాలి. అల్లాహ్ నామంతో మొదలు పెట్టిన పని ఒక ఆశయంగా మారుతుంది. ఆయన నామాన్ని స్మరిస్తే అన్ని పనులూ సాధ్యమవుతాయి. కష్టాలు తొలగిపోతాయి.

అల్లాహ్ నామం కేవలం ఒక మాట కాదు. అది ఒక నమ్మకం, మన హృదయంలో అనిశ్చితిని తొలగించి, మన సంకల్పాన్ని దృఢంగా చేసే ఆధ్యాత్మిక బలం. 'నీవు ఒంటరిగా లేవు. అల్లాహ్ ఎప్పుడూ నీకు తోడుగా ఉన్నాడు' అనే భరోసాను అది అందిస్తుంది. ఆయనను తలచుకుంటూ వేసే ప్రతి అడుగూ విజయానికి (స్వర్గానికి) మార్గం అవుతుంది" అని స్పష్టం చేశారు.



అంతిమ దివ్య గ్రంథమైన ఖురాన్‌లోని 114 సూరాలలో (అధ్యాయాలలో) ఒకటి మినహా మిగిలినవన్నీ అల్లాహ్ నామమైన 'బిస్మిల్లా'తో ప్రారంభమవుతాయి. 'అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను' అనే వాక్యంతో మొదలైన ఎన్నో గ్రంథాలు, లేఖలు, సంభాషణలు కనిపిస్తాయి. స్వర్గాన్ని సృష్టించిన, మహోన్నతుడైన ప్రభువు నామాన్ని కొనియాడుతూ ప్రారంభమైన కార్యాలు కూడా దివ్య ఖుర్ఆన్‌లో దర్శనమిస్తాయి. "ఏ పనినైనా 'బిస్మిల్లా' అని అనకుండా మొదలుపెడితే అది అసంపూర్తిగా మిగిలిపోతుంది. కాబట్టి పనులన్నిటినీ ఆ నామాన్ని ఉచ్చరిస్తూ ప్రారంభించండి. అది మిమ్మల్ని సైతాన్ నుంచి రక్షిస్తుంది. దైవ నామస్మరణ చేస్తున్నంత కాలం మనిషికి సర్వ శుభాలు కలుగుతాయి. అన్ని ఆటంకాలు తొలగిపోతాయి. మనిషికి తోడుగా, నీడగా దైవ సహాయం అందుతుంది. కాబట్టి అంతటా వ్యాపించి ఉన్న అల్లాహ్ నామంతోనే ఏ కార్యాన్నైనా మొదలుపెట్టాలి" అని దైవప్రవక్త మహమ్మద్ బోధించారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

తెలుసుకుందాం

గోపురాలు... శిల్పకళా వైభవానికి నిదర్శనాలు

ఒక దేశంలోని వాస్తు నిర్మాణం ఆ దేశస్తుల మేధోసంపత్తి గురించి తెలియజేస్తుంది. ఆ దేశ ప్రజల నిర్మాణ కౌశలం, కళా కౌశలం, సృజనాత్మకత, అభిరుచి, ఆశచాలు, జీవనశైలి, శ్రమైక జీవన సౌందర్యం లాంటివి ఎన్నో విషయాలు వారు రూపొందించిన నిర్మాణాలు, వాటిలోని శిల్పాలు, చిత్రాలు తదితరాల ద్వారా తెలుసుకోవచ్చు. భారతదేశ వాస్తుకళ, శిల్పకళ... దేవాలయాలతో పెనవేసుకున్నాయి. దక్షిణ భారతదేశంలో వైదిక దేవాలయాల నిర్మాణాలను బట్టి భారతీయుల ఆధ్యాత్మిక వికాసాన్ని గుర్తించవచ్చు. ద్రవిడుల శిల్పకళ, వాస్తుకళల ఉన్నతికి అవి ప్రతిబింబాలు. ద్రవిడ శిల్పుల అపారమైన మేధో సంపత్తికి ఈ దేవాలయాలు సజీవ సాక్ష్యాలు.

ఈ దేవాలయ నిర్మాణాల్లో గోపురం విశిష్టమైనది. ద్వారం దగ్గర ఉన్నతంగా కనిపించే ఈ గోపురాలు ద్రవిడ శిల్పుల మహోన్నత శిల్పకళా వైశిష్ట్యానికి నిలువెత్తు నిదర్శనాలు. వారు తమ నైపుణ్యంతో ఎత్తయిన గోపురాలను నిర్మించి, ఆలయాల కీర్తిని శాశ్వతం చేశారు. గోపురాన్ని కేవలం ద్వారంగానే కాదు, ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చారు. పట్టణాలు పిడుగుపాటుకు గురికాకుండా, దేవుని స్థానం ఉన్నతంగా కనిపించే విధంగా, ఆ రోజుల్లో దేవాలయాలలో ప్రవేశించలేని అణగారిన వర్గాలకు దేవుని స్థానం కనిపించేలా దేవాలయ ప్రాసాదాలు నిర్మితమయ్యాయి. సనాతన భారతీయ శాస్త్రాలు దేవాలయాన్ని మానవ దేహంతో పోల్చాయి.

గర్భగృహం శిరం ప్రోక్తం అంతరాళం గళం తథా
మండపంచ ముఖంబాహుః కుక్షిఃస్యాన్మండపోమహాన్
ప్రాకారం జానుజంఘేచ గోపురం పాదమేవచ



విశ్వకర్మ వాస్తుశాస్త్రంలోని ఈ శ్లోకం... శయనించి ఉన్న మానవ దేహంలోని అవయవాలతో దేవాలయాన్ని పోల్చింది. "గర్భగృహం మానవుని శిరస్సు. అంతరాళం మానవుడి గళం. ముఖ మండపం మానవుని బాహువులు. మండపం ఉదరం (పొట్ట). ప్రాకారం మానవుని జానుజంఘాలు (మోకాలు, పిక్కలు). గోపురం మానవుని పాదాలు" అని అర్థం. దేవాలయ నిర్మాణంలో ప్రధానమైన కేంద్ర స్థానం గర్భగృహం. అది మానవుని శిరస్సు లాంటిది. దాని ముందు భాగాన్ని 'ముఖ మండపం' అంటారు. గర్భగృహానికి ముఖమండపాన్ని కలుపుతూ సన్నని మండపం ఉంటుంది. దాన్నే 'అంతరాళం' అంటారు. ఇక ఉదరభాగాన్ని మహా మండపంగా, పాదాలను గోపురంగా, పాదంలోని వేళ్ళను గోపుర కలశాలుగా పోల్చారు. శయనించిన మానవుడి పాదాలు రెండూ ఆకాశం వైపు చూస్తూ ఎత్తుగా నిలిచి ఉన్న విధంగా... ఆకాశంలోకి దూసుకుపోతున్నట్టు గోపుర నిర్మాణాన్ని శిల్పి మలిచాడు.

గోపురం శబ్దార్థాలు

పురద్వారంతు గోపురః - పురద్వారాన్ని గోపురం అంటారు. గోపురం అంటే గవను (దుర్గ పుర ద్వారం), వాకిలి అనే అర్థాలున్నాయి.

ద్వార మాత్రేపి గోపురం - 'పట్టణానికి ద్వారం' అని అర్థం.

గోప్యతే శూరైః ఇతి గోపురం - శూరులు రక్షించేది గోపురం. పట్టణ వాకిలిని శూరులైన సైనికులు ఎల్లవేళలా రక్షిస్తూ, కాపలా ఉంటారు.

గౌర్జలం పురం సంస్థాన మన్యతే గోపురం - నీరు ఉనికిపట్టుగా కలిగినది. పూర్వం ఇసుక నేలలో గోపురాన్ని నిర్మించేటప్పుడు పునాది కింద, పునాది చుట్టూ ఉండే ఇసుకలో తేమ శాతం ఉండేటట్టు చూసుకొనేవారు. తేమతో కూడిన ఇసుక ఆ పునాదికి మరింత గట్టితనాన్ని కలిగించి, ఎంత ఎత్తయిన గోపురం బరువునైనా కిందికి కుంగనీయదు. శ్రీరంగం రాజగోపురం, శ్రీకాళహస్తి రాజగోపురం దీనికి ఉదాహరణలు. కాగా వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, ఆగ్రాలోని తాజ్‌మహల్‌లను కూడా మరికొన్ని ఉదాహరణలుగా చెప్పకోవచ్చు.

• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి 9440525788



మారుతి కార్ల ధర తగ్గింపు

న్యూఢిల్లీ: కొత్త జీఎస్టీ రేట్లు వచ్చే సోమవారం నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో తమ కార్ల ధరలు తగ్గించాలని మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) యాజమాన్యం నిర్ణయించింది. కార్ల శ్రేణిని బట్టి ధరల తగ్గింపు రూ.1,29,600 వరకు ఉంటుందని తెలిపింది. జీఎస్టీ రేట్ల కోత ప్రయోజనాన్ని ఈ నెల 22 నుంచి సంపూర్ణంగా కస్టమర్లకే అందించాలని నిర్ణయించినట్టు పేర్కొంది.

ఇదే మంచి సమయం: కారు కొనేందుకు ఇంతకు మించిన మంచి సమయం మరొకటి ఉండదని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు. తాము ఎంట్రీ స్థాయి కార్ల ధరను జీఎస్టీ ప్రయోజనం 8.5 శాతాన్ని మించి తగ్గించామని చెప్పారు. దేశంలో కారు కొనుగోలు చేసే వారి సంఖ్య ప్రతి వెయ్యి మందిలో 34గా ఉన్నదని, అందుకే మార్కెట్ అగ్రగామి అయిన తాము ఈ ప్రత్యేక చొరవ తీసుకున్నామని ఆయన వెల్లడించారు.

కార్ల ధర ఎంత తగ్గుతుందంటే

కారు	ధర (రూ.లల్లో)
ఎస్ ప్రెసో	1,29,600
ఆల్టో కే10	1,07,600
సెలేరియో	94,100
వ్యాగన్-ఆర్	79,600
ఇగ్నిస్	71,300
స్విఫ్ట్	84,600
బాలెనో	86,100
టూర్ ఎస్	67,200
డిజైర్	87,700
ఫ్రాంక్స్	1,12,600
బ్రెజ్జా	1,12,700
గ్రాండ్ విటారా	1,07,000
జిమ్నీ	51,900
ఎర్టిగా	46,400
ఎక్స్ఎల్ 6	52,000
ఇన్విక్టో	61,700
ఈకో	68,000
సూపర్ క్యారీ ఎల్‌సీవీ	52,100

హెరిటేజ్ ఫుడ్స్

డెయిరీ ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లు తగ్గిన నేపథ్యంలో తమ ఉత్పత్తుల ధరలు తగ్గిస్తున్నట్టు హెరిటేజ్ ఫుడ్స్ ప్రకటించింది. ఈ నెల 22 నుంచి జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనం పూర్తిగా కస్టమర్లకే అందించాలనుకుంటున్నట్టు తెలిపింది. షెల్ఫ్ లైఫ్ యూహెచ్‌టీ పాల ధర లీటరు రూ.3 మేరకు తగ్గిస్తున్నట్టు తెలిపింది. అయితే తాజా పాలపై జీఎస్టీ తగ్గించని కారణంగా వాటి ధర యథాతథంగా ఉంటుందని పేర్కొంది. అలాగే నెయ్యి, వెన్న, చీజ్ ధర కిలో రూ.50 వంతున, పనీర్ ధర కిలో రూ.25 తగ్గుతుంది. ఐస్‌క్రీమ్ ధర 950 ఎంఎల్ ప్యాక్‌పై రూ.35, 700 ఎంఎల్ ప్యాక్‌పై రూ.20 తగ్గుతుంది.

ఐటీసీ

జీఎస్టీ రేట్లు తగ్గడంతో ఎఫ్ఎంసీజీ విభాగంలోని అన్ని వస్తువుల ధరలూ తగ్గిస్తున్నట్టు ఐటీసీ ప్రకటించింది. ధరల తగ్గింపు ప్రయోజనం ఏ మేరకు ఉన్నదీ కస్టమర్లకు తెలియ చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీ.సుమంత్ చెప్పారు.

ప్లాస్టో నుంచి కొత్త ఉత్పత్తులు



హైదరాబాద్: ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. మార్కెట్లోకి ప్లాస్టో బకెట్, మగ్గులను విడుదల చేసింది. వినియోగదారుల రోజువారీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో ఈ కొత్త ఉత్పత్తులను డిజైన్ చేసినట్లు కంపెనీ తెలిపింది. వంద శాతం ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌తో వీటిని తయారు చేసినట్లు పేర్కొంది. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకునే విధంగా యూవీ ప్రొటెక్షన్ టెక్నాలజీతో ఈ ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు తెలిపింది. ఐదేళ్ల వారంటీతో కూడిన బకెట్ 5, 25 లీటర్లు, మగ్గులు ఒక లీటర్, 1.5 లీటర్ సామర్థ్యాలతో అందుబాటులో ఉంటాయని ఆర్‌సీ ప్లాస్టో వెల్లడించింది. ఈ ఉత్పత్తులు ఆర్‌సీ ప్లాస్టో అధీకృత డిస్ట్రిబ్యూటర్లు, డీలర్ల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపింది.

83,000 ఎగువన సెన్సెక్స్

ముంబై: అమెరికాలో వడ్డీ రేట్ల కోత మార్కెట్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ చర్య ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. ఫార్మా, ఐటీ, ఫైనాన్షియల్ రంగాల షేర్లు మార్కెట్ లాభాలకు మద్దతు ఇచ్చాయి. దీంతో సెన్సెక్స్ 320 పాయింట్ల లాభంతో 83,013.96 వద్ద ముగియగా నిఫ్టీ 93.35 పాయింట్ల లాభంతో 25,423.60 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.36% లాభపడగా స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 0.01 శాతం నామమాత్రపు నష్టంతో ముగిసింది.

23న నాలుగు ఐపీఓలు: వచ్చే మంగళవారం (23వ తేదీ) నాలుగు తొలి పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) మార్కెట్ తలుపు తట్టనున్నాయి. వాటిలో ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్, శేషసాయి టెక్నాలజీస్, జారో ఎడ్యుకేషన్, సోలార్ వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ ఉన్నాయి. ఈ ఇష్యూలన్నీ 25వ తేదీన ముగుస్తాయి. ఆనంద్ రాఠీ షేరు ధర శ్రేణిని రూ.393-414, శేషసాయి టెక్నాలజీస్ షేరు ధర రూ.402-423గా ప్రకటించాయి.

గౌతమ్ అదానీకి సెబీ క్లీన్‌చిట్

- అదానీ గ్రూప్, రాజేశ్ అదానీలకు కూడా
- ఇన్‌సైడర్ ట్రేడింగ్ అబద్ధం
- హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ఆధారాల్లేవు



న్యూఢిల్లీ: ఊహించిందే జరిగింది. అదానీ గ్రూప్, ఆ గ్రూప్ ప్రధాన ప్రమోటర్లు గౌతమ్ అదానీ, రాజేశ్ అదానీలపై వచ్చిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొట్టి పారేసింది. అదానీ గ్రూప్‌నకు చెందిన లిస్టెడ్ కంపెనీల షేర్లలో 'సంబంధిత' (రిలేటెడ్) పార్టీల లావాదేవీలు జరిగినట్టు 2023 జనవరిలో అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ 'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' సంస్థ చేసిన ఆరోపణలను తోసిపుచ్చింది. తమ దర్యాప్తులో ఇందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని ప్రకటించింది. దీనికి సంబంధించి సెబీ బోర్డు సభ్యులు కమలేశ్ సీ వర్ష్నీ గురువారం రెండు ఆదేశాలు జారీ చేశారు. ఆడికార్ప్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, మైల్‌స్టోన్ ట్రేడ్‌లింక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రెహ్వర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలు.. అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు అసలు 'సంబంధిత' పార్టీల లావాదేవీల నిర్వచనం పరిధిలోకే రావని సెబీ తేల్చింది. ఈ సంస్థలు అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల నుంచి తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లించినప్పుడు 'సంబంధిత' లావాదేవీల ప్రశ్నే తలెత్తదని స్పష్టం చేసింది.

ఇదీ కేసు

అదానీ గ్రూప్ ప్రమోటర్లు తమ నిర్వహణలోని విదేశీ డొల్ల కంపెనీలకు నిధులు మళ్లించి, ఆ నిధులతో గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లలో కృత్రిమ ర్యాలీ సృష్టిస్తున్నారని 'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' సంస్థ 2023 జనవరిలో పెద్ద బాంబు పేల్చింది. దాంతో అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ ఒక దశలో 15,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.13.21 లక్షల కోట్లు) మేర తుడిచి పెట్టుకుపోయింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు ప్రధాన లిస్టెడ్ కంపెనీల షేర్ల ధర 50 నుంచి 70 శాతం పడిపోయింది. దాంతో 2023 జనవరి నాటికి ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానంలో ఉన్న గౌతమ్ అదానీ కనీసం టాప్-100లో కూడా లేకుండా పోయారు.

క్షమాపణ చెప్పాలి గౌతమ్ అదానీ

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ నివేదిక ఆధారంగా తమపై ఆరోపణలు చేసిన వ్యక్తులు ఇప్పటికైనా తమకు క్షమాపణలు చెప్పాలని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ కోరారు. దీనికి సంబంధించి గురువారం ఆయన సోషల్ మీడియా యాప్ 'ఎక్స్'లో తన వ్యాఖ్యలను పోస్టు చేశారు. హిండెన్‌బర్గ్ సంస్థ దురుద్దేశాలతో తమపై నిరాధార ఆరోపణలు చేస్తోందని తాము మొదటి నుంచీ చెబుతున్న విషయాన్ని అదానీ ఆ పోస్టులో గుర్తు చేశారు. సెబీ జరిపిన సమగ్ర దర్యాప్తులోనూ ఇదే విషయం తేలిందన్నారు. 'ఈ దురుద్దేశపూరిత నివేదికతో నష్టపోయిన మదుపరుల బాధ ఏంటో మాకు తెలుసు. ఈ నివేదిక ఆధారంగా మాపై తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులు జాతికి క్షమాపణలు చెప్పాలి' అని అదానీ ఆ పోస్టులో పేర్కొన్నారు.

ఇప్పటికే 'సుప్రీం' నుంచి

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక అప్పట్లో దేశంలో పెద్ద ప్రకంపనలే సృష్టించింది. ప్రభుత్వ అండదండలతోనే అదానీలు ఇందుకు సాహసించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇప్పటికే అదానీ గ్రూప్ సంస్థలు, గౌతమ్ అదానీ, రాజేశ్ అదానీలకు క్లీన్‌చిట్ ఇచ్చింది. తాజాగా సెబీ కూడా క్లీన్‌చిట్ ఇవ్వడంతో అదానీలకు పెద్ద ఊరట లభించినట్టయింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	135
వరంగల్	118	గుంటూరు	132
కరీంనగర్	118	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	120
కర్నూలు	118	నెల్లూరు	125
విశాఖపట్నం	134	అనంతపురం	125
గోదావరి	135		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,170 ▼	1,01,900 ▼	1,42,000 ▼
విజయవాడ	1,13,600 ▲	1,07,500 ▲	1,31,450 ▲
విశాఖపట్నం	1,13,720 ▼	1,00,000 ▼	1,41,000 ▼
రాజమండ్రి	1,11,160 ▼	1,01,900 ▼	1,30,200 ▼
ప్రొద్దుటూరు	1,14,000 ▼	1,04,420 ▼	1,31,500 ▼
ముంబై	1,10,167 ▲	1,00,913 ▲	1,27,100 ▲

త్వరలో జొన్నగిరి గని నుంచి పసిడి ఉత్పత్తి

- నాలుగేళ్లలో ఏటా 1,000 టన్నులు
- దక్కన్ గోల్డ్‌మైన్స్ ఎండీ హనుమ ప్రసాద్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ త్వరలో దేశ పసిడి ఉత్పత్తి మ్యాప్‌లో చేరబోతోంది. కర్నూలు జిల్లాలోని జొన్నగిరి వద్ద దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్) కంపెనీ అభివృద్ధి చేస్తున్న గనిలో అతి త్వరలో ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఢిల్లీలో సీఐఐ నిర్వహించిన ఒక సదస్సుకు హాజరైన డీజీఎంఎల్ ఎండీ హనుమ ప్రసాద్ ఈ విషయం వెల్లడించారు. ఈ ఏడాది జూన్-జూలై నెలల్లో ఈ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు లభించాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన అనుమతులు కూడా లభిస్తే త్వరలోనే జొన్నగిరి గని నుంచి పసిడి ఉత్పత్తి ప్రారంభిస్తామని ప్రసాద్ చెప్పారు. ఇదే జరిగితే మన దేశంలో గనుల నుంచి పసిడి తీసే తొలి ప్రైవేట్ కంపెనీగా డీజీఎంఎల్ రికార్డు సృష్టించనుంది. కాగా ప్రారంభంలో జొన్నగిరి గని నుంచి ఏటా 750 కిలోల పసిడి ఉత్పత్తి చేయవచ్చని డీజీఎంఎల్ భావిస్తోంది. తర్వాత రెండు-మూడు సంవత్సరాల్లో ఇది 1,000 టన్నులకు చేరే అవకాశం ఉందని ప్రసాద్ తెలిపారు.

ప్రస్తుతం మన దేశంలో ఏటా 1.5 టన్నులకు మించి పసిడి ఉత్పత్తి కావడం లేదు. దీంతో పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం ఖర్చు చేసి ఏటా దాదాపు 1,000 టన్నుల పసిడి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. జొన్నగిరి గనుల్లో డీజీఎంఎల్ పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభిస్తే ఈ భారం భారీగా తగ్గనుంది.

ఏపీ, గుజరాత్‌లో నౌకా నిర్మాణ క్లస్టర్లు

న్యూఢిల్లీ: దేశంలో నౌకా నిర్మాణాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒడిశా, మహారాష్ట్రల్లో నౌకా నిర్మాణ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఇందుకోసం రూ.20,000 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసేందుకూ సిద్ధమవుతోంది. శనివారం ప్రధాని మోదీ తన గుజరాత్ పర్యటనలో దీనికి సంబంధించిన విధివిధానాలు ప్రకటిస్తారని భావిస్తున్నారు. ప్రస్తుతం మన నౌకా వాణిజ్యంలో 80 శాతానికిపైగా విదేశీ నౌకల ద్వారా జరుగుతోంది. 2040 నాటికి మన అంతర్జాతీయ వాణిజ్యంలో 70% దేశంలో నిర్మించే నౌకల ద్వారా జరగాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఆయిల్ కంపెనీలకే చమురు రవాణా కోసం 112 ఆయిల్ ట్యాంకర్లు కావాలి. దీంతో జపాన్, దక్షిణ కొరియాలకు చెందిన నౌకా నిర్మాణ సంస్థలతో కలిసి దేశంలోనే పెద్దఎత్తున నౌకా నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.

అంతిమ్‌కు కాంస్యం



ప్రపంచ రెజ్లింగ్

జగ్రెబ్: భారత యువ రెజ్లర్ అంతిమ్ పంగల్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకొంది. గురువారం జరిగిన 53 కిలోల కాంస్య పోరులో అంతిమ్ 9-1తో ఎమ్మా జొన్నా డినైస్ మల్మగ్రెన్ (స్వీడన్)పై గెలిచింది. 21 ఏళ్ల అంతిమ్‌కు ఇది రెండో ప్రపంచ పతకం. 2023 టోర్నీలోనూ ఆమె కాంస్యం నెగ్గింది. దీంతో వినేశ్ ఫొగట్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు నెగ్గిన భారత రెజ్లర్‌గా అంతిమ్ నిలిచింది. ఇక, మరో భారత రెజ్లర్ మనీష 62 కిలోల విభాగం రెపిచేజ్ రౌండ్‌లో ఓటమిపాలై కాంస్య పోరుకు దూరమైంది.

క్వార్టర్స్‌కు సింధు, సాత్విక్ జోడీ

షెన్‌జెన్ (చైనా): స్టార్ షట్లర్ పీవీ సింధు, డబుల్స్ ఏస్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో సింధు 21-15, 21-15తో ఆరో సీడ్ పోర్న్‌పవీ చోచువాంగ్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. డబుల్స్‌లో 8వ సీడ్ సాత్విక్ ద్వయం 21-13, 21-12తో తైపీ జంట సియాంగ్ చీ చియు/వాంగ్ చి లిన్‌ను ఓడించింది.

ఆర్చరీ లీగ్‌లో జ్యోతి, ధీరజ్, చికిత

న్యూఢిల్లీ: మొదటిసారిగా జరగనున్న ఫ్రాంఛైజీ తరహా ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో తెలుగు స్టార్లు జ్యోతి సురేఖ, ధీరజ్, చికితలకు చోటు దక్కింది. వచ్చే నెల 2 నుంచి 12 వరకు యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో లీగ్‌ను నిర్వహించనున్నారు. ఆరు జట్ల లీగ్‌లో వరల్డ్ టాప్ ఆర్చర్లు ఆండ్రి బెసెర్రా, బ్రాడీ ఎల్లిసన్ సహా 48 మంది మేటి విలుకాళ్లు బరిలో నిలవనున్నారు. పృథ్వీరాజ్ యోధాస్, రాజ్‌పుతాన రాయల్స్, చోళ చీఫ్స్, కాకతీయ నైట్స్, చేర ఆర్చర్స్, మైటీ మరాఠాస్ ఈ ఆరుజట్లకు సంబంధించిన ప్లేయర్లను గురువారం జరిగిన ఎనిమిది రౌండ్ల డ్రాఫ్టింగ్ తర్వాత ప్రకటించారు. కాకతీయ నైట్స్‌లో జ్యోతి సురేఖ, చోళ చీఫ్స్‌లో చికిత, దీపిక కుమారి, మైటీ మరాఠాస్‌లో ధీరజ్ తలపడనున్నారు.

రేపటి నుంచి గుంటూరులో జాతీయ చెస్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం నుంచి జాతీయ చెస్ చాంపియన్‌షిప్ జరగనుంది. ఈ టోర్నీలో 14 మంది గ్రాండ్‌మాస్టర్లు, 29 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు, ఓ మహిళా గ్రాండ్‌మాస్టర్ సహా దాదాపు 500 మంది పోటీపడుతున్నారు. అక్టోబరు 1న పోటీలు ముగుస్తాయి. విజేతలకు రూ. 30 లక్షల నగదు బహుమతిని అందజేయనున్నట్టు టోర్నీ చీఫ్ కో-ఆర్డినేటర్ కేవీవీ శర్మ, ఏపీ చెస్ సంఘం అధ్యక్షుడు అడుసుమల్లి సురేష్ తెలిపారు. అలాగే.. టోర్నీలో రాణించిన క్రీడాకారులను త్వరలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లాంటి టోర్నీలకు ఎంపిక చేయనున్నట్టు వెల్లడించారు.

జురెల్ శతకం.. భారత్ 'ఎ' 403/4

లఖ్‌నవూ: ఆస్ట్రేలియా 'ఎ'తో జరుగుతున్న అనధికార తొలి టెస్టులో భారత్ 'ఎ' బ్యాటర్లు సమష్టిగా రాణిస్తున్నారు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (113 బ్యాటింగ్) అజేయ శతకంతో రాణించగా, అతడికి జతగా క్రీజులో ఉన్న దేవ్‌దత్ పడిక్కళ్ (86 బ్యాటింగ్) కూడా సెంచరీ వైపు సాగుతున్నాడు. దీంతో మూడో రోజు గురువారం ఆట ముగిసే సరికి భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 403/4 స్కోరుతో నిలిచింది. సాయి సుదర్శన్ (73), ఓపెనర్ జగదీశన్ (64) ఆకట్టుకున్నారు. కెప్టెన్ శ్రేయాస్ (8) విఫలమయ్యాడు. ఆసీస్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 532/6 స్కోరు దగ్గర డిక్లేర్ చేసింది.

విఫలమైన నీరజ్ మెరిసిన సచిన్

ప్రపంచ అథ్లెటిక్స్



8వ స్థానానికి పరిమితమైన చోప్రా

- యాదవ్‌కు నాలుగో స్థానం.. త్రుటిలో చేజారిన పతకం
- వాల్కాట్‌కు జావెలిన్ టైటిల్



సచిన్ యాదవ్

టోక్యో: జావెలిన్ వీరుడు నీరజ్ చోప్రా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నిరాశపరిచాడు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన నీరజ్.. టైటిల్ నిలబెట్టుకోవడంలో విఫలమవడమే గాకుండా కనీసం పోడియం ఫినిష్ కూడా చేయలేకపోయాడు. గురువారం జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ ఒక్కసారి కూడా 85 మీటర్ల మార్క్‌ను అందుకోలేకపోయాడు. మొత్తం 12 మంది పోటీపడ్డ ఫైనల్స్‌లో నీరజ్.. జావెలిన్‌ను 84.03 మీటర్లు మాత్రమే విసిరి ఏకంగా ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యాడు. హాట్ ఫేవరెట్‌గా పోటీపడ్డ నీరజ్ మొదటి ప్రయత్నంలో జావెలిన్‌ను 83.65 మీటర్ల దూరం విసిరాడు. రెండో రౌండ్‌లో 84.03 మీటర్లు విసిరిన చోప్రా.. మూడో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. నాలుగో రౌండ్‌లో 82.86 మీటర్లతో సరిపెట్టుకున్న నీరజ్.. ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేసి పతక రేసు నుంచి నిష్క్రమించాడు. అయితే నీరజ్ నిరాశపరిచిన చోట.. మరో భారత త్రోయర్ సచిన్ యాదవ్ తన అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అంచనాలకు మించి రాణించిన సచిన్.. అత్యుత్తమంగా 86.27 మీటర్లు విసిరి నాలుగో స్థానంతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. నీరజ్ కంటే ఎన్నోరెట్లు అద్భుతంగా రాణించిన సచిన్.. కేవలం 40 సెంటీ మీటర్ల తేడాతో కాంస్య పతకం చేజార్చుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే అత్యుత్తమ ప్రదర్శన చేసి పతకంపై ఆశలు రేపిన సచిన్.. ఆఖరి ప్రయత్నంలో 80.95 మీటర్లే త్రో చేసి నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు. మూడో స్థానంలో నిలిచిన అమెరికా త్రోయర్ కర్టిస్ థాంప్సన్ 86.67 మీటర్లతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఇక, ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన కిషోర్న్ వాల్కాట్ అందరి కంటే అత్యుత్తమంగా 88.16 మీటర్లు త్రో చేసి స్వర్ణం ఎగరేసుకుపోయాడు. గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ 87.38 మీటర్ల ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం అందుకున్నాడు. ఇటీవల డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన జర్మన్ స్టార్ జులియన్ వెబర్ (86.11 మీ.) ఇక్కడ ఐదో స్థానానికి పడిపోయాడు. ఇక, నీరజ్‌కు పోటీగా భావించిన పాకిస్థాన్ స్టార్, పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ కూడా దారుణంగా విఫలమయ్యాడు. ఫైనల్లో పూర్తిగా తేలిపోయిన అర్షద్.. 82.75 మీటర్లు త్రో చేసి ఏకంగా పదో స్థానంలో నిలవడం గమనార్హం.



అండర్సన్ పీటర్స్ | కిషోర్న్ వాల్కాట్ | కుర్టిస్ థాంప్సన్

నయా సంచలనం

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నాలుగోస్థానంలో నిలిచి అబ్బురపరిచిన 25 ఏళ్ల సచిన్ యాదవ్.. ఉత్తరప్రదేశ్‌లోని ఖేక్రా గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో జన్మించాడు. ఆరడుగుల ఐదు అంగుళాల పొడవున్న సచిన్.. చిన్నప్పుడు ఫాస్ట్ బౌలర్ కావాలనుకొని ఆ దిశగా అడుగులేశాడు. కానీ, 19 ఏళ్ల వయసులో సందీప్ యాదవ్ అనే అథ్లెట్ మార్గదర్శకత్వంతో జావెలిన్ త్రోను కెరీర్‌గా ఎంచుకున్నాడు. ఈ ఏడాది మే నెలలో కొరియాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో జావెలిన్‌ను 86.27 మీటర్లు త్రో చేసి అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శనతో రజతం నెగ్గాడు. అదే ఊపులో ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించి క్వాలిఫికేషన్స్‌లో సత్తా చాటాడు. ఫైనల్లో నీరజ్ చోప్రా, వెబర్, జాకబ్ వాడ్లెచ్, అర్షద్ నదీమ్‌లాంటి స్టార్లు తడబడిన చోట.. వారిని మించిన ప్రదర్శనతో ఆకట్టుకొని ఇప్పుడు జావెలిన్ త్రోలో నయా సంచలనంగా మారాడు.

గాయం దెబ్బతీసిందా..?

గతంలో ఎన్నడూ లేనంతగా నీరజ్ ఈసారి దారుణంగా విఫలమవడానికి కారణం అతను గాయానికి గురవడమేనని తెలుస్తోంది. టోర్నీకి రెండు వారాల ముందు నుంచే నీరజ్ వెన్నునొప్పితో బాధపడుతున్నాడని భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) అధికారి ఒకరు వెల్లడించారు. ఒకరకంగా వెన్నునొప్పి కూడా తన ప్రదర్శనపై ప్రభావం చూపిందని ఫైనల్స్ ముగిసిన అనంతరం నీరజ్ తెలిపాడు. కాగా, గత ఏడేళ్లలో పోటీపడిన ప్రతి ఈవెంట్‌లోనూ పతకం గెలిచిన 27 ఏళ్ల నీరజ్.. ఓ టోర్నీలో పతకం లేకుండా రావడం ఇదే మొదటిసారి. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించిన నీరజ్.. గత పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గాడు. ఇక, 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం గెలిచిన నీరజ్.. గత టోర్నీ (2023)లో పసిడి సాధించాడు.



48 సెకన్లలోపే..

అమెరికా స్టార్ అథ్లెట్ సిడ్నీ మెక్‌లానిన్ లెవ్రోన్ 400 మీటర్ల రేసులో సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భాగంగా గురువారం జరిగిన మహిళల 400 మీటర్ల రేసును మెక్‌లానిన్.. 47.78 సెకన్లలో ముగించి స్వర్ణం అందుకుంది. ఈ క్రమంలో గడచిన 40 ఏళ్లలో.. ఈ రేసును 48 సెకన్లలోపు పూర్తి చేసిన తొలి మహిళా అథ్లెట్‌గా 26 ఏళ్ల మెక్‌లానిన్ రికార్డుకెక్కింది. చివరిసారిగా 1985లో జర్మనీ అథ్లెట్ మరిటా కోచ్ 47.60 సెకన్లలో మహిళల 400 మీటర్ల రేసును పూర్తి చేసింది.

స్పోర్ట్స్



'సూపర్' ప్రాక్టీస్ కావాలని..

ఆసియాకప్

- నేడు ఒమన్‌తో భారత్ పోరు
- రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

అబుధాబి: ఆసియాకప్‌లో అజేయంగా దూసుకెళుతున్న టీమిండియా గ్రూప్ 'ఎ'లో తమ ఆఖరి మ్యాచ్ ఆడనుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఒమన్‌తో తలపడనుంది. అయితే ఈ నామమాత్రపు మ్యాచ్‌ను సూపర్-4కు సన్నాహకంగా ఉపయోగించుకోవాలని భారత్ భావిస్తోంది. టాపార్డర్ విశేషంగా రాణించడంతో ఇప్పటిదాకా మిడిల్, లోయరార్డర్ బ్యాటర్లకు పెద్దగా అవకాశం దక్కలేదు. ఆడిన రెండు మ్యాచ్‌లు కూడా ఏకపక్షంగానే ముగిశాయి. టాప్-8లోని ముగ్గురు ప్లేయర్లు అసలు బరిలోకి దిగలేదు. ఈ ఆదివారం మరోసారి పాకిస్థాన్‌తో తలపడబోతున్న తరుణంలో బ్యాటర్లకు క్రీజులో తగినంత సమయం లభించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అందుకే టాస్ గెలిస్తే బ్యాటింగ్ వైపు మొగ్గుచూపవచ్చు. మిడిలార్డర్‌లో శాంసన్, అక్షర్ అసలు బరిలోకే దిగలేదు. మరోవైపు కోచ్ గంభీర్ ఈ మ్యాచ్ కోసం పెద్దగా ప్రయోగాలు చేయాలనుకోవడం లేదు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతినిచ్చి మరో పేసర్ అర్ష్‌దీప్‌ను పరీక్షించవచ్చు. అబుధాబి పిచ్ పేసర్లకు అనుకూలించనుండడంతో హర్షిత్‌ను ఎంపిక చేసినా ఆశ్చర్యం లేదు. అటు ఒమన్ ముందుగా బ్యాటింగ్‌కు దిగితే భారత బౌలర్లను ఎదుర్కొని పూర్తి ఓవర్లు ఆడగలదా అంటే సందేహమే. ఆ జట్టు పాక్‌పై 67, యూఏఈపై 130 రన్స్ మాత్రమే చేయగలిగింది.

అఫ్ఘాన్ అవుట్

సూపర్-4లో శ్రీలంక, బంగ్లాదేశ్

అబుధాబి: ఆసియాకప్‌లో అఫ్ఘానిస్థాన్ పోరాటం ముగిసింది. చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో గురువారం శ్రీలంకతో పోరులో ఆరు వికెట్ల తేడాతో పోరాడి ఓడింది. ఈ ఫలితంతో గ్రూప్ 'బి' నుంచి లంకతో పాటు బంగ్లాదేశ్ కూడా సూపర్-4లో అడుగుపెట్టింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు సాధించింది. 79/6 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును చివర్లో నబీ (22 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 60) ఆదుకున్నాడు. ఆఖరి ఓవర్‌లో వరుసగా ఐదు సిక్సర్లతో వణికించాడు. పేసర్ తుషారకు 4 వికెట్లు దక్కాయి. ఛేదనలో లంక 18.4 ఓవర్లలో 171/4 స్కోరు చేసి నెగ్గింది. కుశాల్ మెండిస్ (74 నాటౌట్) అజేయంగా నిలిచాడు. 16వ ఓవర్ వరకు అఫ్ఘాన్ గెలుపు దిశగా సాగుతున్నప్పటికీ, ఆఖర్లో మెండిస్ బాదుడుకు ఆశలు వదులుకుంది.

జాతీయ రెజ్లింగ్‌లో 'నారాయణ' హవా



ఆయుష్, వైష్ణవికి స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): జమ్మూలో జరిగిన జాతీయ గ్రాప్లింగ్ (రెజ్లింగ్) చాంపియన్‌షిప్‌లో నారాయణ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు మూడు స్వర్ణ పతకాలతో సత్తా చాటారు. అండర్-11 కేటగిరిలో ఆయుష్ ఠాకూర్ రెండు పసిడి పతకాలు, అండర్-15 విభాగంలో వైష్ణవి ఠాకూర్ ఓ స్వర్ణం గెలిచారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డా. సింధూర నారాయణ, శరణి నారాయణ.. పతకాలు నెగ్గిన విద్యార్థులను అభినందించారు. వీళ్ల విజయం.. తమ సంస్థలో మరింతమంది క్రీడల్లో ప్రతిభ చాటేందుకు స్ఫూర్తినిస్తుందన్నారు.

ఈ విజయం చిత్ర పరిశ్రమది

- సాయి దుర్గా తేజ్



"కిష్కింధపురి' సాధించిన విజయం చిత్ర పరిశ్రమదిగా భావిస్తున్నా. మరిన్ని మంచి కథలు రావాలి. అప్పుడే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారు. అలాంటి సినిమాలు తీయడం మన అందరి బాధ్యత. ఇటీవలె విడుదలైన అన్ని సినిమాలు బాగా ఆడుతున్నాయి. మంచి కంటెంట్‌ని ప్రేక్షకులు ఆదరిస్తారనే విషయం మరోసారి రుజువైంది' అని అన్నారు హీరో సాయి దుర్గా తేజ్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కించిన చిత్రం 'కిష్కింధపురి' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణను పొందుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ సినిమాను విజయవంతంగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞలు తెలిపారు. దర్శకులు అనిల్ రావిపూడి, బాబీ, వశిష్ఠ, అనుదీప్ మాట్లాడుతూ 'ఈ నెలలో విడుదలైన సినిమాలతో థియేటర్లలో పండగ వాతావరణం నెలకొంది. ప్రేక్షకులతో థియేటర్లు కళ కళలాడుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాం' అని అన్నారు. చిత్ర నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ 'డైరెక్టర్ కౌశిక్ అనుకున్న కథను తెరపై హాలీవుడ్ స్థాయిలో చూపించారు. ప్రేక్షకులు కూడా అలానే భావిస్తున్నారు' అని తెలిపారు. చిత్ర దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ 'చాలా కాలం తర్వాత థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డ్స్ చూస్తుంటే చాలా సంతోషం కలిగింది' అని అన్నారు.



ఓ అభిమాని బయోపిక్

రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న 'ఆంధ్రా కింగ్ తాలుకా' చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర ఆంధ్రా కింగ్‌గా నటిస్తున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేసి 'హ్యాపీ బర్త్‌డే ఆంధ్రా కింగ్' అంటూ అభినందనలు తెలిపింది టీమ్. మహేశ్‌బాబు దర్శకత్వంలో మైత్రీ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఓ అభిమాని బయోపిక్‌గా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో రామ్ డై హార్డ్ ఫ్యాన్‌గా నటిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు. నవంబర్ 28న విడుదలయ్యే 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్.

ఇలాంటి చిత్రాలు చేయడానికి ధైర్యం కావాలి



-శేఖర్ కమ్ముల

తిరువీర్, టీనా శ్రావ్య జంటగా నటిస్తున్న చిత్రం 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'. సందీప్ అగరం, అస్మితా రెడ్డి నిర్మిస్తున్నారు. నవంబర్ 7న చిత్రం విడుదలవుతోంది. తాజాగా చిత్రం టీజర్‌ను హీరో విజయ్‌దేవర కొండ, దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఈ టీమ్ అందరిలో మంచి వైబ్ ఉంది. తిరువీర్ ఈ తరహా సినిమాలు మరిన్ని చేయాలి. ఇలాంటి కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలు చేయడానికి నిర్మాతలకు ధైర్యం కావాలి' అని అన్నారు. 'ఈ కథ విన్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా' అని తిరువీర్ చెప్పారు.

కల్కి సీక్వెల్ నుంచి దీపిక ఔట్!



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఏడీ'లో బాలీవుడ్ హీరోయిన్ దీపిక పడుకొనే కీలక పాత్రను పోషించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా సీక్వెల్‌లో ఆమె ఉండరని నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ గురువారం ప్రకటించింది. 'జాగ్రత్తగా ఆలోచించిన తర్వాత మేం ఒక నిర్ణయానికి వచ్చాం. 'కల్కి' సీక్వెల్‌లో దీపికా భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. గొప్ప టీమ్‌తో 'కల్కి' సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపికా మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం' అని పేర్కొంది. సినిమాలో అత్యంత కీలకమైన పాత్ర నుంచి ఆమె తప్పించడంతో ప్రస్తుతం ఈ విషయం టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది. దీపిక ఆమె పారితోషికాన్ని 25 శాతం పెంచడం, దాదాపు 25 మంది ఉన్న తన టీమ్‌కు ఫైవ్‌స్టార్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేయడం, షూటింగ్‌కు రోజుకు 7 గంటలు మాత్రమే హాజరవుతాననే షరతు పెట్టడం... ఆమెను 'కల్కి2' నుంచి తొలగించడానికి గల కారణాలు ఇవే అయ్యుండొచ్చని అందరూ అనుకుంటున్నారు. ప్రభాస్ లాంటి అగ్రకథానాయకుడే పార్ట్2కు ఫీజు పెంచకపోవడం, భారీ తారాగణంతో పాటు ఎంతో బడ్జెట్‌తో కూడిన ఈ ప్రాజెక్ట్‌కు ఆమె అంత లిమిటెడ్ టైమ్ కేటాయించడంతో ఏకీభవించని నిర్మాతలు ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చని సమాచారం. ఇప్పుడు ఆ పాత్రకు ఎవరిని ఎంపిక చేస్తారనే ఆసక్తికరమైన చర్చ మొదలైంది.

ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన కథ

- అంకిత్ కొయ్య



'ఈ సినిమా పేరును, లోగోను డైరెక్టర్ మారుతి డిజైన్ చేశారు. ఈ చిత్ర కథ విని షాక్‌కు గురయ్యాను. నాకు కథ చాలా బాగా నచ్చింది. ఈ చిత్రం ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది' అని అన్నారు కథానాయకుడు అంకిత్ కొయ్య. ఆయన కథానాయకుడిగా జేఎస్ఎస్ వర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'బ్యూటీ'. నీలఖి కథానాయిక. విజయ్‌పాల్ రెడ్డి అడిదల, ఉమేశ్ కుమార్ భన్సల్ నిర్మించారు. సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా అంకిత్ కొయ్య మీడియాతో ముచ్చటించారు.

- ఇంతకు మునుపెన్నడూ నటించని పాత్రలో నన్ను చూస్తారు. అర్జున్ పాత్రకు కావల్సినట్టుగా నటించాను.
- ఈ సినిమాకు వీకే నరేశ్ గారే హీరో. ఆయన పాత్ర నాకు బాగా నచ్చింది. ఓ మధ్యతరగతికి చెందిన తండ్రిగా నరేశ్ నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతారు. ఈ మూవీకి ప్రధాన బలం కూడా ఆయనే.
- ఆలేఖ్య పాత్రలో నీలఖి అద్భుతంగా నటించారు. దర్శకుడు వర్ధన్‌తో కథా చర్చల్లో నేను కూడా పాల్గొన్నాను. ప్రతీ చిన్న విషయాన్ని చాలా విస్తృతంగా చర్చించుకునే వాళ్లం. డైరెక్టర్ కథను అద్భుతంగా హ్యాండిల్ చేశారు. ప్రతి పాత్రకు న్యాయం చేకూర్చారు.




కథ విని షాక్ అయ్యా

-సాయిరాజేశ్

చంద్రహాస్ కథానాయకుడిగా జైరామ్ చిటికెల దర్శకత్వంలో శ్రీకాంత్ రాజారత్నం నిర్మిస్తున్న చిత్రం 'కాయిన్'. బుధవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను, గ్లింప్స్‌ను దర్శకుడు సాయిరాజేశ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కాయిన్' చుట్టూ ఇంత జరిగిందా అని ఈ సినిమా కథ విన్నప్పుడు షాక్ అయ్యా. సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'యదార్థ సంఘటనల స్ఫూర్తిగా కాయిన్స్ నేపథ్యంలో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ ఇది' అని చంద్రహాస్ చెప్పారు.

స్వేచ్ఛ కోసం పోరాటం



మలయాళ చిత్ర రంగ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ నటిస్తున్న తాజా చిత్రం 'వృషభ'. రచయిత, దర్శకుడు నందకిశోర్ రూపొందిస్తున్న ఈ భారీ చిత్రాన్ని ఏక్తా కపూర్ మరో ఎనిమిది మంది నిర్మాతలతో కలసి నిర్మిస్తుండడం విశేషం. చిత్రం టీజర్ విడుదలైన సందర్భంగా నిర్మాత ఏక్తా కపూర్ మాట్లాడుతూ 'మా బాలాజీ సంస్థలో ఎప్పుడూ పవర్‌ఫుల్ కంటెంట్‌ను అందించడానికి ప్రయత్నిస్తుంటాం. అలా మా అందరికీ నచ్చిన ప్రాజెక్ట్ 'వృషభ'. స్వేచ్ఛ కోసం పోరాటం ఈ చిత్రకథ' అని చెప్పారు. 'లెజండరీ మోహన్‌లాల్‌తో కలసి పని చేయడం ఆనందంగా ఉంది. ఆయన కొడుకుగా సమర్జిత్ నటించారు. తండ్రీకొడుకుల చుట్టూ తిరిగే శక్తిమంతమైన కథ' అని చెప్పారు దర్శకుడు నందకిశోర్. మలయాళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ దీపావళికి రిలీజ్ చేయనున్నారు.

హీరోగా యూట్యూబర్




యూట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహా కథానాయకుడిగా సాద్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంగీత్'. నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, స్రవంతి నవీన్ నిర్మిస్తున్నారు. గురువారం 'సంగీత్' చిత్రం నుంచి స్పెషల్ గ్లింప్స్ విడుదల చేశారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ తుది దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

అందర్నీ ఆకట్టుకుంటుంది

-రాజు నాయక్



'టన్నెల్' సినిమాను చెన్నైలో చూశాను. అద్భుతంగా అనిపించింది. ఇలాంటి చిత్రాన్ని తెలుగువారికి అందించాలనే తెలుగులో విడుదల చేస్తున్నాను' అని అన్నారు నిర్మాత ఏ. రాజు నాయక్. అథర్వ మురళీ హీరోగా నటించిన 'టన్నెల్' చిత్రం నేడు విడుదలవుతున్న సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ 'ఈ మధ్య కాలంలో నాకు విపరీతంగా నచ్చిన సినిమా ఇదే. ఇందులోని కథంతా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. సైకో నుంచి పోలీసుల్ని హీరో ఎలా కాపాడతాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు సినిమాను ఎడ్జ్ ఆఫ్ ద సీట్ థ్రిల్లర్‌గా మలిచాడు. చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది అనే నమ్మకం ఉంది' అని చెప్పారు.














జగన్ అప్పులు తెచ్చారు.. లోకేశ్ పెట్టుబడులు తెచ్చారు

ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా జగన్ ఎలా మానేశాడో.. గత ప్రభుత్వంలో ప్రజా పాలనను కూడా అలాగే గాలికి వదిలేశాడు. కేంద్రం ఇచ్చిన నిధుల్ని కూడా పూర్తిగా ఖర్చు పెట్టలేకపోయిన అసమర్థ ప్రభుత్వాన్ని నడిపిన జగన్‌కు మెడికల్ కాలేజీల గురించి మాట్లాడే అర్హత లేదు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు చేపడతామంటే.. ప్రైవేటీకరణ చేస్తున్నామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. జగన్ ఐదేళ్లలో రూ.10లక్షల కోట్ల అప్పులు చేస్తే.. మంత్రి లోకేశ్ లండన్ వెళ్లి రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తున్నారు. వైసీపీ ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి ఉన్న తేడా ఇది. విజనరీ లీడర్ చంద్రబాబు సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వినలేక, తట్టుకోలేక జగన్ అసెంబ్లీకి రావట్లేదు. ప్రజాసమస్యలపై చర్చించడానికి జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రావాలి.

-జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టండి

మీ నియోజక వర్గాల్లో సమస్యలపై నివేదిక ఇవ్వండి

శాంతిభద్రతలు, సోషల్ మీడియాపైనా చర్చించండి

- 3 రోజుల్లో మళ్లీ కలుద్దాం
- నేరుగా మంత్రులతోనే మాట్లాడదాం
- ఎమ్మెల్యేలతో డిప్యూటీ సీఎం పవన్


జనసేన ఎమ్మెల్యేలతో సమావేశమైన ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో సంక్షేమంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి పనులపై కూడా చర్చించాలని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం జనసేన శాసన సభ పక్ష కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలపై చర్చించారు. 'ఎమ్మెల్యేలంతా సభలో జరిగే చర్చల్లో కచ్చితంగా పాల్గొనాలి. సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలి. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు మనం చేయవద్దు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపడితేనే ప్రజలు మళ్లీ చాన్స్ ఇస్తారు. కాబట్టి ఎమ్మెల్యేలు అన్ని అంశాలపై అవగాహన కల్పించుకుని సభలో జరిగే చర్చల్లో పాల్గొనాలి. రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా పూర్తిస్థాయిలో నియంత్రణలోకి రాలేదు. శాంతిభద్రతల సమస్యా ఉంది. దీనిపై సభలో చర్చించండి. సోషల్ మీడియాలో విచ్చలవిడిగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ చేస్తున్న వ్యాఖ్యలు అందరికీ ఇబ్బందికరంగానే తయారయ్యాయి. ఈ అంశంపై సీరియస్‌గా స్పందించాలి' అని పవన్ సూచించారు.మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పలు సూచనలు చేశారు.

ఎమ్మెల్యేలతో ముఖాముఖి...

సమావేశం అనంతరం ఒక్కొక్క ఎమ్మెల్యేతో పవన్ వ్యక్తిగతంగా మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ఏమిటి? వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు ఏమిటి? జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో సంబంధాలు ఎలా ఉన్నాయి? వారి నుంచి అందుతున్న సహకారం .. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ సమగ్ర చిత్రాన్ని రెండు రోజుల్లో రాతపూర్వకంగా ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోగా మరోసారి సమావేశం నిర్వహిస్తామని వారికి స్పష్టం చేశారు. ఈలోగా తమ చేతికి వచ్చిన నివేదికల ఆధారంగా మంత్రులతో నేరుగా మాట్లాడతామని చెప్పారు. సమస్య పరిష్కారానికి నిర్దిష్ట కాల పరిమితిని నిర్ణయిస్తామని తెలిపారు.

తొలిసారి మండలికి నాగబాబు

మండలి సభ్యుడిగా నాగబాబు తొలిసారి హాజరయ్యారు. గురువారం ఉదయం అసెంబ్లీకి వచ్చిన ఆయన తొలుత జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తొలిసారి మండలిలోకి అడుగుపెడుతున్న అన్నయ్యను పవన్ కల్యాణ్ ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు. నాగబాబు రాకతో మండలిలో ఆ పార్టీ సభ్యుల సంఖ్య రెండుకు పెరిగింది. ఇప్పటికే మండలిలో ఉన్న పిడుగు హరిప్రసాద్ పదవీ కాలం మార్చి 2027 వరకూ ఉండగా... నాగబాబు 2031 మార్చి వరకూ ఎమ్మెల్సీగా కొనసాగుతారు.







యూరియాపై ఎన్ని గంటలైనా చర్చిద్దాం

ప్రభుత్వం పారిపోవడంలేదు.. రైతుకోసం ఎవరేం చేశారో తేల్చేద్దాం

మంత్రి అచ్చెన్న స్పష్టీకరణ.. ఇప్పుడే..ఇక్కడే చర్చించాలన్న వైసీపీ

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యూరియా, ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై ఎన్ని గంటలు చర్చించడానికైనా సిద్ధంగా ఉన్నామని, ఎక్కడకూ ప్రభుత్వం పారిపోవడం లేదని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అయితే, ఇప్పుడే.. ఇక్కడే..చర్చించాలంటూ వైసీపీ సభ్యులు మొండి పట్టుపట్టడంతో శాసనమండలిలో ఈ అంశంపై వాగ్వాదం సాగింది. యూరియా సరఫరాతోపాటు వ్యవసాయ ఉత్పత్తులపై సభలో చర్చించాలని గురువారం మండలి ప్రారంభమైన వెంటనే వైసీపీ సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారు. చైర్మన్ మోషేన్‌రాజు దానిని తిరస్కరించారు. దీంతో వైసీపీ సభ్యులు సభలో వెల్‌లోకి వెళ్లి నిరసన తెలిపారు. పోడియంపైకి ఎక్కి ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు స్పందించారు. "రైతులకు యూరియా సరఫరాతోపాటు వ్యవసాయ ఉత్పత్తులపై సభలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం జరిగే బీఏసీలో దీనిపై నిర్ణయం తీసుకుని, ఎన్ని గంటలైనా చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం." అని వివరించారు. ప్రభుత్వం చర్చించడానికి సిద్ధంగా ఉందని మంత్రి, చైర్మన్ చెబుతున్నా వినకుండా వైసీపీ సభ్యులు వెల్‌లో నినాదాలు చేశారు. ఈ సమయంలో వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదం జరగడంతో చైర్మన్ సభను వాయిదా వేశారు. అనంతరం తిరిగి 10.31 గంటలకు ప్రారంభమైంది. మళ్లీ వైసీపీ సభ్యులు వెల్‌లోకి వెళ్లారు. ఈ సమయంలో మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ స్పందించారు. "యూరియా చాలా ముఖ్యమైన అంశం. ప్రభుత్వం తయారుగా ఉన్నప్పుడు ఎల్లుండిదాకా వాయిదా వేయడం ఎందుకు? అన్నీ రద్దు చేసి ఇప్పుడే చర్చించాలి. గతంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కిన సందర్భాలు ఉన్నాయా?" అని ఆవేశంగా ప్రశ్నించారు. దీనిపై అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఏం చేసింది, తమ ప్రభుత్వం 15 నెలల కాలంలో ఏం చేసిందనే విషయాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మరోసారి చైర్మన్ చెప్పడంతో వైసీపీ సభ్యులు నిరసన విరమించి కూర్చున్నారు.

హిందూ ధర్మాన్ని కాలరాసిన వైసీపీ

- రాజీనామా చేయాలంటే ఆ పని ముందు వైసీపీ సభ్యులే చేయాలి
- తిరుపతి, సింహాచలం ఘటనలపై ఆనం, బొత్స వాగ్వాదం



అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో హిందూ ధర్మం ప్రమాదంలో పడిందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి మండిపడ్డారు. తిరుపతి, సింహాచలం ఘటనలను బాధ్యత వహించిన మంత్రి రాజీనామా చేయాలని వైసీపీ సభ్యులు సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. దీంతో గురువారం శాసనమండలిలో అధికార, విపక్షాల మధ్య వాడీవాడీగా మాటల యుద్ధం సాగింది. సభ ప్రారంభం కాగానే దేవాలయాల నిర్వహణలో ప్రభుత్వం, ఆ శాఖ మంత్రి ఆనం విఫలం చెందారంటూ వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. రెండు రోజులు ఉన్న వైకుంఠ ఏకాదశి కార్యక్రమాన్ని పదిరోజులకు పెంచిన కారణంగానే తిరుపతిలో తొక్కిసలాట జరిగి, భక్తులు ప్రాణాలు పోగొట్టుకున్నారని మంత్రిపై ఆరోపణలు చేశారు. దీనిపై మంత్రి దీటుగా స్పందించారు. "గతంలో కొన్ని స్వార్థపరశక్తులు టికెట్ కౌంటర్లను తిరుపతికి తెచ్చారు. తొక్కిసలాటకు ఇదీ ఓ కారణం. వాళ్లు (గత వైసీపీ పాలకులు) చేసిన పాపాలను మేం సరిదిద్దుతున్నాం. ఒకవేళ రాజీనామా చేయాల్సి వస్తే, అప్పట్లో ఆలయాల విషయంలో చేసిన పాపాలకు ముందుగా వైసీపీ సభ్యులందరూ వైదొలగాలి. ఆ తర్వాతే నేను రాజీనామా చేస్తా"నని ఆనం కౌంటర్ ఇచ్చారు. దాడులు జరపడం..ధ్వంసం చేయడమే మీ పరామర్శా.. అంటూ ధ్వజమెత్తారు. అప్పట్లో తిరుపతిలో వైసీపీ నేతల పరామర్శ ఓ దాడిలా జరిగిందని... జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ ఆస్పత్రులపై దాడులు చేశారని మండిపడ్డారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు కమిషన్ వేసిందని, అది ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు కూడా తీసుకుందని మంత్రి తెలిపారు. కాగా, తిరుపతిలో విగ్రహం వివాదంపై మండలిలో ఆనం ప్రకటన చేశారు. దీనిపై వైసీపీనేత భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. "తిరుపతిలో 22 ఏళ్ల క్రితం తన తండ్రి సూచనల మేరకు శనీశ్వరుడి విగ్రహాన్ని చెక్కానని శిల్పి తెలిపారు. అయితే ఆయన చెక్కిన శిల్పం అసంపూర్తిగా అలాగే ఉండిపోయింది. ఈ వ్యవహారంలో భూమనపై కేసు నమోదైంది" అని వివరించారు. భక్తులు ఇచ్చే నిధులు, ఆలయ నిధులతో 300 దేవాలయాలను కూటమి ప్రభుత్వం పునర్నిర్మాణం చేస్తుందని మంత్రి తెలిపారు. అయితే, తిరుమలలో రాబోయే కాలంలో వైకుంఠ ఏకాదశి ఏవిధంగా ఉండబోతోందో చెప్పాలని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఆ విషయం వదిలేసి.. జగన్ అంశాన్ని తీసుకురావడం ఏమిటంటూ.. తమ సభ్యులతో కలిసి ఆయన వాకౌట్ చేశారు.

క్యాబినెట్ భేటీ నేటికి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిమండలి సమావేశం శుక్రవారానికి వాయిదా పడింది. శుక్రవారం మధ్యాహ్నం 1.45 గంటలకు ముఖ్యమంత్రి నేతృత్వంలో అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో క్యాబినెట్ భేటీ జరగనుంది. గురువారమే ఈ సమావేశం జరగాల్సి ఉన్నా జీఎస్టీపై చర్చ, దానిపై సీఎం మాట్లాడాల్సి ఉండటంతో వాయిదా వేశారు.


గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో బుధవారం అర్ధరాత్రి అధికారులు స్వాధీనం చేసుకున్న మరో యూరియా లోడు లారీ

యూరియా అక్రమ రవాణా గుట్టురట్టు

- కాకినాడ జిల్లాలో 548 బస్తాలతో 2 లారీల పట్టివేత
- పోలీసుల అదుపులో డీలర్ సహా నలుగురు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామ శివారులో అక్రమంగా వచ్చిన ఎరువుల లారీలను విజిలెన్స్, వ్యవసాయాధికారులు పట్టుకున్నారు. వాస్తవానికి సహకార సొసైటీలకు, ప్రైవేటు డీలర్లకు నేరుగా ప్రభుత్వమే యూరియాను స్థానిక వ్యవసాయశాఖ సమన్వయంతో సరఫరా చేస్తోంది. కానీ ఇక్కడ వ్యవసాయశాఖ అధికారులకు తెలియకుండానే సరుకు నేరుగా వచ్చేసింది. తాటిపర్తి నాగదుర్గా ఏజెన్సీస్, దుర్గా సరస్వతి ట్రేడర్స్‌కు కోనసీమ జిల్లా ద్వారపూడి ప్రాంతం నుంచి ఈ స్టాకు వేర్వేరుగా లారీల్లో వచ్చినట్లు సమాచారం. ఒక లారీలోని సరుకును మార్గమధ్యంలోనే దించి, ఒక్కోబస్తా రూ.400పైబడి విక్రయించగా, కొనుగోలుదారులు ఆటోలు, ట్రాక్టర్లు, మోటార్‌సైకిళ్ల ద్వారా పట్టుకుపోయారు. యూరియా నిల్వలను నిర్దేశించిన ప్రాంతాల్లో కాకుండా, అక్రమ రవాణా, బ్లాక్‌మార్కెట్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విజిలెన్స్, వ్యవసాయ అధికారులు నిర్ధారణకు వచ్చారు. రెండు లారీలతోపాటు అందులో ఉన్న 548 బస్తాల యూరియాను బుధవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. నాగదుర్గా ఏజెన్సీస్ అధినేత దాసం శ్రీనివాస్, హెల్పర్ కర్రెడ్ల కనకవీరబాబు, డ్రైవర్లు కొటారి రాంబాబు, గుత్తుల దుర్గారావులపై కేసు నమోదు చేశామని.. వారిని అరెస్టు చేస్తామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. నాగదుర్గా ఏజెన్సీస్ లైసెన్స్ కూడా రద్దు చేశారు.

5 ప్రధాన ఆలయాలకు చైర్మన్లు

- శ్రీశైలం దేవస్థానానికి పోతుగుంట రమేశ్‌నాయుడు
- దుర్గమ్మ ఆలయానికి బొర్రా రాధాకృష్ణ నియామకం

అమరావతి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు ప్రధాన ఆలయాలకు చైర్మన్లను నియమిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్‌గా పోతుగుంట రమేశ్ నాయుడు, శ్రీకాళహస్తిలోని శ్రీ కాళహస్తీశ్వర స్వామి ఆలయానికి కొట్టె సాయిప్రసాద్, కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి వి.సురేంద్ర బాబు (మణినాయుడు), విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయానికి బొర్రా రాధాకృష్ణ (గాంధీ), వాడపల్లిలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజు నియమితులయ్యారు. అలాగే టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీలకు అధ్యక్షులను నియమించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ హిమాయత్‌నగర్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై, విశాపట్నంలోని కమిటీలకు వరుసగా.. ఏవీ రెడ్డి, నేమూరి శంకర్ గౌడ్, వీరాంజనేయులు, ఎదుగుండ్ల సుమంత్ రెడ్డి, గౌతమ్ సింగానియా, వెంకట పట్టాభిరామ్ చోడే నియమితులయ్యారు.

రంగంలోకి ఈడీ!

(మొదటి పేజీ తరువాయి)

ఇదివరకే ఈడీతో పంచుకుంది. ఈ నేపథ్యంలోనే ఈడీ నేరుగా రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లో... ఏ-1 రాజ్ కసిరెడ్డి భార్య పైరెడ్డి దివ్యా రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న ఆరేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌ెస్‌లో సోదాలు జరిపింది. అదే సంస్థలో మరో డైరెక్టర్‌గా ఉన్న తీగల విజయేందర్ రెడ్డితో రాజ్ కసిరెడ్డి ఏర్పాటు చేయించిన యూవీ డిస్టిలరీస్‌లోనూ తనిఖీలు నిర్వహించింది. నకిలీ ఇన్వాయిస్‌ల కోసం మద్యం ముఠా సృష్టించిన ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, వెంకటేశ్వర ప్యాకేజింగ్‌లాంటి కంపెనీల అసలు గుట్టును ఈడీ వెలికి తీసినట్లు సమాచారం. హైదరాబాద్‌లోనే వెస్ట్ మారేడ్‌పల్లి వెల్లింగ్టన్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న బూరుగు రమేశ్, ఆయన కుమారుడు విక్రాంత్ నివాసాల్లో ఏడు గంటలకు పైగా సోదాలు జరిపింది. మహదేవ్ జువెలర్స్‌తోపాటు రాజశ్రీ ఫుడ్స్‌లో విక్రాంత్ డైరెక్టర్‌గా ఉన్నారు. హైదరాబాద్‌లోనే వెంకటేశ్వర ప్యాకేజింగ్, సువర్ణదుర్గ బాటిల్స్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, ఎస్ఆర్ ఉద్యోగ్ ఎల్ఎల్‌పీ తదితర సంస్థల్లోనూ సోదాలు జరిగాయి.

చెన్నైలో..

చెన్నైలోని ది ఇండియా ఫ్రూట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మోహన్‌లాల్ జువెలర్స్ (చెన్నై)లో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. మద్యం రవాణా సంస్థ 'సిగ్మా' ప్రధాన కార్యాలయమున్న నోయిడాలోనూ తనిఖీలు జరిపారు. అప్పట్లో డిస్టిలరీల నుంచి మద్యం డిపోలకు, దుకాణాలకు మద్యం రవాణా చేసే కాంట్రాక్టు 'సిగ్మా'కు దక్కింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరఫరా అయిన మద్యం పరిమాణం, ప్రభుత్వానికి జమ అయిన నగదు లెక్కలు తేల్చడంపై ఈడీ దృష్టి సారించినట్లు సమాచారం.

కీలక ఆధారాలు లభ్యం...

మనీ లాండరింగ్‌కు సహకరించిన వ్యాపారుల గోదాములలో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. నకిలీ ఇన్వాయిస్‌లు, కొనుగోలు చేయని బిల్లులు, ఆయా వ్యాపార సంస్థల ఆడిట్ వివరాల రికార్డులు, నగదు లావాదేవీలు, ఇతర కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ డేటాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. డొల్ల కంపెనీల లావాదేవీలు, తప్పుడు బిల్లుల పూర్తి ఆధారాలను సేకరించినట్లు సమాచారం.

'సిట్' నుంచి సమాచారం...

మద్యం స్కామ్‌పై 'సిట్' లోతుగా దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే... పొరుగు రాష్ట్రాల కంపెనీలు, షెల్ కంపెనీలు, హవాలా లింకులు అనేకం బయటపడ్డాయి. ఎక్సైజ్ విధానం దుర్వినియోగం, లిక్కర్ బ్రాండ్ల మానిప్యులేషన్, ముడుపుల స్వీకరణ మొదలుకొని మద్యం ముడుపుల వెనుక కీలకంగా ఉన్న మనీ రూటింగ్‌ను 'సిట్' పసిగట్టింది. ఈ స్కామ్‌లో కీలకంగా వ్యవహరించిన మాజీ సీఎం జగన్ ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి(ఏ-1) రిమాండ్ రిపోర్టులోనే మనీలాండరింగ్ అంశాన్ని ప్రస్తావించింది. దీనిపై ఈడీ అధికారులు స్పందించి 'సిట్' అధిపతి రాజశేఖర్ బాబు(విజయవాడ పోలీస్ కమిషనర్)కు మే మొదటి వారంలో లేఖ రాశారు. లిక్కర్ స్కామ్ కేసు ఎఫ్ఐఆర్ కాపీతోపాటు అప్పటి వరకూ దర్యాప్తులో లభించిన ఆధారాలు అందజేయాల్సిందిగా కోరారు. ఈ వివరాలు అందిన అనంతరం... పీఎంఎల్ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్) సెక్షన్ల కింద మే 24న ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేశారు. విజయవాడ జైల్లో ఉన్న రాజ్ కసిరెడ్డిని మూడు రోజులపాటు కోర్టు అనుమతితో ప్రశ్నించారు. కమీషన్లు దండుకునేందుకు వీలుగా ఎక్సైజ్ పాలసీని రూపొందించడం, ముడుపులను మధ్యవర్తుల ద్వారా మనీ రూటింగ్ చేయడం వంటి వివరాలను రాబట్టారు. దీని ఆధారంగా దర్యాప్తు చేపట్టి నాలుగు నెలలపాటు పలు ఆధారాలు సేకరించి గురువారం తెల్లవారుజాము నుంచి సోదాలు జరిపారు.

వందల కోట్ల హవాలా..

"మాది మద్యం వ్యాపారం. మా బ్రాండ్ మార్కెట్ పెంచుకోవడానికి బంగారం కాయిన్లు కొన్నాం' అంటూ కట్టుకథలు చెప్పిన మద్యం వ్యాపారులు ఈడీ విచారణలో అసలు గుట్టు విప్పారు. బంగారం కొన్నట్లు చూపించిన బిల్లులన్నీ నకిలీవేనని, ఉత్తుత్తి ఇన్వాయిస్‌లు చూపించి మద్యం ముడుపుల్ని వైట్ మనీగా మార్చుకున్నట్లు తేలింది. మరింత లోతుగా ఆరా తీయడంతో హవాలా రూపంలో దుబాయ్, హాంకాంగ్ మీదుగా ఆఫ్రికాకు తరలించి అక్కడ మైనింగ్ వ్యాపారం చేసినట్లుగా చూపించి, అదే డబ్బును తిరిగి భారత్‌కు తీసుకురావాలని ప్లాన్ వేశారు. అయితే అక్కడ మైనింగ్ వ్యాపారమేదీ లేదని, ఉత్తుత్తి లావాదేవీలు చూపించి, ముడుపుల సొమ్మును వైట్ చేయించుకునేందుకే ఈ స్క్రిప్టు రాశారని ఈడీ గుర్తించింది.

జగన్ అప్రమత్తం...

మద్యం స్కామ్‌లో అనూహ్యంగా ఈడీ రంగంలోకి దిగి... ఐదు రాష్ట్రాల్లో సోదాలు జరపడంతో 'తాడేపల్లి క్యాంప్' ఉలిక్కి పడినట్లు సమాచారం. తాజా పరిణామాలపై కొందరు సీనియర్ న్యాయవాదులతో జగన్ సమావేశమై సమీక్షించినట్లు తెలిసింది.


కొత్తకాలువలోని రైతు అంకిరెడ్డి ఇల్లు

రైతు ఇంట్లో 'కంపెనీ'

ఇది... తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కొత్తకాలువ గ్రామానికి చెందిన రైతు అంకిరెడ్డి ఇల్లు! లెక్క ప్రకారం... ఈ చిరునామాలో ఒక కంపెనీ ఉండాలి. రికార్డుల్లో 'అంకిరెడ్డి' పేరుతో ఇదే ఇంట్లో ఒక కంపెనీ ఏర్పాటైంది. ఈ కంపెనీ మద్యం కుంభకోణంతో సంబంధమున్న ఒక నేత బినామీదనే సమాచారంతో... గురువారం ముగ్గురు ఈడీ అధికారులు దీనిని వెతుక్కుంటూ వచ్చారు. గూగుల్ మ్యాప్స్ సహాయంతో అక్కడికి చేరుకున్నారు. తీరా చూస్తే... అక్కడ ఎలాంటి కంపెనీ లేదు! ఈడీ సేకరించిన సమాచారం ప్రకారం... కంపెనీ యజమాని పేరు అంకిరెడ్డే! కానీ... ఆధార్ ప్రకారం ఇక్కడున్న అంకిరెడ్డి తండ్రి పేరు సరిపోలలేదు. తమ పూర్వీకుల నుంచి ఇదే ఇంట్లో ఉంటున్నామని అంకిరెడ్డి స్పష్టం చేశారు. కొన్ని నెలల కిందటే తాను గుండె ఆపరేషన్ చేయించుకున్నాని తెలిపారు. ఆయన నుంచి ప్రాథమిక వివరాలు సేకరించి ఈడీ అధికారులు వెళ్లిపోయారు. తన ఇంటి చిరునామాతో బోగస్ కంపెనీ సృష్టించినట్లు తనకు తెలియదని అంకిరెడ్డి తెలిపారు. ఈడీ అధికారుల రాకతో ఆందోళనకు గురయ్యానని చెప్పారు.

- తిరుపతి (నేరవిభాగం)

ఉల్లి కిలో 50 పైసలు!


కర్నూలు మార్కెట్ యార్డులో కుళ్లిపోయిన ఉల్లి బస్తాలు

(మొదటి పేజీ తరువాయి)

క్వింటా రూ.400 పలికింది. ఎక్కువ శాతం రూ.100లోపే కొనుగోలు చేశారు. బహిరంగ వేలంలో పాల్గొన్న వ్యాపారులు ముందే కుమ్మక్కై, ఇలా అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి 6,057 టన్నులు (60,570 క్వింటాళ్లు) ప్రభుత్వం సేకరించింది. అందులో 3,707 టన్నులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని రైతు బజార్లకు సరఫరా చేయగా.. మరో 2,350 టన్నుల ఉల్లి బస్తాలు కర్నూలు మార్కెట్‌లోనే గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లిని కనీసం టెండరుకు ఉంచేందుకు స్థలం కూడా లేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలకు కర్నూలు మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో క్వింటా కనిష్ఠంగా రూ.50 నుంచి గరిష్ఠంగా రూ.400 వరకూ ధర పలికింది. ఎక్కువశాతం క్వింటా రూ.100 పలికింది. ఇలా మొత్తం 492 టన్నులు (4,920 క్వింటాళ్లు) మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. వ్యాపారులు వ్యూహం ప్రకారమే వేలంలో పోటీ పడకపోవడంతో వచ్చినకాడికి ఇచ్చేయాల్సి వచ్చింది. దీంతో మార్క్‌ఫెడ్‌కు కిలోకు రూపాయి కూడా రాలేదు. కాగా, ఇదే ఉల్లిని వ్యాపారులు బయట కిలో రూ.10-20కు పైగా విక్రయిస్తున్నారు. కర్నూలులో బహిరంగ మార్కెట్‌లో నాలుగు కిలోలు రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. కాగా, ప్రభుత్వం సేకరించిన ఉల్లి బస్తాలను సకాలంలో బయటకు తరలించకపోవడంతో నిల్వచేసిన ప్లాట్‌ఫాం, గోదాముల్లోనే దాదాపు 200 టన్నులు ఉల్లి కుళ్లిపోతోందని అధికారులు తెలిపారు. అలా కుళ్లిన వంద టన్నుల ఉల్లిని డంపింగ్ యార్డులకు తరలించారు.

నీట్ - పీజీ సీట్లపై సుప్రీంకు ట్రాన్స్‌జెండర్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నీట్ - పీజీ సీట్లలో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు వర్తింపజేయాలనే అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అఖిల భారత స్థాయిలో రెండు సీట్లు, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కో సీటు కేటాయించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో తీర్పు ఉన్నప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ గురువారం సీజేఐ, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదనలు వినిపిస్తూ నీట్ పీజీ కౌన్సెలింగ్ వాయిదా వేయాలని కోరారు.

ఆంధ్రజ్యోతి



మండలికి వచ్చి.. సభకు రారా?

» వైసీపీ సభ్యుల తీరుపై ఆదోని ఎమ్మెల్యే ఎద్దేవా

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ సభ్యులు శాసనమండలికి వచ్చి, అసెంబ్లీకి రాకపోవడం సరికాదని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పీవీ పార్థసారథి అన్నారు. రెండు నాలుకలు, రెండు తలలు చందంగా వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. గురువారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ 'దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించడం లేదు. పార్టీ అంటే ఒకే విధానం ఉండాలి. 11 మంది ఎమ్మెల్యేలూ జీతభత్యాలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకుని, టోల్ గేట్‌ల వద్ద ఫీజు మినహాయింపులు పొందుతున్నారు. ఎమ్మెల్యేలుగా అన్ని హక్కులూ ఉపయోగించుకుంటూ, సభకు రాకపోవడం సిగ్గుచేటు. కనీసం వారి నియోజకవర్గాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించవచ్చుకదా? ఇంట్లో కూర్చొని ప్రెస్‌మీట్లు పెడితే.. మేమూ మీలా ప్రెస్‌మీట్లు పెట్టి, మీ గురించి చెప్పాల్సి వస్తుంది' అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాలు కనీసం 30రోజులు నిర్వహించాలని స్పీకర్‌ను కోరినట్లు చెప్పారు.

జీఎస్టీ 2.0 గేమ్‌చేంజర్



(మొదటి పేజీ తరువాయి)

140 కోట్ల ప్రజలకు మేలు చేస్తున్న ప్రధాని మోదీని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామంటూ చంద్రబాబు తీర్మానం చదివి వినిపించారు. అనంతరం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జీఎస్టీ 2.0 సంస్కరణలకు ఆమోదం తెలుపుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని సభ్యులందరూ ఆమోదించినట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రకటించారు. జీఎస్టీ సంస్కరణలు అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు మేలుచేసే అత్యద్భుతమైన సంస్కరణలని సీఎం చర్చ సందర్భంగా చెప్పారు. వీటికి మద్దతిచ్చిన మొదటి రాష్ట్రం మనదేనన్నారు. 'ఈ ఏడాది 4.19 ట్రిలియన్ డాలర్ల జీడీపీ, 2,880 డాలర్ల తలసరి ఆదాయం, 760 బిలియన్ డాలర్ల ఎగుమతుల స్థాయికి దేశం ఎగబాకింది. 2014లో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశాన్ని ప్రధాని మోదీ 11 ఏళ్లలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దారు. మరో రెండేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం. ఎర్నెస్ట్ అండ్ యంగ్ నివేదిక ప్రకారం 2038 నాటికి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది. ఇంత ఉజ్వల అభివృద్ధికి కారణం సరైన సమయంలో సరైన వ్యక్తి మోదీ రూపంలో మన దేశానికి ప్రధాన మంత్రి కావడమే' అని ప్రశంసించారు. ఆయన దేశానికి సంపదన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

మద్దతివ్వాల్సింది పోయి.. పారిపోతారా..?

ఇన్ని భారీ సంస్కరణలు జరుగుతుంటే వైసీపీ ఎమ్మెల్యేలు మద్దతివ్వాల్సిందిపోయి అసెంబ్లీకి రాకుండా పారిపోయారు. ప్రజలకు మేలుచేసే సంస్కరణలకు మద్దతివ్వడం ఇష్టం లేకపోతే.. కనీసం అర్థం చేసుకునే ప్రయత్నమైనా చేయాలి. సంపద సృష్టించలేని వారికి సంక్షేమం ఇచ్చే అధికారం లేదు. అప్పులు చేసి సంక్షేమం ఇస్తే మనుగడ ఉండదు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యం.

ప్రభుత్వానికి రూ.800 కోట్లు మిగులు

జీఎస్టీ 2.0లో భాగంగా ఆరోగ్య బీమా ప్రీమియంపై ఉన్న 18 శాతం పన్నును తీసివేయడం వల్ల ప్రభుత్వం ప్రతిపాదించిన యూనివర్సల్ హెల్త్‌కేర్ పథకానికి రూ.800 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉంది. 2 శ్లాబుల పన్ను విధానం, ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్లు చిన్నవ్యాపారాలకు మార్గం సుగమం చేస్తాయి. రా మెటీరియల్స్, ప్యాకేజింగ్, వ్యవసాయ వస్తువులపై పన్ను తగ్గడం వల్ల ఆత్మనిర్భర్ భారత్ ఊపందుకుంటుంది. మూడ్రోజుల్లో ఆటోమేటిక్‌గా వ్యాపారాల రిజిస్ట్రేషన్ వల్ల కార్యకలాపాలు వేగంగా జరుగుతాయి. రాష్ట్రాల మధ్య సరిహద్దు చెక్‌పోస్టులు లేకపోవడం వల్ల 30% వేగంగా రవాణా కార్యకలాపాలు జరుగుతాయి. పన్ను రీఫండ్ ఆటోమేటిగ్గా జరగడం వల్ల నిధుల లభ్యత పెరిగి వ్యాపారాలు ఊపందుకుంటాయి. ఏఐని ఉపయోగించుకుని ఉల్లంఘనలు జరిగిన చోటనే తనిఖీలు, విచారణలు ఉంటాయి. అందరినీ ఇబ్బంది పెట్టడం ఉండదు.

- భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండాలి. ఇందులో తెలుగువారి పాత్ర ప్రముఖంగా ఉండాలనేదే నా ఆకాంక్ష. జీఎస్టీ సంస్కరణలతో స్వర్ణాంధ్ర విజన్-2047లోని 10 సూత్రాలు ఊపందుకుంటాయి.
- కొంతమంది ఆపరేషన్ సిందూర్‌ను ఎగతాళి చేశారు. కానీ ఇప్పుడు అమెరికా లాంటి దేశం కూడా ఇండియాతో సంబంధాల కోసం ఎదురుచూపులు చూస్తోంది. ఇది మోదీ ఘనత.

\- సీఎం చంద్రబాబు



11 ఏళ్లలో ఎన్నో సాధించాం..

2014 తర్వాత 144 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వచ్చాయి ఎయిర్‌పోర్టులు రెట్టింపు అయ్యాయి. 60 శాతం హైవేలు కొత్తగా వేశారు. డీబీటీ లావాదేవీలు 90 శాతం పెరిగాయి. 2.7 కోట్ల ఇళ్ల నిర్మాణం జరిగింది. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 34 శాతం పెరిగాయి. స్వదేశీ రక్షణ వ్యవస్థలు తయారు చేసుకున్నాం. 80 కోట్ల మందికి బియ్యం పంపిణీ జరుగుతోంది. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారు. స్టార్టప్‌లు 350 నుంచి లక్షన్నరకు పైగా పెరిగాయి. వందల ఉత్పత్తుల ధరలు 22వ తేదీ నుంచి తగ్గిపోతున్నాయి. వీటిపై ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. 22 నుంచి అక్టోబరు 22 వరకు ఈ అవగాహన కార్యక్రమం కొనసాగాలి.

6 గంటలు మనసుపెట్టి..

ఎమ్మెల్యేలు 6గంటలు మనసు పెట్టి అసెంబ్లీలో కూర్చుని సమస్యలు అర్థం చేసుకోవాలి. మంత్రులు, సంబంధిత అధికారులు సభలో ఉండాలి. ఈ అసెంబ్లీ 175 మంది కోసం కాదు.. ఐదు కోట్ల మంది భవిష్యత్ కోసం. ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో నమ్మకంతో ప్రార్థనలు చేస్తాం. చట్టసభలు పవిత్ర దేవాలయాలు. రేట్ల తగ్గింపుపై ప్రచారమే కాదు.. ప్రజల మనోభావాలకు అనుగుణంగా సంస్కరణలు తెచ్చే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుంది. నేను వారానికి 3 రోజులు యోగా చేస్తున్నా. యోగా దినోత్సవం రోజున మీరంతా ఫొటోలకు పోజులిచ్చారు.. కానీ రోజూ చేయడం లేదు కదా! రోజు యోగా చేయండి.. ఆరోగ్యానికి మంచిది.

ఎన్టీఆర్‌కు నివాళికి 10 మందేనా?

» ప్రజాప్రతినిధుల గైర్హాజరుపై సీఎం సీరియస్

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల తొలిరోజు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు నివాళి అర్పించడం ఆ పార్టీ ఆనవాయితీ. అయితే గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, చినరాజప్ప, కాగిత కృష్ణ ప్రసాద్, బూర రామాంజనేయులు, బోడె ప్రసాద్, తెనాలి శ్రావణ్ కుమార్, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాత్రమే ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి అసెంబ్లీకి వచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. కొన్నేళ్లుగా పాటిస్తున్న సంప్రదాయాన్ని విస్మరించడం ఏమిటని విప్‌లపై సీరియస్ అయ్యారు.

అద్భుత ఫలితాలు..

2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రస్తుతానికి పరోక్ష పన్నుదారులు 65 లక్షల నుంచి 1.51 కోట్లకు (132 శాతం) పెరిగారు. 2018లో జీఎస్టీ వసూళ్లు రూ.7.19 లక్షల కోట్లు ఉండగా.. 2025 నాటికి రూ.22.08 లక్షల కోట్లకు పెరిగాయి. రెండు శ్లాబులను పూర్తిగా తీసేయడం.. వందల కొద్దీ వస్తువులపై పన్నులు సవరించడం (తగ్గించడం) వల్ల వినియోగం పెరుగుతుంది. దీంతో డిమాండ్, ఉత్పాదకత పెరుగుతాయి. తద్వారా కొత్త ఉద్యోగాలు వస్తాయి. వాటి రాకతో పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరుగుతుంది. ఈ సంఖ్య పెరిగితే పన్నులు మరింత తగ్గుతాయి. పాలు, పనీర్, పెరుగుపై ఉన్న 5 శాతం పన్నుతీసివేశారు. నిత్యావసరాలు, షాంపూ, టూత్‌పేస్ట్, తలనూనెలు, సబ్బులు, వెన్న నెయ్యి, వంటపాత్రలపై ఉన్న 12 శాతం పన్ను 5 శాతానికి తగ్గుతోంది. కార్లు, ఫ్రిజ్‌లు, ఏసీలపై పన్ను 18 శాతానికి తగ్గించారు. ఇలా అన్ని రంగాల్లోనూ.. ముఖ్యంగా వ్యవసాయ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో పన్నులు తగ్గడం ప్రజలకు మేలు చేసే అంశం.

ప్రజలకు, ఆర్థిక వ్యవస్థలకు లాభదాయకం

» ఆర్థిక ఆటుపోట్లున్నా దేశ ప్రగతి కోసం మద్దతు

» అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలు ప్రజలకు, ఆర్థిక వ్యవస్థలకు లాభదాయకమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అసెంబ్లీలో జీఎస్టీ సంస్కరణలపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'దేశంలోని ప్రతి పౌరుడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూర్చే చారిత్రక నిర్ణయం ఇది. 140 కోట్ల మంది ప్రజలకు మేలు చేసే ఈ సంస్కరణలకు రాష్ట్రం నిర్మాణాత్మక సహకారం అందించడం గర్వకారణం. రాష్ట్ర ఆదాయానికి నష్టం వాటిల్లినా సామాన్యుల ప్రయోజనాల కోసం ఈ సంస్కరణలను బలంగా సమర్థించాలని సీఎం చెప్పారు. రాష్ట్రానికి ఆర్థిక ఆటుపోట్లున్నా దేశం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సంస్కరణలు వ్యాపారాలను సులభతరం చేస్తాయి. పన్ను వ్యవస్థల్లో పారదర్శకత పెంచుతాయి. పరిశ్రమల అభివృద్ధికి, ప్రజల కొనుగోలు శక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయి. కొత్త పెట్టుబడులు ఆకర్షిస్తాయి. స్థిరమైన వృద్ధి దిశగా దేశాన్ని నడిపిస్తాయి. వ్యవసాయ రంగంలో వాడే ఎరువులు, యంత్రాల రేట్లు తగ్గడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజల వృద్ధి చెందుతారు.పాలు, పెరుగు, వెన్న, సబ్బులు, షాంపూలపై పన్నులు తగ్గడంతో కుటుంబ బడ్జెట్లు తగ్గుతాయి. సిమెంటు రేట్లు తగ్గడం వల్ల గృహనిర్మాణ వ్యయాలు తగ్గి, అమ్మకాలు పెరుగుతాయి. అత్యవసర మందులపై పన్ను సున్నాశాతం చేయడంతో ప్రజారోగ్యం మెరుగుపడుతుంది. బీమా ప్రీమియంపై పన్ను ఎత్తేయడం ప్రజలకు మేలుచేస్తుంది.' అని పవన్ పేర్కొన్నారు.

ఆనందంగా ఉంది: లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తీసుకొచ్చిన విప్లవాత్మక జీఎస్టీ సంస్కరణలను అభినందిస్తూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానంలో తానూ భాగస్వామిని కావడం ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. జీఎస్టీ సంస్కరణలు సామాన్య ప్రజలకు గణనీయమైన ప్రయోజనాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. వీటిని అమలు చేసినందుకు ప్రధానితోపాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలిపారు.

27 వరకు అసెంబ్లీ సమావేశాలు

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను 8 పని దినాలకు కుదించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన గురువారం జరిగిన శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. గురువారం (18న) ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 27 వరకూ కొనసాగనున్నాయి. శుక్రవారం నీటిపారుదల రంగంపై చర్చించనున్నారు.

విజనరీ లీడర్ చంద్రబాబు

జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రానికి నష్టం వచ్చినా.. ప్రజలకు సరసమైన ధరలకు వస్తువులు అందుబాటులో ఉంటాయని, పేదలకు కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పిన విజనరీ లీడర్ చంద్రబాబు. జీఎస్టీ శ్లాబుల తగ్గింపు, కొన్ని వస్తువులపై పన్ను ఎత్తివేత వల్ల పేదలపై భారం తగ్గుతుంది. జీఎస్టీ-2.0పై చర్చను స్వాగతిస్తున్నాం. దేశం, రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ఎన్డీయే, మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సారథ్యంలోనే సాధ్యం. - నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు

జగన్ ప్రతిపక్ష హోదా అడగడం తప్పు: అచ్చెన్న

» అవినీతి బయటపడుతుందనే అసెంబ్లీకి రావట్లేదు: బుచ్చయ్య

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓడిపోయిన నాయకుడు అసెంబ్లీకి వచ్చి కూర్చుంటే ఎంత తప్పో.. జగన్ ప్రతిపక్ష హోదా అడగడం కూడా అంతే తప్పని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. 11 సీట్లు వచ్చిన పార్టీ నేతలు ప్రతిపక్ష హోదా అడగడం సిగ్గుచేటని, వారి చెంప పగలగొట్టాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలు బయటకు వస్తున్నందుకే జగన్ అసెంబ్లీకి రావట్లేదని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య అన్నారు.

వైసీపీపై ఈసీ చర్యలు తీసుకోవాలి: యనమల

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీని బహిష్కరించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్నారని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఓ ప్రకటనలో విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన బాధ్యతలు, నైతిక విలువలను పట్టించుకోని వైసీపీపై ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వచ్ఛందంగానే కరేడులో భూములు: అనగాని

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీ ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక హబ్ కోసం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడులో భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గురువారం శాసన మండలిలో వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. 'ఇప్పటికే 500 ఎకరాలు ఇచ్చేందుకు రైతులు లిఖిత పూర్వకంగా అనుమతిచ్చారు. 300 ఎకరాలకు నష్టపరిహారం కూడా చెల్లించాం. అక్కడ ఎకరం రూ.ఐదు లక్షలు ఉండగా... భూసేకరణ చట్టం ప్రకారం రెండున్నర రెట్లు అదనంగా రూ.12.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిహారం పెంచాలని రైతులు కోరడంతో ఎకరాకు 20 లక్షలవరకు ఇవ్వాలని నిర్ణయించాం' అని తెలిపారు.

పింఛన్ల తొలగింపు అవాస్తవం: కొండపల్లి

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఏ ఒక్క అర్హుడి పింఛనూ తొలగించలేదు. పింఛన్లు తొలగించామని వైసీపీ చేస్తున్న ప్రచారం అవాస్తవం' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా... 'అనర్హులకు నోటీసులు మాత్రమే ఇచ్చాం. రెండు నెలల్లో రీ వెరిఫికేషన్ చేయాలని వైద్యారోగ్యశాఖకు సూచించాం' అని మంత్రి తెలిపారు.

మద్యం స్కాంపై త్వరలో వెలుగులోకి వాస్తవాలు

» రాష్ట్రంలో మద్యం మరణాలు లేవు: మంత్రి కొల్లు

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వంలో మద్యం కుంభకోణం జరిగింది. నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారు' అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బెల్టు షాపులు, నకిలీ మద్యం అమ్మకాలపై గురువారం శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. 'తమ హయాంలో మద్యం విషయంలో అంతా మంచే జరిగిందని వైసీపీ చెప్పడం సిగ్గుచేటు. మద్యం కుంభకోణంపై సిట్ విచారణ జరుగుతోంది. త్వరలో వాస్తవాలు బయటకు వస్తాయి. రాష్ట్రంలో మద్యం మరణాలు లేవు' అని మంత్రి తెలిపారు.

కాంగ్రెస్‌ను దెబ్బ కొట్టేందుకే ఓట్ల చోరీ: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ను దెబ్బకొట్టేందుకే దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ ఓట్ల చోరీకి పాల్పడ్డారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. భారత ఎన్నికల సంఘంపై ఏఐసీసీ ముఖ్యనేత రాహుల్‌గాంధీ హైడ్రోజన్ బాంబు పేల్చారని షర్మిల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఓట్ల దొంగలను భారత ఎన్నికల సంఘం ఎలా కాపాడుతుందో రాహుల్ ప్రజలకు వివరించారు. స్వయం ప్రతిపత్తి సంస్థ ఈసీఐ ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. లక్షలాది మంది ఓటు హక్కును ఈసీఐ కాలరాసింది. మోదీ కోసం అవసరమైన చోట్ల ఓట్లను తీసేసింది. ఇదే సమయంలో దొంగ ఓట్లను చేర్పించింది. మోదీ వద్దన్న చోట ఈసీఐ ఓట్లను తొలగిస్తోంది' అని షర్మిల ఆరోపించారు.

సోలార్ విద్యుదుత్పత్తి పెంచేందుకు కృషి

» బ్యాంకుల నుంచి రుణాలు: గొట్టిపాటి

» అంగన్వాడీల్లో పౌష్టికాహారం: సంధ్యారాణి

» టిడ్కో ఇళ్ల సమస్యలపై చర్చిద్దాం: స్పీకర్



అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుదుత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లతో ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చలు జరిపినట్లు అసెంబ్లీలో వెల్లడించారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, వసంత కృష్ణప్రసాద్, అరిమిల్లి రాధాకృష్ణ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2022లో రియల్ టైమ్ ఎనర్జీ విధానంలో భాగంగా ఏ రోజు ఉత్పత్తి ఆ రోజే వాడాలన్న నిబంధన తీసుకురావడం వల్ల పారిశ్రామిక రంగం అభివృద్ధిలో కుంటుపడిందని వసంత కృష్ణప్రసాద్ సభ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని సమస్యలపై సమీక్షిస్తున్నామని, సోలార్ విద్యుదుత్పత్తిని 78.50 గిగా వాట్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 55 వేల అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి విద్యార్థికి పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన భోజనం పెడుతున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అంగన్వాడీలను బలోపేతం చేయాలని, అందులో పిల్లలకు ఐక్యూ పెరిగేలా బలవర్ధక ఆహారం అందించాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. మంత్రి స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అన్నీ పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తల జీతాలు రూ.11,500 చెల్లిస్తున్నట్లు చెప్పారు. వైసీపీ సభ్యులు సభకు రాకపోవడంతో ఐదు ప్రశ్నలు వాయిదా పడ్డాయి. వాటికి సంబంధిత శాఖల మంత్రులు లిఖితపూర్వకంగా సమాధానం తెలిపారు.

- అనంతపురం జిల్లాతో పాటు రాయలసీమలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్న రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ)కు ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ అథారిటీ(ఎఫ్‌సీఆర్‌ఏ) రెన్యువల్ చేయించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర కోరారు. అనంతపురం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు, ఆసుపత్రులు, పేద విద్యార్థులకు క్రీడలు, భూగర్భ నీటి వనరులు పెంచేందుకు చెక్ డ్యామ్‌లు ఇతరత్రా కార్యక్రమాలు చేపట్టిన ఆర్డీటీ నిధుల కొరతతో అభివృద్ధి పనులు చేయలేకపోతోందని సభ దృష్టికి తీసుకొచ్చారు.

మంత్రులు ప్రశ్నలు నోట్ చేసుకోవాలి: అయ్యన్న

అసెంబ్లీలో సభ్యులు జీరో అవర్‌లో ప్రస్తావిస్తున్న ప్రశ్నలను మంత్రులు ఎవరైనా నోట్ చేసుకుని సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషి చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. సభలో తాము ప్రస్తావిస్తున్న సమస్యలపై ఎలాంటి సమాధానం రావట్లేదని సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పీకర్ ఇలా స్పందించారు.

- రాష్ట్రంలోని కో-ఆపరేటివ్ సొసైటీలపై ప్రభుత్వ ఆజమాయిషీ లేకపోవడం వల్ల వారే సొంత ఆడిట్ చేసుకొంటూ ప్రజల్ని తరచూ ముంచేస్తున్నారంటూ రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.
- ఆటో, క్యాబ్‌లపై భారీగా జరిమానాల విధింపునకు కారణమైన జీవో 21 రద్దు చేయాలని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు కోరారు.
- టిడ్కో ఇళ్ల సమస్యలపై బీజేపీ సభ్యులు విష్ణుకుమార్‌రాజు, ఈశ్వరరావు ప్రస్తావించారు. స్పీకర్ స్పందిస్తూ.. 'ఇది ముఖ్యమైన అంశం. ఒకరిద్దరి ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తే సరిపోదు. స్వల్పకాలిక చర్చ పెట్టి చర్చిద్దాం. సభ్యులు నోటీసు ఇవ్వండి' అని సూచించారు.

మళ్లీ అదే పాట పాడిన జగన్

» విపక్షనేత హోదా ఇస్తేనే సభకు వస్తా

» లేదంటే నామీడియాతో మాట్లాడుకుంటా!

» మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయండి

» వైసీపీఎల్పీ సమావేశంలో జగన్ నిర్దేశం



అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో విపక్ష నేత హోదాపై మాజీ సీఎం తిరిగి అదే పాట పాడారు. ప్రతిపక్ష నేత పదవి ఇచ్చేస్తే సభకు వస్తానని తన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన తెలిపారు. తద్వారా తాను, ఎమ్మెల్యేలు ఈసారీ అసెంబ్లీ బయటే ఉంటామని చెప్పేశారు. శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీలకు ఆయన దిశానిర్దేశం చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు..ఎమ్మెల్సీలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. "ప్రతిపక్షనేత హోదాను సభాపతి ప్రకటిస్తేనే శాసనసభకు వస్తాను. అసెంబ్లీకి సమాంతరంగా నేను ఎంచుకున్న మీడియాతో మాట్లాడతా. సభలో మాట్లాడాలనుకున్న ప్రజా సమస్యలను ప్రెస్ ద్వారా వెల్లడిస్తాను" అని తెలిపారు. శాంతిభద్రతలు, మెడికల్‌కాలేజీలు, యూరియా, అధిక ఎమ్మార్పీకి లిక్కర్ అమ్మకాలు, సూపర్ సిక్స్-సూపర్ హిట్...ఇలా పలు అంశాలపై మండలిలో నిలదీయాలని అక్కడ విపక్షనేత బొత్సను కోరారు.

ప్రభుత్వానికి బాధ్యత లేదు: బొత్స

ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి కనీస బాధ్యత లేదని శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్సీలు గురువారం సభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడారు. సభలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం, మంత్రులు బాధ్యతారహితంగా సమాధానాలు చెబుతున్నారని ఆయన మండిపడ్డారు. 50 ఏళ్లకే పెన్షన్, కల్తీ మద్యంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు లేవన్నారు. తిరుపతి, సింహాచలం ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు, దేవుడంటే ప్రభుత్వానికి లెక్కలేదని మండిపడ్డారు.

పేదల పట్టాల రద్దు అధికారం మీకెవరిచ్చారు?

» సీఎం చంద్రబాబుపై జగన్ ఆగ్రహం

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబూ... పేద అక్కచెల్లెమ్మలకు రిజిస్ట్రేషన్ చేసిమరీ ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసే అధికారం మీకు ఎవరు ఇచ్చారు?' అని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించారు. గురువారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'మీకు అధికారం ఇచ్చింది పేదలపై కత్తి కట్టడానికా? వారి సొంతింటి కలను నాశనం చేయడానికా? మీది పేదలకు ఏదైనా ఇచ్చే ప్రభుత్వం కాదని, వారికి అందుతున్న వాటిని తీసేసే రద్దుల ప్రభుత్వం అని, మీరు పేదల వ్యతిరేకి అని మరోసారి రుజువయింది. మా హయాంలో ఇచ్చిన స్థలాలను లాక్కుంటారా? తక్షణం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని జగన్ డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో పట్టాలు ఎంతమందికి, ఎంత ఖర్చుపెట్టి ఇచ్చిందీ వివరించారు.

ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది

» ఆదాయం తగ్గినా సామాన్యుల కోసం మద్దతు

» 22 నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తాం

» జీఎస్టీ సంస్కరణలపై ఆర్థిక మంత్రి పయ్యావుల

» సీఎంను అభినందిస్తూ అసెంబ్లీలో తీర్మానం



అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. వారి పొదుపు కూడా మెరుగుపడుతుందన్నారు. గురువారం అసెంబ్లీలో జీఎస్టీ సంస్కరణలపై చేపట్టిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఎస్టీ 2.0 నిర్ణయం చారిత్రాత్మకమని, ఈ సంస్కరణల ద్వారా దేశ ప్రగతికి బాటలు వేశారని కేంద్ర ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ అంశంలో రాష్ట్రం తరఫున నిర్మాణాత్మక సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. పన్నుల విధానం సులభతరం కావడంతో పాటు పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. పన్నులు తగ్గడం వల్ల ప్రజలు ఎక్కువగా వినియోగించే వస్తువులకు డిమాండ్ పెరుగుతుందని, అది ఆర్థిక వృద్ధికి దారితీస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. సంస్కరణలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ నెల 22 నుంచి నెల రోజులపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పయ్యావుల ప్రకటించారు.

సంస్కరణలకు చంద్రబాబు తొలి మద్దతు

జీఎస్టీ రెండోతరం సంస్కరణలకు మద్దతు తెలిపిన సీఎం చంద్రబాబును అభినందిస్తూ మంత్రి కేశవ్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అసెంబ్లీ ఆమోదించింది. ఈ సందర్భంగా పయ్యావుల మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్రాదాయం తగ్గుతున్నా మొదటగా వాటిని స్వాగతించి, మద్దతు తెలిపినందుకు చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. దీనివల్ల రాష్ట్ర ఆదాయానికి రూ.8వేల కోట్లు నష్టం వస్తుందని ఆర్థిక శాఖ అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్తే... ఆ మేరకు ప్రజలకు లబ్ధి చేకూరుతుంది కదా అని అన్నారని వివరించారు. ఎంతో అనుభవం కలిగిన నాయకుడైన చంద్రబాబు మద్దతివ్వడంతో జీఎస్టీ సంస్కరణలపై అందరిలోనూ ఒక సానుకూల ధోరణి ఏర్పడిందన్నారు. ఈ అంశంపై జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యేలు గౌతుశిరీష, ఆదినారాయణరెడ్డి, ఆదిరెడ్డి వాసు, శ్రవణ్‌కుమార్ మాధవిరెడ్డి, ఏలూరి సాంబశివరావు, రామాంజనేయులు, బుచ్చయ్య చౌదరి మాట్లాడారు.

సభ్యులకు గౌరవం ఇవ్వడం నేర్చుకోండి

» మార్షల్స్‌పై లోకేశ్ సీరియస్

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ లాబీల్లో మార్షల్స్ అతి ప్రవర్తనపై మంత్రి లోకేశ్ సీరియస్ అయ్యారు. గురువారం అసెంబ్లీలోని తన చాంబర్ నుంచి లోకేశ్ బయటకు వచ్చే సమయంలో లాబీలో పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. లోకేశ్ వస్తున్నారంటూ మార్షల్స్ ఎమ్మెల్యేలను పక్కకుతోస్తూ హడావిడి చేశారు. దీన్ని గమనించిన లోకేశ్...సభ్యులతో ఎలా ప్రవర్తించాలో చెప్పకుండా మిమ్మల్ని ఇక్కడికి మార్షల్స్‌గా ఎలా పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇంకా తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్నామని అనుకుంటున్నారా.. అసెంబ్లీ ప్రాంగణంలో సభ్యులకు గౌరవం ఇవ్వడం నేర్చుకోండి' అంటూ సీరియస్ అయ్యారు.

మెగా డీఎస్సీ సభ వాయిదా



డీఎస్సీ నియామక పత్రాల కోసం అమరావతి వెళ్లేందుకు గురువారం కర్నూలు చేరుకున్న అభ్యర్థులు

భారీ వర్షాల నేపథ్యంలో నిర్ణయం

అమరావతి/తుళ్లూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేసేందుకు శుక్రవారం అమరావతిలో నిర్వహించతలపెట్టిన సభ వాయిదా పడింది. ఈ మేరకు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం గుంటూరులో భారీ వర్షాల కారణంగా అభ్యర్థుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని సభను వాయిదా వేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సభను ఎప్పుడు నిర్వహించాలనే దానిపై తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ప్రకటన వెలువడేసరికే రాయలసీమ జిల్లాల నుంచి అభ్యర్థులు బయల్దేరారు. వాయిదా సమాచారం తెలియగానే మధ్యలో వెనుదిరిగారు.



అమరావతి వెళ్లేందుకు తిరుపతి చేరుకున్న మహిళ రోడ్డు పక్కనే చిన్నారికి పాలు తాగిస్తున్న దృశ్యం

పోలీసు కస్టడీకి మిథున్‌రెడ్డి

రెండు రోజులు అనుమతించిన ఏసీబీ కోర్టు



విజయవాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి (ఏ4)ని ఏసీబీ కోర్టు రెండు రోజులు పోలీసు కస్టడీకి ఇచ్చింది. ఈ మేరకు న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారం తీర్పు ఇచ్చారు. లిక్కర్ కేసులో మరిన్ని వివరాలు సేకరించేందుకు మిథున్‌రెడ్డిని ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు పిటిషన్ వేశారు. దీనిపై వాదనలు పూర్తవ్వడంతో న్యాయాధికారి తీర్పును వెలువరించారు. శుక్రవారం, శనివారం కస్టడీ విచారణకు అనుమతిచ్చారు. మిథున్‌రెడ్డి ప్రస్తుతం రాజమహేంద్రవరం జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సిట్ అధికారులు మిథున్‌రెడ్డిని శుక్రవారం ఉదయం అక్కడ అదుపులోకి తీసుకొని, ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించిన తర్వాత విజయవాడకు తరలిస్తారు. మరోవైపు మద్యం స్కాం కేసులో ఏసీబీ కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు వేసిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వాటిని వెనక్కి తీసుకున్నారు. వాటి స్థానంలో గురువారం రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.

ఐపీఎస్ అధికారి సంజయ్‌కు ఎదురుదెబ్బ

అగ్నిమాపక శాఖ, సీఐడీలో కోట్ల రూపాయల నిధుల దుర్వినియోగం కేసులో నిందితుడిగా ఉన్న ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌కు విజయవాడ ఏసీబీ కోర్టులో చుక్కెదురైంది. ఆయన బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారం తీర్పు ఇచ్చారు. ప్రస్తుతం సంజయ్ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

లిక్కర్ నిందితులకు రిమాండ్ పొడిగింపు

8 మందికి 26 వరకూ పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు

విజయవాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం స్కాంలో నిందితులుగా ఉన్న ఎనిమిది మందికి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. ఎంపీ మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, బూనేటి చాణక్య, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, ఎడ్ల నవీన్‌కృష్ణలను పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. డిఫాల్ట్‌ల బెయిల్‌పై హైకోర్టులో తీర్పు పెండింగ్‌లో ఉండటంతో రిమాండ్‌ను ఈనెల 26 వరకు పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులిచ్చారు. తమకు సంకెళ్లు వేసి తీసుకొచ్చారని ఎస్కార్ట్ సిబ్బందిపై న్యాయాధికారికి బాలాజీకుమార్, నవీన్‌కృష్ణ ఫిర్యాదు చేశారు. బెయిల్‌పై ఉన్న మాజీ ఐఏఎస్ కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, పైలా దిలీప్ వాయిదాకు హాజరవ్వగా, గోవిందప్ప ఆబ్సెంట్ పిటిషన్ దాఖలు చేశారు. రిమాండ్ పొడిగింపు తర్వాత నిందితులు కుటుంబసభ్యులతో మాట్లాడుకునేందుకు న్యాయాధికారి అనుమతించారు.

కడప సెంట్రల్ జైల్లో దస్తగిరికి బెదిరింపులపై మరోమారు విచారణ

జైలు అధికారులు, డాక్టర్ నుంచి వివరాల సేకరణ

కడప క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసుకు సంబంధించి దస్తగిరిని జైలులో బెదిరించిన వ్యవహారంలో ఏర్పాటైన కమిటీ గురువారం మరోమారు కడప సెంట్రల్ జైల్లో విచారణ చేపట్టింది. అప్పట్లో పనిచేసిన జైలు అధికారులతో పాటు మెడికల్ క్యాంపు నిర్వహించిన వైద్యులు, జైల్లో పనిచేసిన డాక్టర్ పుష్పలతను ప్రశ్నించింది. ఒక్కొక్కరిని పిలిచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. నేడు మరికొందరిని విచారించే అవకాశం ఉంది. 2023 నవంబరు 28న కడప జైల్లో అప్పటి జైలు పర్యవేక్షణాధికారి ప్రకాశ్, వైద్యురాలు పుష్పలత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆ సమయంలో వివేకా హత్య కేసులో ఏ-5గా ఉన్న దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి వైద్యశిబిరంలో ఉన్నారు. జైలులో మరో కేసులో రిమాండ్‌లో ఉన్న తనను చైతన్యరెడ్డి కలిసి రూ.20 కోట్లు ఇస్తామని ప్రలోభ పెట్టడమే కాకుండా సహకరించకపోతే చంపేస్తామని బెదిరించినట్లు దస్తగిరి ఆరోపించారు. దీనిపై కేసు నమోదైంది.

రెండు రోజుల్లో విచారణకు రండి

భూమనకు మళ్లీ పోలీసుల నోటీసులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల్లో విచారణకు హాజరు కావాలని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి పోలీసులు మళ్లీ నోటీసులు జారీచేశారు. అలిపిరి ఎస్ఐ అజిత గురువారం నోటీసును వాట్సా‌ప్‌లో పంపారు. రెండ్రోజుల్లోగా తప్పనిసరిగా తిరుపతి డీఎస్పీ ఎదుట హాజరుకావాలని పేర్కొన్నారు. శ్రీమహా విష్ణువుకు అపచారమంటూ భూమన తీవ్ర విమర్శలు చేయడాన్ని టీటీడీ సీరియస్‌గా తీసుకున్న విషయం తెలిసిందే. టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోవిందరాజులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. గురువారం డీఎస్పీ ఎదుట విచారణకు రావాలని బుధవారం భూమనకు నోటీసులిచ్చారు. ఆయన హాజరుకాకపోవడంతోపాటు గురువారం అందుబాటులో లేకపోవడంతో మళ్లీ నోటీసు జారీచేశారు. దీనిపై భూమన స్పందించి హాజరవుతానని తెలిపినట్టు పోలీసులు చెప్పారు.

సంక్రాంతికి పశ్చిమ బైపాస్ సిద్ధం

చినకాకాని వద్ద 2 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్: కేంద్ర మంత్రి పెమ్మసాని

మంగళగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి గొల్లపూడి మీదుగా హైదరాబాద్, విశాఖపట్నం కనెక్టివిటీకి ఉపయోగపడే పశ్చిమ బైపాస్ రోడ్డును సంక్రాంతి నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వెస్ట్ బైపాస్ నిర్మాణ పనులను నేషనల్ హైవేస్ అధికారులతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. పెండింగ్ పనులు, అండర్‌పాస్ నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెమ్మసాని మాట్లాడుతూ.. 'గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత ప్రణాళికల వలన ఇక్కడ ప్రయాణ దూరం పెరిగింది. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అవుటర్ రింగు రోడ్డు ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభించబోతుంది. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రూ.2 కోట్ల నిధులతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం' అని తెలిపారు.

రెవెన్యూ కోర్టు కేసులు

ఆన్‌లైన్ పరిధిలోకి

- ఇనాం, ఆర్ఓఆర్ వివరాల నమోదు
- ఆర్‌సీఎంఎస్‌లోకి కేసుల డేటా
- ఇప్పటి వరకు 10,142 అప్‌లోడ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో రెవెన్యూ కోర్టుల్లో ఏయే కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని పరిష్కారానికి నోచుకోలేదు? అన్నది త్వరలో తేలనుంది. వాటి వివరాలను రెవెన్యూ శాఖ ఆన్‌లైన్‌లోకి తీసుకొస్తోంది. ఇనాం డీటీ, ఆర్‌డీఓ, జాయింట్ కలెక్టర్, అప్పీల్స్ కమిషనర్, సెటిల్‌మెంట్ కమిషనర్, ఇంకా రెవెన్యూ స్పెషల్ సీఎస్, రెవెన్యూ మంత్రి వద్ద ఉండే కోర్టుల్లోని డేటా అంతా రెవెన్యూ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టం(ఆర్‌సీఎంఎస్)లోకి తెస్తోంది. ఇనాం రద్దు చట్టం-1957 పరిధిలోని క్లెయిమ్‌లు ఇనాం డీటీల వద్ద భారీగా పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లాల వారీగా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఇప్పటి వరకు ఎన్ని కేసులు పరిష్కరించారు? అప్పీళ్ల దశలో ఉన్న కేసులు ఎన్ని? అన్న సమాచారం రెవెన్యూ శాఖ వద్ద స్పష్టంగా లేదు. ఆయా జిల్లాల్లో కూడా సరైన డేటా లేదు. పలుకుబడి ఉన్న, రాజకీయ ఒత్తిళ్లతో ముడిపడిన ఇనాం కేసులే త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయి. ఆ కేసుల్లో ఏం తీర్పులు ఇచ్చారో కూడా రికార్డులు అందుబాటులో ఉండటం లేదు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తక చట్టం(రికార్డ్ ఆఫ్ రైట్స్-ఆర్ఓఆర్)-1957 కేసులు ఇంతకుముందు జిల్లా స్థాయిలో ఆర్‌డీఓలు చూసేవారు. ఆ తర్వాత ఆ అధికారం డీఆర్‌ఓలకు అప్పగించారు. ఇప్పుడు మళ్లీ ఆర్‌డీఓలకే అప్పగిస్తూ చట్టసవరణ చేశారు. ఈ నేపథ్యంలో ఇకపై ఇనాం, ఆర్ఓఆర్ కేసుల వివరాలన్నీ ఆర్‌సీఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేయాలని భూపరిపాలనా ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి ఇటీవల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా భారీగా అసైన్డ్ చట్ట ఉల్లంఘన కేసులున్నాయి. వీటిని తహసీల్దార్, ఆర్‌డీఓ, జేసీలు చూస్తున్నారు. ఎవరి స్థాయిలో ఎన్ని కేసులున్నాయి? వాటి తాజా పరిస్థితి ఆర్‌సీఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేయాలని జయలక్ష్మి ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు అన్ని జిల్లాల్లో కలిపి 10,142 కేసుల వివరాలను ఇందులో అప్‌లోడ్ చేసినట్లు తెలిసింది. అసైన్డ్ చట్టం పరిధిలోకి వచ్చేవి 523, ఆర్ఓఆర్ చట్టానికి సంబంధించినవి 9,489 కేసులను అప్‌లోడ్ చేశారు. ఇందులో కొత్తగా భూ కబ్జాలకు సంబంధించిన కేసుల డేటాను కూడా కలుపుతున్నారు. జిల్లాల్లో ఉన్న అన్ని భూ వివాదాల కేసులను పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేయించాలని సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేశారు.

హాయ్‌ల్యాండ్‌లో 65 రోజులు ఏం చేశారు?

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేసినట్లు, రూ 20లక్షల ఖర్చు చేసినట్లు రికార్డుల్లో ఉందని ధర్మాసనం గుర్తు చేసింది. ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పీఎస్ఆర్ ఆంజనేయులు ఉండగా జరిగిన గ్రూపు-1 మెయిన్స్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని, హ్యాయ్‌లాండ్ వేదికగా ఆనాడు పలువురు గృహిణులను, చివరకు ఆటో డ్రైవర్లను కూడా ఈ ప్రక్రియలో భాగం చేశారనే ఆరోపణలను నిర్ధారిస్తూ సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని, ఎంపిక ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేయాలని ఆదేశిస్తూ 2024 మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను రద్దు చేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఎంపిక అయిన అభ్యర్థులు, ఏపీపీఎస్సీ వేసిన అప్పీళ్ల పై గురువారం హైకోర్టు ధర్మాసనం తుది విచారణ ప్రారంభించింది. తీర్పు వెలువడిన వెంటనే ఫిర్యాదు ఎందుకు చేయలేదని, ఏడాది సమయం ఎందుకు తీసుకున్నారని ఈ సందర్భంగా హైకోర్టు నిలదీసింది. వేలమంది అభ్యర్థుల భవిష్యత్తుతో ఏపీపీఎస్సీ ఆడుకుంటోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఏపీపీఎస్సీ, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తరఫు వాదనలు ముగియడంతో ఎంపికకాని అభ్యర్థుల తరపు వాదనల కోసం విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా...ఏపీపీఎస్సీ తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. "2021 డిసెంబరు నుండి 2022 ఫిబ్రవరి మధ్య హాయ్‌ల్యాండ్‌లో తొలిసారి మాన్యువల్ మూల్యాంకనం జరిగిందన్న పిటిషనర్ల వాదనను వ్యతిరేకిస్తూ ఏపీపీఎస్సీ కౌంటర్ దాఖలు చేసింది. 2022 మార్చి-మేలో మాత్రమే ఏపీపీఎస్సీ కార్యాలయం, రెండు ప్రభుత్వ కళాశాలల్లో మూల్యాంకనం జరిగినట్లు ఆ కౌంటరులో పేర్కొంది. అప్పటి కార్యదర్శి పీఎస్ఆర్ వచ్చిన ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేస్తోంది. నివేదిక వచ్చేవరకు వేచి చూడాలి" అని ఆయన కోరారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాదులు సీవీ మోహన్‌రెడ్డి, పి.శ్రీరఘురాం, ఓ.మనోహర్‌రెడ్డి, న్యాయవాదులు శ్రీకాంత్, జీవీరెడ్డి వాదనలు వినిపించారు. "హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరిగిందనేందుకు ఆధారాలు లేవు. ఈ విషయంలో సింగిల్ జడ్జి పొరపాటుపడ్డారు. తీర్పు రద్దు చేయండి" అని కోరారు. ఎంపికకాని అభ్యర్థుల తరపున సీనియర్ న్యాయవాది శివ వాదనలు వినిపించారు. "హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరగడం వాస్తవం. ఆ ఫలితాలను ఏపీపీఎస్సీ తొక్కిపెట్టింది. అక్రమాలకు పాల్పడిన అధికారులను కాపాడేందుకు కంటితుడుపుచర్యగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు" అని వాదించారు.

అసలేం జరిగిందంటే..?

గ్రూపు-1 మెయిన్స్ కోసం 2018లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో మాన్యువల్‌గా ప్రశ్నాపత్రాలను మూల్యాంకం చేస్తామని ప్రభుత్వం తెలిపింది. అయితే, కరోనాను కారణంగా చూపించి ఆప్రక్రియను అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆన్‌లైన్‌లో పూర్తిచేసింది. దీనిపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించగా, నోటిఫికేషన్‌లో పేర్కొనట్టు మాన్యువల్‌గా మూల్యాంకనం జరపాలని ఏపీపీఎస్సీని ఆదేశిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు 2021 డిసెంబరు- 2022 ఫిబ్రవరి మధ్యలో హ్యాయ్‌లాండ్‌కు ప్రశ్నాపత్రాలు తరలించి అడ్డగోలుగా ఆప్రక్రియను 'మమ' అనిపించారని ఆరోపణలొచ్చాయి. ఆయనపై కేసు నమోదైంది.

గడువులోపే చార్జిషీటు వేశాం

- ఏసీబీ కోర్టు అభ్యంతరాలకూ బదులిచ్చాం: సీఐడీ
- లిఖితపూర్వక వాదనలు, కోర్టుల తీర్పులు సమర్పించాం
- వాటిని పరిగణనలోకి తీసుకోకుండానే లిక్కర్ నిందితులకు కోర్టు బెయిల్ ఇచ్చింది
- హైకోర్టు దృష్టికి తీసుకెళ్లిన సీనియర్ న్యాయవాది
- తదుపరి విచారణ 24వ తేదీకి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట గడువులోగా చార్జిషీటు వేసి.. కోర్టు లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ లిక్కర్ కేసు నిందితులకు ఏసీబీ కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసిందని సిట్/సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాము సమర్పించిన లిఖితపూర్వక వాదనలు, వాటిని బలపరుస్తూ వివిధ కోర్టులు ఇచ్చిన తీర్పులను కూడా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. మద్యం కుంభకోణం కేసులో ధనుంజయ్‌రెడ్డి(ఏ-31), కృష్ణమోహన్‌రెడ్డి(ఏ32), బాలాజీ గోవిందప్ప(ఏ33)లకు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ వేసిన పిటిషన్‌పై లూథ్రా గురువారం కూడా తన వాదనలు కొనసాగించారు. 'అన్ని వివరాలతో చార్జిషీటు వేయడం వరకే దర్యాప్తు అధికారి బాధ్యత. దానిని పరిగణనలోకి తీసుకోవాలా లేదా అనేది పూర్తిగా ప్రత్యేక కోర్టు పరిధిలోని వ్యవహారం. దర్యాప్తు సంస్థ వేసిన చార్జిషీటును సంబంధిత న్యాయస్థానం పరగణనలోకి తీసుకోలేదనే కారణంతో నిందితులు డీఫాల్ట్ బెయిల్ కోరడానికి వీల్లేదని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే నిందితులకు ఏసీబీ కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసింది' అని తెలిపారు. గోవిందప్ప తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఆగస్టు 26నే గోవిందప్ప డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ వేశారు. అప్పటికి ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఏసీబీ కోర్టు దీనిపై నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. ఏసీబీ కోర్టు లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరిస్తూ సెప్టెంబరు 1న సీఐడీ వేసిన మెమోను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం లేదు. తదుపరి దర్యాప్తునకు కోర్టు అనుమతి అవసరం లేదన్న ప్రాసిక్యూషన్ వాదన సరికాదు' అన్నారు. కృష్ణమోహన్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపిస్తూ.. 'నిర్దిష్ట గడువుకు మించి నిందితులను నిర్బంధించకుండా సీఆర్‌పీసీ సెక్షన్ 167 నిరోధిస్తోంది. గడువులోగా దర్యాప్తు పూర్తికాకుంటే బెయిల్ మంజూరు చేయడం తప్పనిసరి. ఏసీబీ కోర్టు అభ్యంతరాలకు సమాధానాలు ఇవ్వడంలో దర్యాప్తు అధికారి విఫలమయ్యారు' అని తెలిపారు. కోర్టు సమయం ముగియడంతో విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు.

అంతా పేదలేనా?

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాల సంఖ్యను మించి తెల్ల రేషన్ కార్డులు ఉండేవి! అదో రకం అరాచకం. బియ్యాన్ని పక్కదారి పట్టించేందుకు బినామీ పేర్లతో కార్డులు తీసుకునేవారు. ఇప్పుడు... బయో మెట్రిక్, ఈ-పోస్ యంత్రాల కారణంగా బినామీ కార్డుల సంఖ్య తగ్గింది. కానీ... అర్హత, అవసరంలేని వాళ్లూ కార్డులు తీసేసుకుంటున్నారు. అధికారిక అంచనా ప్రకారం... రాష్ట్ర జనాభా 5 కోట్లా 30 లక్షలు. రాష్ట్రంలోని కుటుంబాల సంఖ్య 1.71 కోట్లు. మరి బియ్యం కార్డుల సంఖ్య ఎంతో తెలుసా? రాష్ట్రంలో 1,45,97,486 రేషన్ కార్డులున్నాయి. ఈ లెక్కన రాష్ట్రంలో 85 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నవే. 5.30 కోట్ల జనాభాలో దాదాపు 4.75 కోట్ల మందికి రేషన్ బియ్యం అందుతున్నాయి. వీరిది రేషన్ బియ్యంపై ఆధారపడి జీవించేంత పేదరికమన్న మాట! ఇక... రాష్ట్రంలో బియ్యం కార్డుల్లేని కుటుంబాల సంఖ్య 26 లక్షలు! వీరంతా ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ పరిధిలోకి వచ్చే ప్రైవేటు ఉద్యోగులు, ఇతరులు! అన్నిరకాల ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రంలో 15 లక్షల మంది ఉన్నారు. వెరసి... 'అధికారికం'గా ఆదాయంతో రికార్డులకు చిక్కేవారు మినహా... మిగిలిన కుటుంబాలన్నీ బియ్యం కార్డులు ఉన్నవే!

వేల కోట్లు వృథా...

ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 5 కిలోల చొప్పున ప్రతి నెలా 2.30 లక్షల టన్నుల రేషన్ బియ్యాన్ని అందిస్తున్నారు. అదీ... ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా, పూర్తి ఉచితంగా! బియ్యం సేకరణ, సార్టెక్స్ ఫోర్టిఫికేషన్, స్టోరేజీ, రవాణా, డీలర్ కమీషన్... ఇలా కలిపి ఒక్క కిలో బియ్యం కోసం ప్రభుత్వం 48 రూపాయలు ఖర్చు చేస్తోంది. కేవలం రేషన్ బియ్యం పంపిణీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా పెడుతున్న ఖర్చు దాదాపు రూ.15 వేల కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్న వ్యయం దాదాపు రూ.7 వేల కోట్లు.



వీరు మాత్రమే అర్హులు...

- బియ్యం కార్డు పొందేందుకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలివి...
- మాగాణి 3 ఎకరాల్లోపు, వర్షాధారమైతే 10 ఎకరాల్లోపు ఉండాలి. రెండూ కలిపి... పదెకరాలు దాటొద్దు.
- పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి ఇల్లు ఉండొద్దు.
- విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లు దాటొద్దు.
- ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు అనర్హులు.
- సొంత కారు ఉన్న వారు రేషన్ కార్డు పొందేందుకు అర్హులు కారు. (ఎల్లో ప్లేట్ కారు ఉన్న వారు అర్హులే)

ఎందుకంత మోజు?



రేషన్ బియ్యం తినకున్నా కార్డు ఎందుకు తీసుకుంటున్నారు? ఈ ప్రశ్నకు సమాధానం అందరికీ తెలిసిందే! ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకానికీ... 'రేషన్ కార్డు' కలిగి ఉండటమే అర్హత. ఎన్టీఆర్ వైద్య సేవ నుంచి సామాజిక పింఛను, పక్కా ఇంటి దాకా... ఏదైనా సరే! రేషన్ కార్డు ఉన్న వారే అర్హులు. అందుకే... బియ్యం తినకున్నా, కార్డులు మాత్రం తీసుకుంటున్నారు. ఈ విషయం వరుస ప్రభుత్వాలకూ తెలుసు. కానీ... అనర్హుల నుంచి కార్డులు ఏరివేసేందుకు మాత్రం ఎవరూ సాహసించరు. కారణం... విపక్షాలు రచ్చ చేస్తాయి. ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనే భయం! అందుకే... సంక్షేమ పథకాలకూ, రేషన్ కార్డుకూ మధ్య లింకు తెంచాలనే వాదన ఎప్పటి నుంచో ఉంది. కానీ... ఏ ప్రభుత్వమూ దీని గురించి ఆలోచించడంలేదు. ప్రస్తుతం ప్రభుత్వానికి ఏ గ్రామంలో, ఏ వీధిలో ఎన్ని ఇళ్లున్నాయి, వారి ఆర్థిక స్థితిగతులేమిటి అనేది నిమిషాల్లో తెలుసుకునేంత నెట్‌వర్క్ ఉంది. ఇంత సమాచారం చేతిలో ఉంచుకుని కూడా రేషన్ బియ్యంపై ఏడాదికి రూ.15,000 కోట్లు వృథా చేస్తూనే ఉన్నారు.

ఎంత దుర్వినియోగం...



నిజంగా పేదల కడుపు నింపేందుకు, ఆహార భద్రత కల్పించేందుకు ఎన్ని వేల కోట్లు ఖర్చు పెట్టినా తప్పు లేదు. కానీ... అత్యంత దుర్వినియోగమవుతున్న లేదా వృథా అవుతున్న పథకం ఏదైనా ఉందంటే, అది ఉచిత బియ్యం పథకమే! ఒక అంచనా ప్రకారం... రేషన్ బియ్యం తీసుకుంటున్న వారిలో 10 శాతం మాత్రమే ఆ బియ్యాన్ని వండుకుని తింటున్నారు. అత్యధికులు బియ్యాన్ని ఇంటి దాకా కూడా తీసుకెళ్లరు. అక్కడికక్కడే డీలర్లకే 'రీసేల్' చేసేస్తారు. కిలోకు రూ.10 నుంచి 12 రూపాయలు పుచ్చుకుని జేబులో పెట్టుకుని వెళ్లిపోతారు. కొందరు ఇంట్లో దోసెల పిండి కోసం వాడుకుంటారు. ఇంకొందరు హోటళ్లు, దుకాణాలకు అమ్మేస్తారు. ఇదీ పరిస్థితి!

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.